# లోకానికి నేనే వెలుగు

## కుటుంబం - పరిశుద్ధ కుటుంబం



సంపుటి - 39 ఏప్రిల్ - జూన్ 2016 సంచిక - 2

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

**ప్రచురణ**
భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.

**సంపాదక వర్గం**
ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్
ఫాదర్ పసల సోలోమోన్
ఫాదర్ మందగిరి జోస్‌బాబు
ఫాదర్ కొమ్మారెడ్డి మర్రెడ్డి

**గురువిద్యార్థుల వర్గం**
బ్రదర్ గోళ్ళ జయంతిరాజు
బ్రదర్ దారా చిన్నప్ప
బ్రదర్ పాల బాలస్వామి
బ్రదర్ ప్రత్తిపాటి అమృత్
బ్రదర్ కుచ్చర్ల మార్టిన్
బ్రదర్ లింగతోటి రత్న కిషోర్
బ్రదర్ యజ్జల అశోక్
బ్రదర్ నల్ల సుధీర్ కుమార్
బ్రదర్ కత్తుల సునీల్ బాబు

**చందా వివరములు**

సంవత్సరానికి మీ చందాను రూ. 100/- యం.ఓ., డి.డి..ల ద్వారా
St. John's Regional Seminary Society, Hyderabad
పేరున పంపించి మమ్మల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు
మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్ :

**St. John's Regional Seminary**
Ramanthapur, Hyderabad - 500 013.
Ph : 040-27201427, 27200370, Fax : 27209505
e-mail : stjohnshyd2@gmail.com

*Printed at : Holycrossprinters 9848145417*

# లోకానికి నేనే వెలుగు

సంపుటి-39 ఏప్రిల్ - జూన్ 2016 సంచిక-2

## కుటుంబం - పరిశుద్ధ కుటుంబం
## పరిశుద్ధ క్రైస్తవ కుటుంబం

**ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్**
**ప్రధాన సంపాదకులు**

**ఫాదర్ కొమ్మారెడ్డి మర్రెడ్డి**
**సంచిక సంపాదకులు**

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ 040-27201427, 27200370
e-mail : stjohnshyd2@gmail.com
website : stjohnseminaryhyd.org

# విషయసూచిక


సంపాదకీయం

1. **కుటుంబం దైవపిలుపునకు ముఖ్య ప్రేరణ ................................ 7**
   *– బ్రదర్ యజ్జల అశోక్*

2. **ఆధునిక కుటుంబానికి ఆదర్శం జనరేతు కుటుంబం ................... 14**
   *– బ్రదర్ కొంద్రు వేళంగణిరాజు*

3. **కుటుంబ కలహాలు, కారణాలు – పరిష్కార మార్గాలు .................. 25**
   *– బ్రదర్ తుడుము విజయ్*

4. **భారతదేశ కుటుంబ వ్యవస్థ – సమస్యలు .............................. 34**
   *– బ్రదర్ కుచ్చెర్ల మార్టిన్*

5. **కుటుంబాలలో కారుణ్య జూబిలి సంవత్సర వేడుకలు ................... 44**
   *– బ్రదర్ బొడ్డు సునీల్*

6. **పరిశుద్ధ గ్రంథములో కుటుంబ ప్రాధాన్యత............................. 60**
   *– బ్రదర్ మున్నంగి క్రాంతి కుమార్*

7. **శ్రీసభ అధికార పత్రాల బోధన –**
   **విద్యాబుద్ధులను గరపుటలో కుటుంబం పాత్ర........................... 66**
   *– బ్రదర్ మల్లవరపు శరత్‌బాబు*

8. **కతోలిక ప్రపంచం – కుటుంబ వ్యవస్థ.................................. 77**
   *– ఫాదర్ గోవా శౌరయ్య*

# సంపాదకీయం

మన పరిశుద్ధ తండ్రియైన ఫ్రాన్సిస్ జగద్గురువు ప్రస్తుత కాలంలోని కుటుంబ అంశంపై చర్చించారు. అటు తర్వాతనే దైవాంకిత జీవితం ద్వారా దేవుని సేవలో దృఢంగా ఉండగల దైవ సేవకులను కోరారు. ఇప్పుడు ప్రత్యేకమైన కారుణ్య సంవత్సరాన్ని ప్రకటించారు. కరుణ, జాలి, దయ, క్షమాపణ, ఓర్పు, సహనం అనే సుగుణాలన్నీ కుటుంబంలో ఉండాలని, అక్కడనుండే దైవాంకితులు జనిస్తారని, కుటుంబంలోనే కారుణ్యాన్ని అనుభవించవచ్చునని తెలియపరచారు. ఈ ప్రత్యేకమైన దైవకారుణ్య సంవత్సరంలో కుటుంబం ఎలా ఉండాలి. ప్రతీ కుటుంబం చిరు శ్రీసభగా ఎలా తయారుకావాలి, కుటుంబ వ్యవస్థ దేవుని ఏర్పాటు, కుటుంబాలన్నీ నజరేతులోని పవిత్ర కుటుంబంను పోలి ఉండాలి. ఇతర కుటుంబాలకు ఆదర్శంగ జీవించాలని, ఈ కుటుంబ జీవితంలో సమస్యలు వచ్చినా, క్లిష్ట పరిస్థితులు ఎదురైనా, విశ్వాసం కోల్పోకుండ వాటిని దైవశక్తితో ఎదుర్కొని అధిరోహించాలని ప్రస్తుత సంచిక తెలియజేస్తుంది.

శ్రీసభ నిగూఢమైన క్రీస్తు శరీరం. కనుకనే, ప్రతి కుటుంబంను ఆవాస (డొమెస్టిక్) శ్రీసభగా సంబోధించారు. అంటే, ప్రతి కుటుంబం క్రీస్తుయొక్క నిగూఢమైన శరీరమని మనం గ్రహించాలి. అపొస్తులుల నుండి పారంపర్యంగా వస్తున్న క్రైస్తవ జీవన విధానమే శ్రీసభ. అంటే, శ్రీసభ దానిలోనుండు బోధనాధికార వర్గం (మజిస్టేరియుం) ఎన్నో నైతిక, ఆధ్యాత్మిక, ఇంకను మనిషిని పవిత్రపరచే అంశాలను, కాలాన్నిబట్టి పరిస్థితులను, స్థితిగతులను, సమస్యలనుబట్టి అధికారపూర్వకంగా తరచూ బోధిస్తుంది. అనాది కాలంనుండి శ్రీసభ వివాహ కుటుంబాల గూర్చి, తల్లిదండ్రుల బాధ్యతలనుగూర్చి, ఇంకను బిడ్డలను ఎలా మలచాలనో అన్న విషయాలను అధికార పూర్వకంగా తెలియజేస్తుంది.



రెండవ వాటికను మహాసభల్లో వెలువడ్డ అధికారపత్రం "ఆధునిక ప్రపంచంలో శ్రీసభ" 52వ అంశం ఇలా చెబుతుంది: "కుటుంబం సంపూర్ణ మానవ వికాసానికి దోహదం చేసే పాఠశాల వంటిది. మరి ఈ కుటుంబమనే పాఠశాల సక్రమంగా పనిచేస్తూ, తగిన విధంగ ఫలాలు పొందాలంటే – భార్యాభర్తల మధ్య సఖ్యత, స్నేహభావం, ప్రేమ, అన్యోన్యత వెల్లివిరియాలి". ఈ ప్రస్తుత కాలం కుటుంబాలలో వివాహ జీవితంలోని కష్టాలను చూసి, సమస్యలను ఊహించుకొని, 'పెండ్లి పెటాకం వద్దు – ఒంటరి జీవితమే ముద్దు' అని ఏకాకి జీవితానికే మొగ్గు చూపుతున్నారు నేటి యువతరం. ఇంకొందరు ఒంటరిగా ఉండి, ఒక శిశువును పెంచుకోవచ్చునని చట్టపరంగా ఆమోదం పొందుతున్నారు. మరికొందరు స్వలింగానికి చెందిన ఇద్దరు వ్యక్తులు సహజీవనం సాగిద్దామనుకొని పెళ్లి చేసుకుంటున్నారు. ఇది దైవ చిత్తానికి విరుద్ధం, ఇది దేవుని ఏర్పాటు కాదు. ఇటువంటి దానిని మానసిక రుగ్మతగ పరిగణిస్తున్నారు మనస్తత్వ శాస్త్రజ్ఞులు. స్త్రీ పురుషులు చట్ట ప్రకారం వివాహం చేసుకొని, కుటుంబాన్ని పోషించుటయే ఆది నుంచి ఉన్న దేవుని ఏర్పాటు.

కుటుంబంలో సమస్యలు వస్తే విడాకులు తీసికొని, వేరువేరుగా జీవించటం పరిష్కారం కాదు. ప్రతి కుటుంబం కూడ ప్రార్థించే కుటుంబం కావాలి, విశ్వాసంలో ఎదగాలి, సమస్యలను దైవశక్తితో పరిష్కరించుకొని, శ్రీసభ బోధన ప్రకారం జీవించినట్లయితే అన్ని కుటుంబాలు కూడ పవిత్ర కుటుంబాలుగా, ఆదర్శ కుటుంబాలుగా తయారవుతాయి. ఇలా ఉండాలన్నదే నా ఆశ, ప్రార్థన. దేవుడు మీ కుటుంబాలను దీవించుగాక!

అనివార్య కారణాల వలన, నా అనుపస్థితమైన కాలంలో నాకు తోడ్పడిన వారందరికి నా వందనాలు. నా ఆలోచనలను తెలియపరచి, వ్యాసాలను వ్రాయమని భారమంతా మోపినా, నేను కోరినపుడు నాకు సహకరించిన బ్రదర్లందరికి నా హృదయపూర్వక వందనాలు. చివరి వ్యాసం వ్రాసిన ఫాదర్ గోవా శౌరయ్య గారికి కూడ నిండు వందనాలు. ఈ వ్యాసాలన్నింటిని సరిదిద్ది, ఓ రూపానికి తెచ్చిన ఫాదర్ ఫ్రాన్సిస్‌గారికి వందనాలు. పాఠకులకులందరికి నా నమస్సుమాంజలులు.

**ఫాదర్ కొమ్మారెడ్డి మర్రెడ్డి**
**సంచిక సంపాదకులు**

# 1. కుటుంబం దైవపిలుపునకు ముఖ్య ప్రేరణ

**– బ్రదర్ యజ్జల అశోక్**

**ఉపోద్ఘాతం**

క్రైస్తవ కుటుంబం అనగా కుటుంబసభ్యులు కలిసిమెలిసి క్రీస్తు ప్రేమలో జీవించడం. క్రైస్తవత్వం అనగా క్రీస్తుప్రేమను పదుగురికి పంచుకుంటూ జీవించడం. ఒకరితోనొకరు మంచి సంబంధాలు కలిగి, పరస్పరం ప్రేమ కలిగి, జీవించడమే నిజమైన క్రైస్తవత్వం. మనం ఒకరి భారాలను మరొకరు భరించి, క్రీస్తు నియమాలను పూర్తిగా నెరవేర్చు నిమిత్తమే దేవుడు కుటుంబంను ఈ లోకంలో ఏర్పరిచారు. మన కుటుంబాలు పరలోకానికి ప్రతిరూపాలుగా ఉండాలి. పరలోక నీతి, శాంతి, సంతోషాలను మన కుటుంబాలలో ప్రతిబింబించాలి. కనుకనే దేవుడు యేసుప్రభువు రూపంలో ఈ లోకాన ఓ కుటుంబంలో జన్మించి, మనకొక మాతృకను చూపారు (1 పేతురు 2:21). దేవుడు ముందుగా తన ప్రజలను ప్రేమించిన విధంగా తల్లిదండ్రులు తమ బిడ్డలను ప్రేమించాలి. అపుడు బిడ్డలు కూడ తల్లిదండ్రులను ప్రేమిస్తారు. నీవు దేనిని విత్తెదవో దానిని కోయుదువు (గలతీ 6:9). తల్లిదండ్రులు బిడ్డల్లో 'ప్రేమ' అనే భావాన్ని నాటితే దాని ఫలాన్నే కోస్తారు. దేవుని ప్రేమలో జీవిస్తూ తల్లిదండ్రులకు విధేయులగు బిడ్డలు మంచి బాటనుండి తొలగిపోరు. బాలుడు నడవవలసిన త్రోవను వానికి నేర్పాలి. వాడు పెరిగి పెద్దవాడైన పిమ్మట ఆ త్రోవను విడనాడలేదు. చిరు శ్రీసభ అయిన కుటుంబం క్రైస్తవ విశ్వాసంతో బలపడుతూ, రక్షణ మార్గంలో నడుస్తూ, క్రీస్తు సాధించిన రక్షణను ఇతరులకు అందించుటకు కుటుంబంలో తల్లిదండ్రులు తమ బిడ్డలను విశ్వాసం, ప్రేమ, నమ్మికలతో నడిపి, దేవుని సేవకు ప్రేరేపిస్తుండాలి.

## 1. తల్లిదండ్రుల విధులు

తల్లిదండ్రులు తమ బిడ్డలను దేవుని బిడ్డలుగా పరిగణించాలి. వారిని మానవ వ్యక్తులుగ గౌరవించాలి. తల్లిదండ్రుల ప్రథమ బాధ్యత తమ బిడ్డలకు విద్య గరపటం.



సున్నిత హృదయం, క్షమాగుణం, గౌరవం, విశ్వాసం, నిస్వార్థమైన సేవలనే నియమంగా గల గృహంగా ఇంటిని తీర్చిదిద్దాలి. అలా వారు ఈ బాధ్యతకు సాక్ష్యమిస్తున్నారు. బిడ్డలు ఈ విధమైన సుగుణాలను వారి పసితనంలో అలవర్చుకున్నట్లయితే వారి యొక్క ఆలోచనలు, ఆచరణలు దేవుని సేవకు ఎంతో దోహదపడతాయి. సుగుణాలను అభ్యాసం చేయుటకు ఇల్లు ఎంతో అనువైనది. నిజమైన స్వేచ్ఛలన్నింటికి పునాదియైన ఆత్మపరిత్యాగం, వివేకమైన తీర్పు, తమపై తమకే ఆధిపత్యం అను సుగుణాలతో శిక్షణ ఇవ్వాలి. తమ భౌతిక, సహజ ప్రవృత్తులు అంతరంగిక, ఆధ్యాత్మిక శక్తులకు లోబడునట్లుగ చేయగల మనోశక్తిని వారి బిడ్డలకు తల్లిదండ్రులు ప్రబోధించాలి. పిల్లలకు సుమాతృక ఇవ్వడం తల్లిదండ్రుల ఘనమైన బాధ్యత. పిల్లలముందు తమ తప్పులను అంగీకరించుట ద్వారా, పిల్లలను మంచిగా నడిపించగలరు. తొలి దశలోనే బిడ్డలకు తల్లిదండ్రులు విశ్వాస విద్యను ప్రారంభించాలి. క్రైస్తవ జీవిత సాక్ష్యం ద్వారా కుటుంబసభ్యులు విశ్వాసంలో పెరుగుటకు పరస్పరం సాయం చేసుకున్నప్పుడే విశ్వాస విద్య ప్రారంభమవుతుంది. బిడ్డలకు విశ్వాస నిగూఢ సత్యాలను నేర్పే మొదటి సువార్తికులు తల్లిదండ్రులే! తమ పిల్లలను బాల్యంలోనే ఆ సత్యాలలోనికి ప్రవేశపెట్టాలి, పరిచయం చేయాలి. శ్రీసభ జీవితంలో వారిని లేతప్రాయంలోనే భాగస్వామ్యులను చేయాలి. ఆరోగ్యకరమైన కుటుంబ జీవితం బిడ్డల అంతరంగిక దృక్పథాలను పెంపొందిస్తుంది. వారియొక్క జీవితాలను దేవునికి అంకితం చేసుకోటానికి చేయూతగా ఉంటాయి. దేవుని బిడ్డలుగ తమ పిలుపును కనుగొనుట, ప్రార్థన చేయుట వంటివి నేర్పాలి. గురుమండలం కృతజ్ఞతార్పణ సంఘం, క్రైస్తవ కుటుంబాల అర్చనా జీవితానికి గుండెలాంటిది. మానవ కుటుంబ శ్రేయస్సు కొరకు దైవపిలుపులు ఎంతగానో తోడ్పడతాయి.

## 2. ఇలలో దైవరాజ్య స్థాపనకు తల్లిదండ్రులు ముఖ్య కారకులు

బిడ్డలు తమనుతాము పూర్తిగా దేవునికి అంకితం చేసికొనుటకు తల్లిదండ్రులు ముఖ్యపాత్రను పోషిస్తారు. బిడ్డలు దేవుని ఆత్మవలన ప్రేరితులై, ఇతర గురువుల ఆదర్శ జీవితాల, మఠవాసుల మాతృక ద్వారా కూడ ప్రేరేపితులై దేవునిసేవ చేయుటకు సంసిద్ధులైనప్పటికీ, తల్లిదండ్రుల యొక్క ప్రమేయం లేకుండా తమ జీవిత ఆశయాలను నెరవేర్చలేరు. బిడ్డలు తమ తల్లిదండ్రులను బలవంతంగా మెప్పించి ఒప్పించినప్పటికి

తర్ఫీదు కాలమందు బిడ్డల మనసులో వెలితి అనేది చోటుచేసుకుంటుంది. కావున, కుటుంబంలో తల్లిదండ్రులు తమ పిల్లలను దైవసేవకు ప్రోత్సహించాలి. వారిని దేవుని ప్రేమ, సేవామార్గంలో నడిపిస్తూ నిరంతరం ప్రేరేపిస్తుండాలి. పిల్లలను ప్రేరేపించి ప్రోత్సహించినపుడు వారు ఉత్సాహంతో దేవునికి సేవ చేయాలన్న తపన, ఆశ, ఆనందం దినదినమూ పెరుగుతుంది. ఈవిధంగ బిడ్డలను ప్రేరేపించినట్లయితే తల్లిదండ్రులు దేవుని రాజ్యస్థాపనకు మొదటి కారకులు కాగలరు. ఎందుకంటే, తమ బిడ్డలను దైవసేవకు అంకితం చేసినపుడు బిడ్డలు తగు తర్ఫీదునందుకొని ఇలలో దైవరాజ్యాన్ని స్థాపించగలరు. దేవునియొక్క చిత్తాన్ని నెరవేర్చి ఆయన రాజ్యాన్ని నలుదిక్కులా వ్యాపింపజేయగలరు.

## 3. కుటుంబం – దైవరాజ్యం

కుటుంబ బంధాలు ముఖ్యమేగాని అవి పరిపూర్ణం కావు. పరిణతిలో, మానవీయ, ఆధ్యాత్మిక స్వయం పాలనలో బిడ్డ పెరగడంతోపాటు, దేవుని నుంచి వచ్చే తన అద్వితీయమైన పిలుపు స్పష్టంగ, శక్తివంతంగ కనిపిస్తుంది. ఈ పిలుపును తల్లిదండ్రులు గౌరవించి, దాన్ని అనుసరించుటకు తమ బిడ్డలను ప్రోత్సహించాలి. యేసుని అనుసరించటం క్రైస్తవున్ని మొట్టమొదటి పిలుపన్న బలమైన ఆలోచన వారిలో కలగాలి. తల్లినిగాని, తండ్రినిగాని నాకంటే మిన్నగా ప్రేమించువాడు నాకు యోగ్యుడు కాడని పిల్లలకు, కుమారునిగాని, కుమార్తెనుగాని నాకంటె అధికంగ ప్రేమించువారు నాకు యోగ్యుడు కానేరరని తల్లిదండ్రులకు క్రీస్తు తెలిపారు. ఆయనకు శిష్యుడు కావడమంటే దేవుని కుటుంబంలో చేరడానికి ఆహ్వానాన్ని అందుకోవటమే! ఆయన జీవన విధానానికి అనుగుణంగ జీవించడమే. పరలోకమందున్న నా తండ్రి చిత్తాన్ని నెరవేర్చువారు నా సోదరుడు, నా సోదరి, నా తల్లి అని చెప్పారు. ప్రభుని అనుసరించేందుకు, దైవరాజ్యం కోసం బ్రహ్మచారులుగా ఉండేందుకు, మఠవాసానికి లేదా మేత్రాసన గురుసేవకు తమ బిడ్డలలో ఎవరికైనా పిలుపు అందితే తల్లిదండ్రులు కృతజ్ఞతా భావంతో ఆ పిలుపును గౌరవించాలి.

తండ్రి ఎంపిక చేసిన రాయబారి యేసుక్రీస్తు. ఆయన తన ప్రచారం ప్రారంభం నుండి తనకు కావలసిన వాళ్ళను పిలిచారు. నేటికి కూడ దేవుడు తనకు కావలసిన వారిని తన సేవకు పిలుచుకుంటున్నాడు. క్రీస్తు తన పన్నిద్దరు శిష్యులను



తన ప్రతినిధులుగా నియమించాడు. వాళ్ళకు అపోస్తళ్ళని పేరు పెట్టాడు. వాళ్ళు తనతో ఉండటానికి, ప్రకటించడానికి పంపాలని ఆయన ముఖ్య ఉద్దేశం. అనాది నుంచి అపోస్తులు క్రీస్తుని రాయబారులు.

## 4. లోక చింతన వద్దు

తల్లిదండ్రులు తమ బిడ్డలకు దైవపిలుపు గురించి సవివరంగ తెలియజేయాలి. క్రైస్తవులుగా తల్లిదండ్రులు బిడ్డలు ఈ లోకంలో జీవిస్తారు. కానీ ఈ లోకానికి చెందినవారు కారన్నది పారంపర్య క్రైస్తవ ఆధ్యాత్మిక చింతన. తల్లిదండ్రులు దైవపిలుపునకు సంసిద్ధులయ్యే బిడ్డలను ఈ లోకం గురించి, పరలోకరాజ్య పరమ విలువలను గురించి తెలియజేయాలి. అప్పుడు వారి బిడ్డలు స్వదేశమైన పరలోకానికి చెందిన బిడ్డలవలె ఎదుగుతారు. ఎందుకంటే, దేవుడిచ్చిన ఆత్మ తిరిగి పరలోకం చేరుకోవాలి. ఈ లోకంలో మనం కొంతకాలం గడిపివెళ్ళాలి. ఈ లోక జీవితం ఒక మజిలీ మాత్రమే! ఈ లోకంలో మనం ప్రయాణీకులం. కాబట్టి మన దృష్టి ఎప్పుడూ పరలోకం వైపే సారించాలి. ఈ భూమి, భూలోక వస్తువులు, ఈ లోక విషయాలపై కాకుండ పరలోక విషయాలపై చిన్నప్పటి నుండే తల్లిదండ్రులు తమ బిడ్డల దృష్టిని నిలపాలి. ఈవిధంగ ఆధ్యాత్మికంగ వారియొక్క ఆశలను, ఆశయాలను దైవసేవ చేయుటకు ప్రేరేపించగలరు.

అయితే, గృహస్థులు ఈ లోక విషయాలపై అసలు దృష్టిని సారించకుండా ఉండటం అసాధ్యం. ఈలోక విధులను వదులుకోలేరు. తమ కుటుంబాన్ని పోషించి, పరామర్శించేందుకు ఈ లోక కార్యాల్లో పాల్గొనటం అత్యవసరమవుతుంది. ఏదియేమైనప్పటికి ఈలోకం ముఖ్యం కాదు. కాబట్టి ఇటువంటి లౌకిక విషయాలలో అవసరానికి తగినంత మాత్రమే నిమగ్నమవటం వారి ఆత్మ జీవితానికి మంచిది. ఈ లోకానికి చెందిన పనుల్లో పాల్గొనవచ్చు. కాని, వాటిలో తమ ఆశలను నిలుపకూడదు. ఒక పరదేశి ఓచోట కొంత కాలంపాటున్నా అక్కడ నివాసం ఏర్పరచుకోలేడు. అక్కడి విషయాలతో, వ్యక్తులతో భవబంధాలు అట్టే పెంచుకోడు. అదే విధంగా ఈ లోకంలో క్రైస్తవ జీవితం పక్కా నిబద్ధత కలిగుండాలి.

## 5. దైవపిలుపుల యెడల తల్లిదండ్రుల అభిప్రాయము

నాటి కాలంకన్నా నేటి యుగంలో దైవపిలుపుల యెడల తల్లిదండ్రుల అభిప్రాయంలో చాలా వరకు మార్పులొచ్చాయి. ఈ ఆధునిక కాలంలో జీవిస్తున్న

తల్లిదండ్రులకు నేటి లోకతీరును బట్టి దైవ పిలుపుల యెడ సరయిన అవగాహన లేదు.

### 5.1. ఆనాటి అభిప్రాయము

ఆనాటి కాలంలో తల్లిదండ్రులు క్రైస్తవ జీవిత విలువలను పాటిస్తూ, పిల్లలను అదేబాటలో నడిపించేవారు. దేవుని ప్రేమలో వారిని తీర్చిదిద్దేవారు. నైతిక విలువలను బోధించేవారు. దేవుని సేవకు వారిని ప్రేరేపించేవారు. కుటుంబంలో నుండి తమ బిడ్డ దేవునికి అంకితమవటం చాలా గొప్ప భాగ్యంగా భావించేవారు. చిన్నప్పటి నుండి వారికి విద్యా బోధనలతో సహా దైవజ్ఞానాన్ని, దైవభీతిని వారి హృదయాలలో స్థిరంగ పాదుకొనేటట్లు ఉత్సాహపరచేవారు. సమాజంలో పెద్దల యెడ గౌరవ మర్యాదల్ని నేర్పేవారు. ప్రతి ఆదివారం వివిధ ఆధ్యాత్మిక ఆరాధన కార్యక్రమాలకు బిడ్డలను కూడా తీసుకొని వెళ్లేవారు. ఈ విధంగ బిడ్డలను దేవుని సేవకు ఆకర్షితులై దైవసేవకు వారి జీవితాలను అంకితం చేసికొనుటకు ముందుకు వచ్చేవారు.

### 5.2. ఈనాటి అభిప్రాయం

ఈ ఆధునిక ప్రపంచంలో అన్ని రంగాలలో దినదినం అభివృద్ధి చెందడం వలన మనిషిలో కూడా చాలా మార్పులు వచ్చాయి. కేవలం తమ స్వార్థం కోసమే జీవిస్తున్న తీరులో భార్యాభర్తలు ఉన్నారు. అటువంటి సందర్భంలో దైవపిలుపు అనే మాట కూడ వారి చెవిన పడదు. కుటుంబంలో పిల్లలే లేనప్పుడు దైవపిలుపు గురించి ఎలా చెప్పగలం? సంతానం కలిగినా ఒకరు, ఇద్దరు లేక ముగ్గురితో ఆపేస్తున్నారు. పిల్లల పెంపకంలో కూడా చాలా మార్పులు, పరిణామాలు చోటు చేసుకున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను వివిధ రంగాలలో రాణించటానికి ప్రోత్సహిస్తున్నారు. కాని దైవసేవ చేయుటకు పిల్లలను ప్రోత్సహించడం బాగా బలహీనపడింది. బాగా చదువుకున్న కుమారుడైతే ఉన్నత చదువులు చదివించి మంచి ఉద్యోగంలో చేరి, డబ్బులు సంపాదిస్తాడని, అట్లే తెలివిలేని, చదువు వంటబట్టని కుమారుడైతే గురుచదువుకు వెళ్లిపోయినా పరవాలేదన్న వైఖరి నేటి తల్లిదండ్రులకు బాగా అబ్బింది. ఎందుకు పనికిరాని వస్తువులను దేవునికి అర్పించటం సరియైన అర్పణ కాదు. దేవుడు అటువంటి అర్పణను స్వీకరించినా ఆనందంతో అంగీకరించలేదు. కయీను ఆబేలు బలులను గూర్చి తెలుసు కదా!



## 6. దైవ పిలుపు యెడల తల్లిదండ్రులు తీసుకోవలసిన జాగ్రత్తలు

తల్లిదండ్రులకు దైవపిలుపుల యెడల సరియైన అవగాహన కలిగుండాలి. అది దేవుని ప్రత్యేక వరమని గ్రహించాలి.

### 6.1. దైవ పిలుపు దేవుని వరము

తల్లిదండ్రులు దైవపిలుపును దేవుని యొక్క అనుగ్రహమని గ్రహించి, ఆ బాణీలో వారిని ప్రోత్సహించాలి. దేవుని పిలుపు అందరికీ రాదు. దేవుని సేవకు ఎవరికి వారు అంకితం కాలేరు. దేవుడే వారిని ఎన్నుకుంటాడు. ఆయన వ్యక్తి యొక్క యోగ్యతనుబట్టిగాక తన చిత్తం ప్రకారం బిడ్డలను తన సేవకు పిలుచుకుంటాడు. కనుక, తల్లిదండ్రులు ఈ నగ్నసత్యాన్ని గుర్తించి, తమ బిడ్డలలో ఎవరికి పిలుపుందో వారినే అంకితం చేయటానికి సిద్ధపడాలి.

### 6.2. దైవపిలుపుల కొరకు ప్రార్థన

కుటుంబంలో ప్రతి ఒక్కరూ దైవపిలుపు కొరకు ప్రార్థించాలి. అది వారి బాధ్యత. వేదవ్యాపకంలో ఒక భాగం. కుటుంబ సభ్యులందరు ప్రార్థిస్తుండగా అది విని, బిడ్డలలో ప్రేరణ కలగవచ్చు. మంచి క్రైస్తవ కుటుంబంగా జీవిస్తే బిడ్డలలో సేవ చేయాలన్న ఆశ కలగవచ్చు. మంచి మాటలు, క్రియలు, ఇంటిలో ప్రార్థనా వాతావరణం ఉంటే అవే బిడ్డలకు ప్రేరకాలు అవుతాయి. బిడ్డలకు ప్రార్థనయందు ఆశేగాక, విశ్వాసం కూడా కలుగుతుంది. ఆ విధంగ శుభవార్త, శ్రీసభల యెడల ప్రేమ కలుగుతుంది. కనుక, ప్రతి కుటుంబంలో ఉదయం సాయంత్రం కుటుంబ ప్రార్థనలు విధిగా జరగాలి. తమ కుటుంబంలో దైవపిలుపు ఉన్నా లేకున్నా అందుకొరకు సభ్యులు ఆశతో ప్రార్థించాలి. ఒక్కొక్కపరి దేవుడు ప్రక్క ఇంటి నుండి బిడ్డను పిలువవచ్చు. కనుక ప్రార్థనను నిరంతరం కొనసాగించాలి.

## 7. తల్లిదండ్రులు తమ బిడ్డలను లోకమునకు దీవెనకరముగా అందివ్వాలి

యేసుప్రభువును కని, 30 సంవత్సరాలు పెంచిన (యోహాను 2:5) మరియ యోసేపులు కుమారున్ని లోకానికి ఏవిధంగ సమర్పించారో నేటి తల్లిదండ్రులు బాగా గమనించాలి. కానాపల్లె పెళ్లిలో యేసు నీటిని ద్రాక్షారసంగ మార్చినపుడు "ఇదిగో నా కుమారుడు, మీ పేదరికమును ధనికముగాను (2 కొరింథీ 5:8-9). మీ

అనారోగ్యమును ఆరోగ్యముగను (యెషయా 53:5), మీ శాపమును దీవెనగాను (గలతీ 3:13), మీ బలహీనతలను బలముగాను (మత్తయి 8:17) మార్చి మీకు రక్షణనిచ్చు లోక రక్షకుడు" అని సర్వ మానవాళికి దీవెనకరముగా తన కుమారున్ని ఈ లోకానికి సమర్పించారు. ప్రియ తల్లిదండ్రులారా! మీ బిడ్డలను దైవజ్ఞానంతో పెంచి, లోకానికి ఆశీర్వాదకరంగా అందించుటకు ముందుకు రావాలి. "అబ్రహామా! నేను నిన్ను దీవించి, నీ ద్వారా సమస్త జాతులను దీవిస్తాను" అనే వాగ్ధానం మీ బిడ్డల విషయంలోను నెరవేరునుగాక! (ఆది. 12:3).

**ముగింపు**

క్రైస్తవ సమాజంలో గురువుపట్ల జాన్ మరియ వియాన్ని గారికి అపార గౌరవం ఉండేది. గురువులంటే ఎక్కడో పరలోకం నుండి ఊడిపడలేదు. మన కుటుంబంలో నుండి వచ్చిన సాధారణ మనిషి. కాని, అతడు ఆత్మతో ప్రేరేపితుడై, ఇతరత్రా కారణాల వలన కూడ ప్రేరేపితుడై తన జీవితాన్ని దేవునికి అర్పించుకో గలిగాడు. పునీత వియాన్ని గారి మాటల్లో చెప్పాలంటే, "గురుపట్టంలేకపోతే మనకు ప్రభువు లభించదు. దేవుణ్ణి సత్ప్రసాద పెట్టెలో ఉంచింది ఎవరు? జీవితారంభంలో బాప్తిస్మం ద్వారా మన ఆత్మకు స్వాగతం చెప్పింది ఎవరు? ఆధ్యాత్మిక ప్రయాణంలో దివ్య భోజనాన్ని అందించి, మన ఆత్మకు బలం చేకూర్చింది ఎవరు? మన ఆత్మ పాపం వలన చనిపోతే మళ్ళీ జీవంతో లేపి, దానికి నెమ్మదిని, శాంతిని ప్రసాదించింది ఎవరు? దేవుని చెంతకు చేరుకోడానికి మనాత్మను సిద్ధం చేసింది ఎవరు? గురువే. దేవుని తరువాత గురువే అన్నింటికీ ఆధారం. నేడు క్రీస్తు రక్షణ కార్యాన్ని మన మధ్యలో కొనసాగించేది గురువే". ఈ విషయాలన్నింటిని తల్లిదండ్రులు లోతుగా ఆలోచించి, గ్రహించి, తమ బిడ్డలను దేవుని సేవకు అంకితం చేయటానికి ముందుకు రావాలి. తమ బిడ్డలను రక్షణకార్యాన్ని కొనసాగించటానికి తల్లిదండ్రులు త్యాగం చేయాలి.

❊ ❊ ❊ ❊

# ౨. ఆధునిక కుటుంబానికి ఆదర్శం నజరేతు కుటుంబం

– బ్రదర్ కొండ్రు వేళంగిణిరాజు

**ఉపోద్ఘాతం**

ఒక మొక్కను ఎక్కువ ఎండ కాచే చోట మనం నాటితే ఆ మొక్కకు హాని కలిగే అవకాశం చాలా ఉన్నాయి. ఆ మొక్క వీచే గాలిపై ఆధారపడుతుంది. ఒకవేళ అది జీవంతో ఉంటే సరియైన ఆకారం లేకుండ మెలిచుట్టుకొని ఉంటుంది. ఒక మొక్క అంతర్గతమైన శక్తి ఎదుగుదలను కోరుకుంటే ఎండగాని, నీడగాని ఎక్కువగా ఉండే చోట దానిని నాటకూడదు. ఆ మొక్కకు ఎండ నీడ సరిపడ విధంగ ఉండేటట్లు చూడాలి. దానిని నాటేటప్పుడు కేవలం ఒక్క మొక్కనేగాక దానితో కనీసం మరో మొక్కను నాటాలి. రెండు మొక్కల మధ్య సరిపడు స్థలం ఉండటమేగాక అవి మనకు ఒకవైపు నీడను, మరోవైపు రక్షణను ఇచ్చేవిగా చూడాలి. ఏవిధంగానైతే మొక్క ఒంటరిగా ఉండడం సబబుకాదో, మనిషి కూడా ఒంటరిగా జీవించుట మంచిదికాదు. మనిషి పరిపూర్ణ ఎదుగుదలకు, మానసిక పరిపక్వతకు ఇతరులతో స్నేహం, ప్రేమ అనే అనుబంధాలు అవసరం.

## 1. ప్రపంచంలో కుటుంబం యొక్క పాత్ర

ప్రపంచంలో కుటుంబం యొక్క పాత్ర అన్నిటికన్నా ప్రముఖమైంది. ఎందుకంటే, సమస్తమైన నాణ్యత ఈ కుటుంబ వ్యవస్థ నుండే వస్తుంది. కనుక, ఈ కుటుంబం గూర్చి కొన్ని విషయాలను చూద్దాం.

### 1.1. కుటుంబం యొక్క ఉద్ధేశము

సృష్టిని జరిపించినపుడు దేవుడు అన్యోన్య సంబంధం కలిగి, జీవించడానికి ప్రతొక్కరిని సృష్టించారు (ఆది. 2:18). అంతట దేవుడైన యావే, "నరుడు ఒంటరిగా

జీవించుట మంచిదికాదు. అతనికి తోడునీడయగు స్త్రీని సృష్టింతును" అని అనుకొనెను. సృష్టి ఆరంభం నుండి కుటుంబ వ్యవస్థలో ఎంతో ప్రాధాన్యత దాగుంది. పూర్వకాలంలో ఉమ్మడి కుటుంబాలు ఎక్కువగా ఉండేవి. నేటి సమాజంలో వాటి ప్రాధాన్యత కనుమరుగవుతూ వస్తుంది.

ఒక తోటలో నాటబడిన కొన్ని చెట్లు కుటుంబ నిర్వాహణకు ప్రతీకలుగా నిలుస్తాయని చెప్పవచ్చు. ఎందుకంటే ఏవిధంగానైతే ఒక చెట్టుకు మరొక చెట్టుకు మధ్యనున్న దగ్గర సంబంధం వాటి పరిపూర్ణ ఎదుగుదలకు తోడ్పడుతుందో, ఏవిధంగానైతే వాటి మధ్యనున్న దూరం వాటి రక్షణకు ఉపకరిస్తుందో అదేవిధంగా కుటుంబంలో నున్న వ్యక్తులు అనుబంధాలను పెంచుకోవడం ద్వారా, కర్తవ్యాలను పంచుకోవడం ద్వారా పరిపూర్ణ ఎదుగుదలను తమ కుటుంబాలలో ఉండేలా చూసుకోగలుగుతారు.

## 1.2. నవీనయుగంలో కుటుంబం

ఈ నవయుగంలో కుటుంబం కలిసి జీవించడం కంటే ఎక్కువ శాతం కీడును ప్రదర్శించడానికి అనువుగా ఉన్నట్లు కనిపిస్తున్నాయనుటలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఒకవైపు తల్లిదండ్రులిద్దరు జీవనం గడుపుటకు పది రూపాయలు వెనకేసుకునే పరిస్థితిలో ఉండి తమ పిల్లల బాధ్యతను విస్మరించడం ద్వారా పిల్లలు వారిని వారు కాపాడుకోలేని వాటివైపు ఆకర్షింపబడి, చెడు అలవాట్లకు లోనౌతున్నారు. కుటుంబంలో మరొకవైపు కొంతవరకు తల్లిదండ్రులిద్దరు ఉద్యోగరీత్యా చాలాకాలం ఎడబాటుకు గురికావడం ద్వారా వారు విడివిడిగా జీవించడం జరుగుతుంది. ఇదిలా ఉండగా, పిల్లలు తమ చెడు స్నేహితులవలన, వారికి మంచిని బోధించేవారు అసలే లేక, వారి ఇచ్ఛ ప్రకారం జీవిస్తున్నారు. పరిస్థితి ఇలా ఉండగా దేవుడిచ్చిన అతిపవిత్ర వరాన్ని, అంటే "జన్మదాతలుగా ఉండడం" దానిని కొనసాగించే వారిగా ఉండకపోవడం మాత్రమేగాక, దేవుని ప్రతినిధులుగా బాధ్యత వహించకపోవడంతో, శ్రద్ధను కోల్పోయి, దేవుడు మానవునికొరకు చేసిన ప్రణాళికను భంగపరచి, ఈ సృష్టిని పవిత్రపరచడంలో విఫలమౌతున్నారు. దీనివలన మన సమాజంలోనున్న ప్రతీ కుటుంబం ఇటు సామాజిక పరంగాను, అటు ఆధ్యాత్మికంగాను, మానసికంగాను ఒత్తిడికి గురై, ఆందోళనకరంగా జీవిస్తుంది.



ఈనాడు కుటుంబాలు దుర్బలమైన, తేలికగా నాశనం కాగల స్థితిలో ఉన్నాయి. ఐదుగురిలో ఒకరు మాత్రము సరియైన కుటుంబం నుండి రాగలుగుతున్నారు. పది కుటుంబాలలో కనీసం నాలుగు విడాకుల పత్రాలు సిద్ధమౌతున్నాయి. ఇంకనూ ధారుణమైన అంశం, వృద్ధులను బలహీనమైన వారిని లెక్కచేయకపోవడం. ఈ పరిస్థితి ఎలా ఉందంటే, ఒక తల్లి పదిమంది పిల్లలను చేరదీయగలదు. కాని, పదిమంది కలిసి ఒక తల్లిని గూర్చి జాగ్రత్త వహించలేకపోతున్నారు. నిజం చెప్పాలంటే, దేవుని దృష్టిలో ప్రతిఒక్కరు తమ తల్లిదండ్రులపట్ల బాధ్యులై మెలగాలి. ఎందుకంటే తల్లిదండ్రులు దేవునియొక్క ప్రణాళికలను అమలుపరచేవారు. వారు "జన్మదాతలు, దేవుని ప్రతినిధులు".

## 1.3. కుటుంబంలో అధిక ప్రాముఖ్యత

కుటుంబంలో ఒకరికొకరు అధిక ప్రాముఖ్యతను ఇవ్వడం వలన కుటుంబం ఎంతగానో బలపడుతుంది. ఒకరికోసం మరొకరు తమ సమయాన్ని కేటాయించి, ఇతరుల కోసం వెచ్చించడం వలన కుటుంబం ఎల్లప్పుడు శాంతిసమాధానాలతో అలరారుతుంది. ఈ విధంగా చేయడం వలన ప్రతిఒక్కరు తమ బాధ్యతలను గుర్తించి, ఇతరుల కోసం పనిచేస్తారు. చైనీయుల కథలలో ఒకటి ఇలా ఉంటుంది: పండితులైన అధ్యాపకులు తమ విద్యార్థులను ఈ క్రింది విధంగా అడుగుతుంటారు. మన జీవితాలలో మనకు బాగా తృప్తిని, సంతోషాన్నిచ్చేది ఏమిటని. దానికి విద్యార్థులు కొంతమంది సంతోషకరమైన వివాహ జీవితమని, ఇంకొందరు పరిపూర్ణ ఆరోగ్యమని, మరికొందరు ఏవేవో సమాధానాలు ఇస్తారు. తరువాత అధ్యాపకులు చెప్పే సమాధానం అక్కడున్న ప్రతొక్కరిని ఆశ్చర్యపరుస్తుంది. ఆ అధ్యాపకుల ప్రకారం జీవితంలో అత్యంత తృప్తిని, సంతోషిన్నిచ్చేది "కొడుకు తన సొంత కాళ్ళమీద తల్లిదండ్రులు చూపిన సక్రమమైన మార్గంలో నడవడం" అని చెబుతారు. ఈ విధంగ కొడుకు తల్లిదండ్రుల ఆశల ప్రకాం చేసినట్లయితే ఒకవైపు తల్లిదండ్రులు, మరోవైపు పిల్లలు కూడ తమ కుటుంబంలో ఒకరికొకరు అధిక ప్రాముఖ్యత ఇచ్చిన వారవుతారు.

## 1.4. కుటుంబ నైజం

వధూవరుల స్వేచ్ఛాపూర్వక అంగీకారం మీద దాంపత్య వ్యవస్థను స్థాపించారు. భార్యాభర్తల శ్రేయస్సు కోసం సంతానోత్పత్తి, పరిపక్వత కోసం విద్య,

వివాహం, కుటుంబ జీవనాన్ని నిర్దేశించారు. భార్యాభర్తల మధ్య ప్రేమ, సంతానం ద్వారా ఆ కుటుంబంలో తెగిపోని సంబంధాలు, మౌలిక విధులు ఉత్పన్నమౌతాయి. వివాహబంధంలో ఏకమైన స్త్రీపురుషులు వారి పిల్లలతో కలిసి కుటుంబం రూపొందుతుంది. ప్రభుత్వ గుర్తింపుకు ముందే ఏర్పడిన వ్యవస్థ ఇది. ప్రభుత్వం ఈ వ్యవస్థను విధిగా గుర్తిస్తుంది. కుటుంబంలోని వివిధ సంబంధాలను బేరీజు వేసేటప్పుడు, విలువ కట్టేటప్పుడు కుటుంబాన్ని కొలబద్దగా తీసుకోవాలి. స్త్రీపురుషులను సృష్టించుట ద్వారా దేవుడు మానవ కుటుంబాన్ని స్థాపించాడు. కుటుంబానికి మౌలిక రాజ్యాంగాన్ని అనుగ్రహించాడు. కుటుంబ సభ్యులందరికి సమాన హోదా ఉంది. ఒకే కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం సభ్యులకు రకరకాల బాధ్యతలు, హక్కులు, విధులు ఉన్నాయి (కతోలిక శ్రీసభ సత్యోపదేశం 2201-03).

## 2. పరిశుద్ధ కుటుంబం ఓ ఆధునిక కుటుంబం

పరిశుద్ధ (తిరు) కుటుంబం ఈ ఆధునిక కాలంలో జీవించలేకపోయినా, ఆ కుటుంబ జీవిత విధానం ఈ ఆధునిక కుటుంబాన్ని అన్ని విషయాలలో మించియుండడం మనం గమనించగలం.

### 2.1. పరిశుద్ధ కుటుంబంలో పవిత్రమూర్తుల పాత్రలు

పునీత యోసేపుగారు, పరిశుద్ధ మరియకు (సంరక్షక) భర్తగా ఉండి తన కర్తవ్యాన్ని నెరవేర్చారు. వారిరువురు తమ వివాహంలో తీసుకున్న ప్రమాణాలను పాటించారు. బాలయేసుకు (సాకుదు) తండ్రిగా తన బాధ్యతను నెరవేర్చారు. ఎల్లప్పుడు బాలయేసును క్రమశిక్షణలో, దైవభక్తిలో పెంచారు. యజమానిగా ఉంటూ, తన వడ్రంగి వృత్తి ద్వారా కుటుంబాన్ని పోషించారు. కుటుంబానికి కావలిగా ఉంటూ, దూత చెప్పిన మాటలకు విధేయించి, నడచిన గొప్ప మూర్తి పునీత యోసేపుగారు.

పరిశుద్ధ మరియ ఆదర్శ గృహిణిగా భర్తయైన యోసేపుపట్ల, కుమారుడైన యేసునిపట్ల తనకున్న విధులను నెరవేరుస్తూ, వారిపట్ల ప్రేమతో ప్రవర్తించినట్లు మనం గ్రహించవచ్చు. ఒక తల్లి తన బిడ్డను ఏ విధంగా సాకుతుందో అదేవిధంగా యేసు అభివృద్ధిని కోరి, బహుగా కృషి చేసింది మరియ.

బాలయేసు తగిన తనయునిగా, తండ్రి దగ్గర వడ్రంగి పనిని నేర్చుకుంటూ, ఎల్లప్పుడు తల్లిదండ్రుల యెడల విధేయత కలిగి జీవించాడు. ఇతరులకు మాతృకగా



నుండి, కడవరకు తండ్రిదేవుని చిత్తాన్ని తెలుసుకొని, జీవించిన ఏకైక ఆదర్శమూర్తి. తల్లిదండ్రులను ప్రేమించాడు, విధేయించాడు, గౌరవించాడు.

పరిశుద్ధ కుటుంబానికి సంపూర్ణ ఐక్యత, పరిపూర్ణ పరిజ్ఞానం లభించిందంటే అది వారు పవిత్రాత్మ యొక్క నడిపింపును ఆశించి, ఆత్మ ప్రేరణతో మెలగటమే! ఒకవైపు తండ్రిదేవునిపట్ల ప్రేమతో, విధేయతతో నడుచుకుంటూ, మరోప్రక్క ప్రేమతో, మర్యాదతో తోటివారిపట్ల మెలగుతూ ఈ నజరేతు కుటుంబం పరిపూర్ణ పరిశుద్ధ కుటుంబంగా ఎదిగింది. లోకానికి ఆదర్శ కుటుంబంగా వెలిగింది.

### 2.2. పరిశుద్ధ కుటుంబంలోని వ్యక్తుల సమస్యలు

సాధారణంగ మన కుటుంబాలలోని వ్యక్తులు ఎదుర్కొనే సమస్యలకంటే పరిశుద్ధ కుటుంబంలోని సమస్యలు చాలా ఎక్కువనే చెప్పాలి. కన్యకగా ఉన్నపుడే మరియ గర్భం ధరించడం, యోసేపు మరియను రహస్యంగ విడిచిపెట్టాలనుకోవడం, దూత చెప్పిన తరువాత మరయను ఇంటికి తీసుకొని వెళ్ళడం, నిండు చూలాలైన మరియతో బెత్లెహేంకు వెళ్ళడం, బాల యేసు జన్మించడానికి సరియైన స్థలం దొరకకపోవడం, హేరోదురాజు శిశువును చంపబూనటం, ఐగుప్తుకు పలాయన, తిరిగివచ్చి నజరేతులో భయంభయంగ స్థిరపడటం, మూడు దినాలు బాలయేసు కనిపించకపోవడం, యేసు సిలువను మోయడం, సిలువపై మరణించడం, ఆయన పార్థివ దేహాన్ని భూస్థాపితం చేయడం, ఇదంతా తల్లికి కడుపుకోత అవడం, ఒకటా రెండా ఎన్నెన్నో బాధలు. ఇన్ని సమస్యలున్నా ఈ కుటుంబం పరిశుద్ధంగానే జీవించింది.

అష్టకష్టాలు ఎదురైనా, పరిశుద్ధ కుటుంబం వాటన్నింటిని భరించి, నిలద్రొక్కుకొని ఉందంటే కారణం - వారు దేవునియొక్క చిత్తాన్ని నెరవేర్చ మనసు కలిగుండడమే! యేసుక్రీస్తు దేవుని చిత్తాన్ని నెరవేర్చడానికొస్తే, తల్లిమరియ, "నేను ప్రభు దాసురాలను" అని చెప్పడం, యోసేపు దైవ(దూత) ప్రేరణకు తలయొగ్గి జీవించడం గమనార్హం. ఈ విషయాలన్నిటా దేవుని చిత్తాన్ని నెరవేర్చడానికి వారు ఎంత శ్రమను అనుభవించారో మనకు అర్థమౌతుంది. అంతేగాక, వారిలో - వారి మధ్యన తాండవించే ప్రేమ కూడా కారణమే! మరియతల్లి అభిషిక్తుడైన యేసుక్రీస్తు అనుసరిస్తే, యోసేపు మరియను బాధలలో కూడా ఆమెను విడిచిపెట్టలేదు.

దీనికంతటికి కారణం వారి మధ్యనగల యోగ్యమైన జీవన విధానం, దేవుని పథకానికి వారు నిండుగా సహకరించడం.

## 2.3. పరిశుద్ధ మూర్తుల అధిక ప్రాముఖ్యత

పరిశుద్ధ కుటుంబంలో ఒకరికోసం మరొకరిపై చూపిన ప్రాముఖ్యత చాలా ఎక్కువేనని చెప్పుకోవాలి. ఒకసారి ఓ బాలుడు తన తండ్రిని, "నాన్నా! గంటకు నీ జీతం ఎంత?" అని అడిగాడు. తండ్రి ఆశ్చర్యపోయి, "ఇంతవరకు మీ అమ్మకే తెలియదు, నీకెందుకురా? నన్ను విసిగించకు, వెళ్లు" అంటాడు. కాని అబ్బాయి, "నాన్నా ప్లీజ్ చెప్పవా?" అని మళ్లీ అడిగినందుకు వాడి బాధపడలేక "ఇరవై డాలర్లు" అంటాడు. అపుడు "నాన్నా, నాకు ఓ పది డాలర్లు ఇవ్వవా?" ని అడిగినందుకు కసురుకొని, "వెళ్లి పడుకో పో!" అని కోప్పడుతాడు తండ్రి. మూతి ముడిచి కుర్రాదు వెళ్ళిపోతాడు. తరువాత తండ్రి ఆలోచించగా మనస్సు బాధపడి, డబ్బులు వాడికి అవసరమైనదని అనుకొని, వెళ్ళి వాడిని దగ్గరకు తీసుకొని పదిడాలర్లు ఇస్తాడు. అపుడు కొడుకు సంతోషపడి, తన దగ్గరున్న పది డాలర్లతో కలిపి, ఇరవై డాలర్లు నాన్నకిచ్చి, "నాన్నా! ఓ గంట పనిమాని, నాతో ఆ గంట గడపవా!" అని అంటాడు. తండ్రి మనసు చివుక్కుమంటుంది. ఈ కథలోని సంఘటన మనం పరిశుద్ధ కుటుంబంలో చూడం. దానికి కారణం పరిశుద్ధ కుటుంబంలో ఎల్లప్పుడు ఒకరికోసం మరొకరు అధిక ప్రాముఖ్యతను ఇవ్వడం.

## 2.4. పరిశుద్ధ కుటుంబ గుణగణాలు

పరిశుద్ధ కుటుంబంనుండి మనం అనేక గుణగణాలను నేర్చుకోవచ్చు. మొదటిది – పరిశుద్ధ కుటుంబంలోని వ్యక్తులను దేవుడు పిలిచి వారిని ఎంపిక చేసారు. దేవుని నడిపింపు వల్లనే మరియ యోసేపుల వివాహం జరిగింది. పవిత్రాత్మ శక్తియే యేసుక్రీస్తును వారి జీవితాలలోకి తీసుకొచ్చింది. పరిశుద్ధ కుటుంబాన్ని దేవుడే ఏర్పరిచారు. రెండవది – వ్యక్తులు వేరైనా వారు జీవించే విధానంలోను, ప్రార్థించే విధానంలోను, పనిచేసే విధానంలోను వారికి ఎటువంటి మార్పు లేదనే చెప్పాలి. మూడవది – వారు భిన్న మనస్తత్వాలు కలిగున్నా ఒకే మనసుగా జీవించారు. నాల్గవది – వారి మధ్యగల ఐకమత్యం కేవలం వారు సరిసమానంగ ఉండడం వలన



కాదుగాని, వారి దాతృత్వం వలన ఐక్యత ఏర్పడింది. ఒకరిపట్ల ఒకరు పరహితబుద్ధి గలవారైనారు. ఐదవది – పరిశుద్ధ కుటుంబానికి ఏకైక ప్రణాళిక ఉండడం విశేషం. ఆ ప్రణాళిక కూడా లోకకళ్యాణం కోసం సకల మానవాళి రక్షణ కోసం ఉండడం గమనార్హం.

## 3. ఆధునిక కుటుంబాలకు ఆదర్శ కుటుంబం పరిశుద్ధ కుటుంబం

ఆధునిక యుగంలో కుటుంబాలు కలిసి జీవించడం కన్నా, విడిపోయి జీవించడానికే ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నాయి. కొన్ని దేశాలలోనైతే దీని శాతం వందకు చేరింది. ఇటీవల కాలంలో ఒక పెద్ద దేశంలో 500కు చేరింది. దీనిని గమనించిన శాస్త్రవేత్తలు ఈవిధంగా కొనసాగితే త్వరలో కుటుంబ వ్యవస్థకు భారీ నష్టం కలుగుతుందని చెబుతున్నారు. కటుంబ జీవన విధానం చాలా ప్రముఖమైనది. మరీ ముఖ్యంగ క్రైస్తవత్వాన్ని నిలబెట్టేది కుటుంబమేనని చెప్పడంలో బహుశా అతిశయోక్తి లేదేమో!

## 3.1. పరిశుద్ధ కుటుంబ లక్షణాలను అలవర్చుకొని అనుసరించుట

కుటుంబ జీవితాలు క్రైస్తవత్వాన్ని చాలావరకు బలపరుస్తాయి. ఈ కుటుంబాలు బలపడడానికి పరిశుద్ధ కుటుంబం, దానిలోగల సుగుణాలు ఎంతగానో తోడ్పడుతుంది. మొదటిగా, పరిశుద్ధ కుటుంబ సభ్యులు ఎటువంటి తారతమ్యం లేకుండా అందరికి ఐనవాళ్లుగా మెలగాలి. అన్ని కుటుంబాలు దేవుని నుండి వచ్చినవే! ప్రపంచమైనా, సమాజమైనా, కుటుంబమైనా అన్నీ దేవుని నుండి వచ్చినవే. కనుక ప్రతీ కుటుంబం పరలోకమందున్న త్రియేక దేవున్ని ఈ భూలోకంలో ప్రదర్శిస్తారు. అనగా దేవుని సహవాసాన్ని చూపుతారు. ముగ్గురు వ్యక్తుల ఐక్యమత్యాన్ని, చేరికను, కలయికను మనకు తెలియజేస్తారు. రెండవదిగ, కుటుంబంలోగల ప్రతి వ్యక్తిని మరొక వ్యక్తితో పోల్చి చూపడం సరికాదు. ఎందుకంటే, ప్రతొక్కరు వేరొకనికి భిన్నంగా ఉంటారు. ఇలా ప్రతొక్కరు వేరొకనికి భిన్నంగ ఉండడం దేవుని యొక్క ప్రణాళిక. దేవుడు మనిషి ప్రణాళికను తల్లిగర్భంలో ఉన్నపుడే అమలుచేస్తారు. పరిశుద్ధ కుటుంబంలోని ముగ్గురు వ్యక్తులు వేరువేరైనా ఎలా కలిసి జీవించారో ప్రతీ క్రైస్తవ కుటుంబం అలానే వారిని అనుసరించాలి. మూడవదిగ, మనుషులు వేరైనా కుటుంబం

కలిసి జీవించడంలోనే అసలైన తృప్తి. కలిసి ప్రార్థించడంలో, పనిచేయడంలో, భోజనం చేయడంలో పరిశుద్ధ కుటుంబం కనబరచిన గుణగణాలను అలవర్చుకున్నపుడు కుటుంబాలు ఎటువంటి తారతమ్యం లేకుండా జీవించగలవు. నాల్గవదిగ, ప్రేమ అనేది కుటుంబాన్ని ఐక్యంగా నడిపిస్తుంది. ఒకరిపై మరొకరికి ఎటువంటి అభిప్రాయమున్నా ఈ ప్రేమ అందరిని ఒకటిగా చేయడంలో ముందుగా ఉంటుంది. ప్రేమ కేవలం మాటల్లో కనిపించే ప్రేమ కాదు, చేతల్లో నిరూపించే ప్రేమ. అంటే, ఆత్మత్యాగంతో కూడిన ప్రేమ, ఆత్మబలంతో కూడిన ప్రేమ అయ్యుండాలి. ఐదవదిగ, ప్రేమకు పునాది దేవుని చిత్తాన్ని నెరవేర్చాలన్న తలంపు కలిగుండడం. పరిశుద్ధ కుటుంబం ఎప్పుడూ మానవాళి రక్షణార్థం, దేవుని ప్రణాళిక ప్రకారం, ఆయన చిత్తాన్ని నెరవేర్చింది. కాబట్టి, పరిశుద్ధ కుటుంబం మనందరకు కూడా ఇప్పుడు ఒక ఆదర్శ కుటుంబంగా ఉంటుంది.

### 3.2. పరిశుద్ధ కుటుంబ జీవనానికి కావలసిన విలువలు

ఈ ఆధునిక యుగంలో ప్రతొక్కరిని ఆశ్చర్యపరచే విషయం – అందరూ విలువలు గురించి మాట్లాడడం. కాని, కొంతమంది మాత్రమే వాటిని నిష్టగా పాటించడం. కుటుంబ జీవనానికి నిబద్ధత, విశ్వాసం, ఆత్మత్యాగం చాలా అవసరం. వీటిపైన కుటుంబ జీవితం ఆధారపడుంది. పరిశుద్ధ కుటుంబం వీటిని ఆచరించి, మనకు ఆదర్శం చూపారు. యోసేపు, మరియ బాలయేసుని గూర్చి బహుశ్రద్ధ వహించారు. ఆయన కోసం తమ జీవితాలను త్యాగం చేశారు. నేటి సమాజం పరిశుద్ధ కుటుంబం నుండి నేర్చుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

### 3.3. పరిశుద్ధమైన కుటుంబ జీవనానికి కావల్సిన సుగుణాలు

కుటుంబ శాంతి సమాధానాలతో అలరారుతూ ఐకమత్యంగా జీవించాలంటే సుగుణాలు చాలావరకు అవసరం.కుటుంబాలకు సుగుణాలను అలవర్చుకోవడం ద్వారా దేవుని దృష్టిలోను, మానవుల దృష్టిలోను కుటుంబానికి గౌరవముంది. పునీత పౌలు గారు చూపించిన కనికరం, వినయం, ఔదార్యం, సహనం, పరస్పర మన్నింపు, అన్నిటికన్నా ప్రేమ, ఇవన్నీ కుటుంబాన్ని శాంతి, సమాధానాలతో అలరారునట్లు చేస్తాయి.



### 3.4. కుటుంబాలలో అధిక ప్రాముఖ్యత

అనేక రకాలుగా మన ప్రేమను వ్యక్తపరచినా ఇంకా ఎంతో కొంత వెలితి కనిపించడం చాలా కుటుంబాలలో మనం చూస్తున్నాం. కాని, పరిశుద్ధ కుటుంబం ఒకరికోసం మరొకరు అధిక ప్రాముఖ్యతను కలిగి జీవించింది. కేవలం ఈ కారణం వల్లనే ఆ కుటుంబంలో ఎల్లప్పుడు బాధలు, కష్టాలున్నా అది పవిత్ర కుటుంబంగా మనగలిగింది.

#### 3.4.1. తల్లిదండ్రుల విధులు

దాంపత్య జీవనాన్ని కేవలం సంతానోత్పత్తికి మాత్రమే పరిమితం చేయరాదు. బిడ్డల నైతిక విద్యకు, ఆధ్యాత్మిక రూపకల్పనకు కూడ విస్తరించాలి. "బిడ్డల విద్యాబుద్ధుల శిక్షణలో తల్లిదండ్రుల పాత్ర ఎంత ముఖ్యమైనదంటే దానికి మరొక ప్రత్యామ్నాయం లేదు". తమ బిడ్డలకు విద్యాబుద్ధులు గరపడం తల్లిదండ్రులకున్న మౌలిక హక్కు, బాధ్యత. ఈ రెంటిని మరొకరికి బదిలీ చేయడం ఎంత మాత్రం వీలుపడదు. తల్లిదండ్రులు తమ బిడ్డలను దేవుని బిడ్డలుగా పరిగణించాలి. వారిని మానవ వ్యక్తులుగా గౌరవించాలి. పరలోకమందలి తండ్రి చిత్తానికి విధేయులుగా తమ్ముతాము మలచుకొని, వారి బిడ్డలకు దేవుని చిత్తాన్ని నెరవేర్చడమెలానో నేర్పాలి.

#### 3.4.2. పిల్లల విధులు

మానవ పితృత్వానికి మూలస్థానం. తల్లిదండ్రులకు ఇవ్వవలసిన గౌరవానికి పునాది ఇది. పిల్లలు పసివాళ్ళయినా, పెద్దవారైనా మాతాపితరులను గౌరవించాలి. ఈ గౌరవభావం తల్లిదండ్రులతో పిల్లలకున్న బంధం నుంచి పుడుతుంది. దేవుని నాల్గవ ఆజ్ఞను పాటించుటకు ఇది అవసరం. అమ్మానాన్నల జీవదానం, వారి ప్రేమ, వారి వృత్తిప్రవృత్తి, బిడ్డల్ని ఈ లోకానికి తెస్తాయి. వారిని వయసులో, విజ్ఞానంలో, దైవానుగ్రహంలో పెంచుతారు. వీటన్నింటికి పిల్లలు చూపే కృతజ్ఞతా భావంలోంచి గౌరవం జనిస్తుంది. "పూర్ణహృదయంతో నీ తండ్రిని గౌరవింపుము. నిన్ను కన్నతల్లి పురిటి నొప్పులను మరచిపోవలదు. నీకు జన్మనిచ్చినవారు నీ జననీజనకులు. వారిచ్చిన కానుకకు సమానమైన కానుకగా నీవేమి ఇవ్వగలవు?" నిజమైన వినయం, విధేయతల ద్వారా పిల్లలు తల్లిదండ్రులకు గౌరవం చూపించాలి.

"కుమారా! నీ తండ్రి ఉపదేశమును ఆలింపుము. నీ తల్లి బోధనను వదలిపెట్టకు... అవి నీవు పయనం చేయునపుడు నిన్ను నడిపించును".

## 3.5. కుటుంబం – సమాజం

సాంఘిక జీవనపు మొదటి జీవకణం – కుటుంబం. ప్రేమలో జీవన కానుకలో ఒకరినొకరు అర్పించుకొనేందుకు పిలుపు అందుకున్న సహజ సమాజం కుటుంబం. కుటుంబంలో గల అధికారం, స్థిరత్వం, జీవన సమాజంలో స్వేచ్ఛ, భద్రత, సోదర భావానికి పునాదులు వేస్తాయి. బాల్యం నుండి నైతిక విలువలను నేర్చుకోవడం, దేవుని పూజింప ఇచ్ఛపడడం, స్వేచ్ఛను సక్రమంగా వినియోగించడం వంటి సుగుణాలు కుటుంబంలోనే ప్రారంభమౌతాయి, వ్యక్తులను సంఘ జీవితంలోకి ప్రవేశపెడుతుంది. పసిపిల్లలు, వృద్ధులు, రోగులు, దేవాంగులు, పేదలపట్ల శ్రద్ధ బాధ్యత వహించడం నేర్చుకొనేలా కుటుంబం జీవించాలి. ఈ సహాయాన్ని అందించలేని కుటుంబాలు తరచూ మనకు కనిపిస్తాయి. అపుడు ఇతరులపై, ఇతర కుటుంబాలపై ఒక విధంగా సమాజంపై వారి అవసరాలు సర్దుబాటు చేసే బాధ్యతపడుతుంది. తమ బాధ్యతలను నెరవేర్చలేని కుటుంబాల విషయంలో, వాటికి సాయంచేసే విధిని, కుటుంబ వ్యవస్థను సంరక్షించే కర్తవ్యాన్ని ఇతర సాంఘిక సంస్థలు తీసుకోవాలి.

## 3.6. కుటుంబం – శ్రీసభ

పక్కా కుటుంబ జీవిత విధానం శ్రీసభకు పునాది లాంటిది. కుటుంబం ద్వారా శ్రీసభలోగల క్రీస్తుని ప్రతొక్కరు వ్యక్తపరుస్తారు. ఇద్దరు ముగ్గురు నా పేరిట కూడి ప్రార్థించినపుడు వారి మధ్య నేనున్నానని పలికిన ప్రభువు మంచి కుటుంబం ద్వారా వ్యక్తమవుతుంటారు. ఈ విధంగా కలిసి కట్టుగా జీవించడం ద్వారా, ఒకరిని ఒకరు ప్రోత్సహించడం ద్వారా కుటుంబం శ్రీసభను ఏర్పాటు చేస్తుంది.

## ముగింపు

దేవుడు ప్రతొక్కరిని ఒంటరిగా జీవించుటకు పిలువలేదు, గాని సహవాసంతో ఉండడానికి పిలిచాడు. సహవాసంలో జీవిస్తూ కుటుంబంలో దంపతులిద్దరు కూడ సన్మార్గంలో నడుస్తూ, తమ బిడ్డలను పుణ్యమార్గంలో నడిపిస్తారు. సాక్షాత్తు దేవుడు



పరిశుద్ధ కుటుంబాన్ని ఎన్నుకున్నారు. ఎన్నుకోవడమేగాక, తన చిత్తాన్ని వారి ద్వారా నెరవేర్చారు. ఈ ఆధునిక కుటుంబాలను కూడ పరిశుద్ధ కుటుంబంవలె దేవుడు ఎన్నిక చేసారు. కనుక, మన కుటుంబాలు కూడ పరిశుద్ధ కుటుంబంవలె సుగుణాలు కలిగి, దేవుని చిత్తం నెరవేరిస్తే దేవునియొక్క ప్రణాళిక ప్రకారం నడచినవారమవుతాయి. ఇతరులకు పరిశుద్ధ కుటుంబంవలె మరొక ఆదర్శ కుటుంబంగా ఉంటాయి.

❊ ❊ ❊ ❊

# 3. కుటుంబ కలహాలు, కారణాలు - పరిష్కార మార్గాలు

**- బ్రదర్ తుడుము విజయ్**

## ఉపోద్ఘాతం

కుటుంబం ఒక చిన్న సమాజం. ఇది వివాహపు అంతస్తు ద్వారా ఏర్పరిచారు. వివాహం దేవుడు మానవునికి ఒక పవిత్ర సంస్కారంగా అందించిన గొప్ప వరం. ఒక మనిషి పరిపూర్ణ వ్యక్తిగా ఎదగాలంటే అతను వివాహపు అంతస్తు ద్వారా కుటుంబాన్ని ఏర్పర్చుకొని, దానిలోని బాధ్యతలను నెరవేర్చడం ద్వారానే సాధ్యపడుతుంది. మనిషి తన జీవిత ఆశయాలను, ఆదర్శాలను, లక్ష్యాలను, జీవన విలువలను కుటుంబం నుంచి మాత్రమే అలవర్చుకోగలడు. మంచి కుటుంబం శాంతి సమాధానాలతో, సంతోషాలతో అనురాగ నిలయంగ నిలుస్తుంది. దేవుడు ఆశించిన ప్రేమైక్య జీవన సహవాసం సిద్ధిస్తుంది. మనిషి యొక్క జీవిత ఆరంభం, ఆలంబన, వ్యక్తిత్వ నిర్మాణం, మనోవికాస సాధనం అన్నింటికి కుటుంబమే ఆధారం అవుతుంది. మనిషి మనుగడకు, పురోభివృద్ధికి అత్యంత ఆవశ్యకం, ఆలంబన కుటుంబమే!

ఈ భూమిపై వసిస్తున్న ప్రతి ప్రాణి వేరొక ప్రాణితో సంబంధ బాంధవ్యాలు కలిగి ఉంటుంది. అలానే మనిషి కూడ ఒంటరిగా ఉండక ఇతర వ్యక్తులతో సంబంధ బాంధవ్యాలు ఏర్పరచుకుంటాడు. ఈ విధంగ ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తి అభివృద్ధికి దోహదపడతాడు. పరస్పర సాన్నిహిత్యం కలిగి మనుషులంతా ఒక సమాజంగ జీవిస్తారు. ఈ సమాజ జీవనానికి జీవకర్ర అనే నానుడి మనం వినియున్నాం. అంటే కుటుంబం సమాజానికి ఒక ఊతం, పునాది అని అర్థం చేసుకోవాలి.

ప్రస్తుత సమాజంలో మనం నాలుగు రకాలైన కుటుంబాలను చూడవచ్చు. అవి: 1 పెద్ద కుటుంబం: దీనిలో తల్లిదండ్రులు, పిల్లలు, ఇంకను కుటుంబంలో



పెద్దవారు (తాత అమ్మమ్మ, నాయనమ్మ, మొ॥) ఉంటారు. 2. చిన్న కుటుంబం: దీనిలో తల్లిదండ్రులు, ఇద్దరు పిల్లలు మాత్రమే ఉంటారు. 3. అరకుటుంబం: ఈ కుటుంబంలో తల్లి లేదా తండ్రి, ఒక్కరే పిల్లలను పోషిస్తూ ఉంటారు. 4. ఆధ్యాత్మిక కుటుంబం: పై మూడు కుటుంబాలు ఒక ఎత్తైతే ఇది మరొక కోవకు చెందింది. దీనిలో శారీరకపరమైన సంబంధాలకు తావులేదు. కాని, ఆధ్యాత్మికంగా వివిధ వర్గాల ప్రజలు ఒక్కటిగా, ఒక కుటుంబంగా అందరు జీవిస్తారు.

## 1. కుటుంబ లక్ష్యం

కుటుంబం, వివాహంలానే చాలా పురాతనమైంది. సృష్టి ఆరంభంలోనే మొదలైంది. నరుడు ఒంటరిగ ఉండటం దేవునికి ఎప్పుడు నచ్చలేదో అపుడు కుటుంబానికి నాంది పడింది. కుటుంబ వ్యవస్థ దేవుడు ఏర్పరచిన ఒక పవిత్ర కార్యం. వివాహం ద్వారా ఇద్దరు వ్యక్తులు ఒక్కటిగా మారేది ఆస్తిపాస్తుల కోసం కాదు. కాని, కుటుంబ జీవితం జీవించుటకు. దీనిలో దంపతుల ఐక్యత, సంతానం, బిడ్డల పెంపకం వంటివి ఇమిడి ఉన్నాయి. కుటుంబంలోని సభ్యులంతా సహచరులుగా, రక్షణగా, ఒకరికొకరు అభయమిస్తూ సాంఘిక భాగస్వామ్యం కలిగి జీవిస్తారు.

కుటుంబ వ్యవస్థలో చిన్న చిన్న విభేదాలు వస్తుంటాయి. వాటికి తావివ్వకుండ సర్దుకోవాలిగాని, అహంకారానికి, పట్టుదలకుపోయిన కుటుంబ జీవితం నాశనం చేసుకోకూడదు. భార్యభర్తలిద్దరు ఒకరితో ఒకరు మనసువిప్పి మాట్లాడకపోవటం వలన వారిలో ఇటువంటి విభేదాలు తలెత్తుతాయి.

## 2. కుటుంబ కలహాలకు కారణాలు

కుటుంబ వ్యవస్థలో భార్యభర్తల మధ్య చిన్న చిన్న మనస్పర్థలు రావడం సహజం. వాటిని ఎప్పటికప్పుడు సరిదిద్దుకోవాలి. కాని భూతద్దంలోంచి చూడకూడదు. ఇలా చూడడం ద్వారానే కుటుంబ వ్యవస్థలో భార్యభర్తల మధ్య అగాధాలు ఏర్పడి కలహాలకు దారితీస్తాయి. వాటికి పలు రకాలైన కారణాలు ఉన్నాయి.

కొన్ని కుటుంబాలలో భార్యభర్తల మధ్య తగవులు చాలా తక్కువగా ఉంటాయి. కాని, మరికొన్ని కుటుంబాలలో అస్తమానం తగవులు, కొట్లాటలు ఉంటాయి. ప్రతి చిన్న విషయం పెద్ద సమస్యగా మారుతుంది. వీటన్నింటికి ముఖ్య

కారణాలుగా ఐదింటిని చూపవచ్చు. 1. ఆర్థిక, 2. సాంఘిక, 3. సంస్కృతిక, 4. మతపరమైన, 5. మానసిక కారణాలు.

### 2.1. ఆర్థిక కారణాలు

దీనిలో మరలా మనం 1. అసమానతలు, 2. విడిగా కాపురాలు, 3. నిరుద్యోగం వంటి అంశాలను పరిశీలించవచ్చు.

### 2.1.1. ఆర్థిక అసమానతలు

సాధారణంగ ఒక కుటుంబంలో సమస్యలు తలెత్తటానికి ముఖ్య కారణం ఆర్థిక అసమామానతలు. భార్యభర్తల సంపాదన తక్కువగా ఉండి, ఖర్చులు ఎక్కువగ ఉంటే ఈ సమస్య తలెత్తుతుంది. కొన్నిసార్లు సంపాదన ఎక్కువగ ఉన్నప్పటికీ వృధాఖర్చులు చేయడం ద్వారా అప్పుల పాలవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. అంటే వచ్చే సంపాదనకు, ఖర్చులకు సంబంధించిన భార్యభర్తలు ఎటువంటి ప్రణాళిక చేసుకోకపోవడం బలీయమైన కారణం అవుతుంది. దీనివలన కుటుంబాలలో లేనిపోని గొడవలు, విభేదాలు తలెత్తుతాయి. వృధా ఖర్చులు తగ్గించి మంచి ప్రణాళిక ప్రకారం వ్యవహరించినట్లయితే ఇలాంటి సమస్యలు తలెత్తవు.

### 2.1.2. విడిగా కాపురాలు

కుటుంబంలో తల్లికి, భార్యకు (అత్తాకోడళ్ల) మధ్య మనస్పర్ధలు వస్తే విడిపోదామన్న నిర్ణయం తీసుకొని వేరే కాపురం పెట్టడం ప్రస్తుత సమాజంలో ఎక్కువగానే చూస్తున్నాం. ఈ విధంగ విడి కాపురం వలన భార్యభర్తలు ఆర్థిక జీవితంపై, వివాహ జీవనంపై అవగాహన సరిగా లేకపోవడం వలన ఎలాంటి చిన్న సమస్య వచ్చినా, వారు ఒకరినొకరు దూషించుకోవడం జరుగుతుంది. పెద్దల తోడులేకపోవడము వలన సమస్యలు త్వరగా పరిష్కారంకాక, కొన్నిసార్లు కుటుంబంలో విషయ పరిస్థితి ఏర్పడుతుంది. అటు వృద్ధ తల్లిదండ్రులు పిల్లల మంచికోరి, పిల్లలు తల్లిదండ్రుల ప్రేమకోరి విడిగా కాపురాలు ఏర్పరచుకోవాలిగాని, స్వార్థంతో, మూర్ఖపు పట్టుతో నిర్ణయం తీసుకోకూడదు.



### 2.1.3. నిరుద్యోగం

సాధారణంగ జీవితంలో స్థిరపడినపుడే ఎవరైనా వివాహం చేసుకుంటారు. కాని, ప్రస్తుత సమాజంలో కొన్నిసార్లు మంచి సంబంధం దొరికిందని వెంటనే పెళ్లి చేసేస్తారు. ఎదిగివచ్చిన ఆడ పిల్లలు ఇంట్లో ఉండడం మంచిది కాదని త్వరగా ఎవరికో ఒకరికి ముడిపెట్టేస్తారు. ప్రేమికులు తమ ప్రేమను పెద్దలు అనుమతించరని, స్థిరపడక ముందే వివాహం చేసుకుంటారు. ఈ విధమైన వివాహ జీవితాలు చాలా మట్టుకు ఆర్థిక సమస్యలతో సతమతమవుతారు, కొన్నిసార్లు మానసిక సమస్యలు తోడవుతాయి. కనుక, కుటుంబాన్ని పోషించుకునే స్తోమతను సంపాదించుకున్న తరువాతనే వివాహం చేసుకోవడం శ్రేయస్కరం.

### 2.2. సాంఘిక కారణాలు

దీనిలో 1. వరకట్నం, 2. దురలవాట్లు అన్న రెండు అంశాలను చూద్దాం.

### 2.2.1. వరకట్నం

నేటి సమాజంలో కుటుంబ సమస్యలు తలెత్తటానికి ముఖ్య కారణం వరకట్నం. కాలంతోపాటు వరకట్నం కూడా పెరుగుతుంది. రోజురోజుకు ఈ కట్నదాహం పెరుగుతుంది. తద్వారా యువతుల జీవితాలు నాశనమవుతున్నాయి. కుటుంబంలో భార్యభర్తల మధ్య అగాధం ఏర్పడుతుంది. భర్త భార్యను అనుక్షణం కట్నం కోసం వేదిస్తుంటాడు. ఒకవేళ పెళ్లి సమయంలో ఇవ్వవలసిన కట్నం మొత్తం ఇచ్చినప్పటికి, భర్త మరల అది సరిపోదని భార్యను సతాయిస్తుంటాడు. తద్వారా స్త్రీలు ఆత్మహత్యలకు పాల్పడుతుంటారు. ఈ కట్నం అనే మహమ్మారి దినదినానికి పెరిగిపోవడం కారణంగ, నేటి సమాజంలో ఆడపిల్లల్ని కనాలంటే భయపడుతున్నారు, గర్భస్రావాలకు సైతం పూనుకుంటున్నారు. ఈ వరకట్నం సాధారణంగ తమ బిడ్డకు ఇచ్చే ఒక కానుక లేదా ఆస్థిలో భాగం. కాని ఇపుడు వధువు తల్లిదండ్రులు ఆడపిల్లను కన్న నేరాని కన్నట్లు, వరునికి చెల్లించే ఒక జరిమానాగా మారింది. ఈ వరకట్నం కారణంగ కుటుంబాలు చితికిపోయి, వారి పిల్లలు అనాధలుగా మారుతున్నారు. ఈ వరకట్నం ఇరువైపుల వారికి, చివరకు తమ కుటుంబానికే ముప్పు వాటిల్లుతుంది.

### 2.2.2. దురలవాట్లు, గృహ హింస

కుటుంబాలు నాశనం కావడానికి, చెల్లాచెదురు కావడానికి మరో కారణం భర్తగాని, భార్యగాని దురలవాట్లకు లోనుకావడం. త్రాగుడుకు, మాదక ద్రవ్యాలకు బానిసై తమ వద్దనున్న డబ్బులు ఖర్చు చేయడమేగాక, ఆస్తులను కరిగించుకొని, తమ ఆరోగ్యాన్ని కూడ పాడుచేసుకుంటారు. భర్త త్రాగివచ్చి, భార్యను పిల్లలను కొట్టడం, హింసించడం, కొన్నెడల పొరుగువారితో కూడ గొడవ పడడం వలన కుటుంబంలో భార్యభర్తల మధ్య ఎడబాటు పెరిగి, పరస్పర సంబంధం దెబ్బ తింటుంది. ఈ పరిస్థితి తీవ్ర అశాంతికి గురిచేస్తుంది. కొన్నెడల భర్త త్రాగుడుకు భార్య కూడ కారణం కావచ్చు. కొందరు సరదాల కోసం, మరికొందరు వృత్తి కారణంగ దురలవాట్లకు లోనవుతారు. ఇది కుటుంబాలలో అటజడులను సృష్టిస్తుంది. కొన్ని కుటుంబాలలో భర్త హింసను భరించలేక భార్య ఆత్మహత్యకు పాల్పడుతుంది.

## 2.3. మత, సంస్కృతిక కారణాలు

ఈ విభాగంలో పురుషాధిక్యత, సంప్రదాయక దురాచారాలు అనే రెండు అంశాలను పరిశీలిద్దాం.

### 2.3.1. పురుషాధిక్యం

భారతీయ సమాజంలో పురుషుడు అధికుడుగాను, స్త్రీ అతని వస్తువుగాను భావించారు. స్త్రీకి సమాజంలో ఎటువంటి ప్రత్యేక స్థానం లేదు. ఆమె కేవలం గృహానికి పరిమితమై ఉండాలి. తనను తాను తగ్గించుకొని జీవించాలి. ఇంకో మాటలో చెప్పాలంటే జీతం లేకుండ ఇంట్లో ఒక పనిమనిషి. భర్తకు ఎదురు మాట్లాడడం ఓ పెద్ద నేరం. సామాన్యంగ కుటుంబంలో నిర్ణయం తీసుకొనే అధికారం ఉండదు, అది మగవాని హక్కు. పురుషుడు సమాజంలో ఏవృత్తైనా చేయవచ్చు. కాని స్త్రీ ఎటువంటి బాధ్యతను స్వీకరించకూడదు. ఇప్పుడిప్పుడు మార్పులు కనిపిస్తున్నా, మనసులో భావాలు ఇంకను మారలేదు. ఇటువంటి ధోరణి వలన స్త్రీ తన అభిప్రాయాలను వ్యక్తపరచలేక, తన సమస్యలను భర్తతో చర్చించలేక సతమతమౌతుంది. ఇలాంటి మానసిక వ్యధతో బాధపడుతు చివరికి కుటుంబంలో అవకతవకలు తప్పనిసరిగ చోటుచేసుకుంటాయి.



### 2.3.2. సంప్రదాయక దురాచారాలు

వివాహం చేసుకోడానికి మనిషి, శారీరకంగ, మానసికంగ పరిపక్వత చెందుండాలి. పరిపక్వతలేని వారికి వివాహం చేస్తే దానిని బాల్య వివాహం అంటాం. ఇటువంటి పెళ్ళిళ్ళు సమాజంలో చాలా జరుగుతున్నాయి. దీనికిగల ముఖ్య కారణాలు: 1. తొందరగా అమ్మాయిలు ఎదిగిరావడం, 2. ఎదిగింది వివాహం కోసమేనన్న మూఢ నమ్మకం, 3. తమ బిడ్డను ఎవరైన ప్రేమపేరుతో మోసగిస్తారన్న భయం, 4. పెళ్లికి ముందే కలయికకు తొందరపడడం. బాల్య వివాహాలు జరిగిన పిల్లల్లో శారీరక, మానసిక పరిపక్వత లేకపోవడం వలన వారు త్వరగా అనారోగ్యానికి గురికావడం, త్వరగా గర్భం ధరించడం మూలంగ ఆరోగ్యవంతమైన బిడ్డలను కనలేక, కుటుంబంలో తీవ్ర సమస్యలకు గురవుతున్నారు.

## 2.4. మానసిక కారణాలు

కొన్ని కుటుంబాలలో 1. అసూయ–పోటి తత్వాలు, నిజాయితీ లోపించడం వంటి విషయాల వలన భార్యభర్తల సంబంధాలకు హాని కలుగుతుంది. వాటిని కూడా చూద్దాం.

### 2.4.1. అసూయ - పోటీతత్వాలు

ఈ తత్వం సాధారణంగ భార్యల్లోకంటే భర్తల్లోనే అధికంగ కనబడుతుంది. తన భార్యకు తనకంటె ఎక్కువ చదువు, తెలివి, సామర్థ్యం జీతం, సంఘంలో పలుకుబడి, గౌరవమర్యాదలుంటే కొందరు భర్తలు సహించలేరు. అది తన స్వంత గౌరవానికి చేటు, లోకువని భావించి, తన ఆధిపత్యాన్ని రుజువు చేసుకొనేందుకు ఆరాటపడతారు. తన సామర్థ్య నిరూపణను సవాలుగా తీసుకుంటారు. అది సాధ్యం కానపుడు ఇంట్లో తన అధికారాన్ని చెలాయిస్తూ, సూటిపోటి మాటలతో భార్యను చిన్నబుచ్చ ప్రయత్నిస్తారు. ఇటువంటి అసూయ, పోటీతత్వాలకు మూలకారణం ఆత్మనూన్యత భావమేనని చెప్పాలి. తన గురించి తాను లోకువగా భావించడమే. ఆత్మ విశ్వాసంలేనివారే ఇలాంటి పరిస్థితికి లోనౌతారు.

### 2.4.2. నిజాయితి లోపించుట

మనిషి తన దైనందిన జీవితంలో భాగంగ తన మనసులో, ఆలోచనల్లో ఎన్నో గారడీలు చేస్తుంటాడు. తెలిసో తెలియకో మనుషులను మాయ చేస్తుంటాడు,

కుంటి సాకులు చెబుతుంటాడు. అవి అలవాటుగా మారి, చివరకు భర్త భార్యముందు లేదా భార్య భర్తముందు ప్రదర్శించుకోవడం జరుగుతుంది. మనసులో స్వార్థం, అసూయ ఉన్నప్పటికి ఒకరికొకరు మంచిగా ఉన్నట్లు వ్యవహరిస్తారు. అబద్ధాలు చెప్పడం, నిజాలను దాచిపెట్టడం, ఒకరితో నొకరు మనసువిప్పి మాట్లాడుకోకపోవడం వంటి దాపరికాలు వలన కుటుంబంలో సమస్యలకు దారితీస్తాయి. ఏదో ఒకనాడు నిజాలు తెలియడంతో పెద్ద రాద్ధాంతం చోటుచేసుకుంటుంది. కనుక ఇద్దరికి నిజాయితి, స్వచ్ఛమైన మనసులుండాలి.

## 3. సమస్యా పరిష్కార మార్గాలు

ప్రతీ సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందన్న సత్యం అందరికి తెలుసు. అలానే కుటుంబంలో భార్యభర్తల మధ్య ఏర్పడిన సమస్యలకు కూడా కొన్ని పరిష్కార మార్గాలుంటాయి. అవి, 1. దేవునియందు నమ్మకం, 2. పవిత్రగ్రంథ పఠనం-ధ్యానం, 3. ప్రార్థనా జీవితం, 4. సమస్యను అర్థం చేసుకోవడం. ఈ విషయాలను గమనిద్దాం.

### 3.1. దేవునియందు నమ్మకం

దేవుడు మనలను గురించి శ్రద్ధ తీసుకుంటాడని మనం గుర్తించాలి. అతనిపై పూర్తి నమ్మకంతో జీవించాలి. అతడు మన బాధలను, కష్టాలను, అవసరాలను తీరుస్తాడని విశ్వసించగలగాలి. ఎందుకంటే, అతను మనలను ఎంతగానో ప్రేమిస్తున్నాడు. సిలువమీద మనకోసం మరణించిన వైనమే అతని ప్రేమకు గొప్ప నిదర్శనం. కావున, నీ బాధలలో, కలతలలో అతనిని స్మరించుకొని, అతనిపై గట్టి నమ్మకం కలిగుండాలి. కష్టాలను, కడగండ్లను, భారాన్ని క్రీస్తుపై మోపితే ఆయనే భరిస్తాడు, (1 పేతురు 5:7). దేవుడు మనపట్ల శ్రద్ధ తీసుకుంటాడు. మనకు ఆయనమీద విశ్వాసం లేనట్లయితే, మనం ఆయనను వట్టి క్రియలతో తృప్తిపరచలేం, అతని వరాలను పొందలేం (హెబ్రీ 11:6).

### 3.2. పవిత్రగ్రంథ పఠనం - ధ్యానం

పవిత్రగ్రంథ పఠనం ప్రతిరోజు చేయడం ద్వారా మనకు మంచి బలం, జ్ఞానం చేకూరుతుంది. అంతేగాక, పవిత్ర గ్రంథంలో దేవునిపై పూర్తి నమ్మకముంచిన విశ్వాసుల జీవిత గాథలు కూడ మనకు ధైర్యాన్ని, ఓదార్పును, ఓర్పును, నమ్మకాన్ని



కలుగజేస్తాయి. దేవుడు విశ్వాసపాత్రుడు. మనం భరించగల కష్టాల్ని మాత్రమే ఇస్తాడు, కాని భరించలేని వ్యధలు మనకు కల్పించడు (1 కొరింథీ 10:13) దేవుడే మనకు శరణం, బలం, మన బాధలలో సహాయం చేయువాడు (కీర్తన 46:1) వంటి వచనాలు మనకు గట్టి నమ్మకాన్ని, జీవితం మీద స్థిరత్వాన్ని కలుగజేస్తాయి. కాబట్టి, పవిత్ర గ్రంథంలోని వచనాలను ధ్యానించాలి.

### 3.3. ప్రార్థనా జీవితం

"మీకు విశ్వాసమున్న యెడల మీరు ప్రార్థనలో ఏమి అడిగినను దానిని పొందెదరు" (మత్తయి 21:22) అని ప్రభువు మనతో చెబుతున్నాడు. కావున ప్రార్థించేటపుడు విశ్వాసం కలిగి, ఆ దేవ దేవుని జ్ఞానం కోసం ప్రార్థించండి. ఆ జ్ఞానంతో ఏది మంచో, ఏది చెబో తెలుసుకొని నిర్ణయాలు తీసుకోగలుగుతారు. దేవునిపై పూర్తి నమ్మకముంచి అడగాలి. "దేవుని నీ కార్యములను దీవింపుమని వేడుకొందువేని నీకు తప్పక విజయము కలుగును" (సామెతలు 16:3). "దేనిని గురించి విచారింపకుడు. మీకు ఏమి అవసరమో వాటి కొరకు మీ ప్రార్థనలో దేవుని అర్థింపుడు, కాని ఆ విధముగ అర్థించునపుడు కృతజ్ఞతాపూర్వకమైన హృదయముతో ప్రార్థింపుడు. మానవ అవగాహనకు అతీతమైన దేవుని శాంతి మీ హృదయములను, మనస్సులను యేసుక్రీస్తునందు భద్రముగ ఉంచును" (ఫిలిప్పీ 4:6-7; యాకోబు 1:5-6). ఈ విధంగా దేవునిపై ఆధారపడి, విశ్వాసంతో ప్రార్థిస్తే, అదేవిధంగా కుటుంబ సమేతంగా అందరూ ప్రార్థిస్తే కుటుంబంలో దేవుని శాంతి, అనుగ్రహాలు నిండుగా ఉంటాయి.

### 3.4. సమస్యను అర్థం చేసుకోవడం

కుటుంబంలో సంభవించే కలహాలకు, గొడవలకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఇద్దరూ కారకులే! నావల్ల ఈ సమస్య వచ్చిందా, లేదా వేరే వ్యక్తి వలన వచ్చిందోనని విశ్లేషించాలి. ఇద్దరూ కలిసి చర్చించాలి. సమస్య రావడానికి గల కారణాలను గుర్తించి, వాటిని పరిష్కరించుకోవాలి. మరోమారు ఇటువంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ విధంగా చర్చించాలన్నా దానికి కావలసిన జ్ఞానం దేవుని నుండి మాత్రమే వస్తుంది. "ఇల్లు కట్టవలెనన్న విజ్ఞానము అవసరము. పునాదులు ఎత్తవలెనన్న వివేకము ఉండవలెను" (సామెతలు 24:3). "సుబోధనలను

ఆలకించి, పాటించువాడు రాతి పునాదిపై తన ఇల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలి యున్నాడు" (మత్తయి 7:24). దైవజ్ఞానం మనకు లభిస్తే ఎంతటి సమస్యనైనా ఇట్టే పరిష్కరించుకోవచ్చును.

**ముగింపు**

భార్యభర్తలు అన్నాక సంసారంలో ఏదోఒక గొడవ రాకమానదు. అంతమాత్రాన గొడవను పెంచుకుని, బాధ్యతలు మరచి, ఎడముఖం–పెడముఖం పెట్టుకుంటే కుటుంబంలో ఆనందం ఉండదు. విశాల దృక్పథంతో, కుటుంబ శ్రేయస్సు కోరి, సమస్యలను తక్షణమే పరిష్కరించుకోవాలి. సమస్య పెద్దదయితే నిపుణుల వద్ద కౌన్సిలింగ్ తీసుకోవాలి. అంతేగాని సమస్యను విడిచిపెట్టకూడదు. ఒకరి లోపాలను ఒకరు మన్నించుకుంటూ, గ్రైపుచ్చుకుంటూ ముందుకు సాగితే కుటుంబంలో ఐక్యత, సంతోషం వెల్లివిరుస్తాయి. అటువంటి కుటుంబం సంఘానికి ఆదర్శంగాను, సంసారం అపురూపంగాను ఉంటాయి.

❊ ❊ ❊ ❊

# 4. భారతదేశ కుటుంబ వ్యవస్థ - సమస్యలు

– బ్రదర్ కుచ్చెర్ల మార్టిన్

**ఉపోద్ఘాతం**

ఈ ప్రపంచంలో ఏదికూడా దానికోసం అది జీవించదు. అవి వస్తువులైన జీవరాసులైనా, కడకు మానవులైన సరే! ఉదాహరణకు సూర్యుడు తన కోసం కాకుండ గ్రహాలకు (భూమికి) వెలుగు, వేడిమి పంచుతాడు. అలానే చంద్రుడు, నక్షత్రాలు, అహ్లాదాన్ని; చెట్లు ప్రాణవాయువును; పువ్వులు, పండ్లు, నీరు, నిప్పు అన్నీ వాటికొరకవి జీవించవు. అలానే గురువు శిష్యులు కొరకు, ఉపాధ్యాయుడు విద్యార్థుల కొరకు, వైద్యుడు రోగుల కొరకు జీవిస్తారు. ఆవిధంగానే కుటుంబంలో భార్య భర్తకోసం, భర్త భార్యకోసం అందుకే భార్యభర్తల మధ్యం ప్రేమ అన్యోన్య ప్రేమై ఉండాలి (1 సమూ. 1:8) మతం ఏదైనా, జాతి ఏదైనా, భాష ఏదైనా వివాహ ధర్మం ఒక్కటే! అదే సహజీవన సౌభాగ్యం. కాని, ప్రస్తుత సమాజంలో జరిగే ఆగోచర పరిస్థితులు కుటుంబ వ్యవస్థను భౌతికంగాను, మానసికంగాను ప్రభావితం చేస్తున్నాయి. కుటుంబ సభ్యుల్లోనే ఒకరిని ఒకరు చంపుకోటాలు, గృహహింస, కని పిల్లల్ని పారేయటం, బాలికలను అమ్మివేయడం, మానభంగాలు ఇలా ఎన్నెన్నో నేరాల గురించి మనం వింటున్నాం. ఈ సంఘటనల వలన కుటుంబ వ్యవస్థ నీర్సించిపోతుంది. కనుక ప్రతొక్కరు వ్యవస్థను పటిష్ట పరచ పూనుకోవలి.

అచంచలమైన చరిత్ర కలిగినది మన సుందర సుమనోహర దేశం. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశం మనది. భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, భాషలు, జాతులు; రకరకాల భౌగోళిక, చారిత్రిక, ఆర్థిక, సాంఘిక పరిస్థితులున్న దేశం. ఒక వనంలో వివిధ రకాల పూలు ఉండబట్టే అది చూడ ముచ్చటగా ఉంటూంది. అలానే

మన దేశంలో కూడా అనేక రకాలైన ప్రాంతాలు, ప్రజలున్నా "భారత దేశం నా మాతృ భూమి, నా దేశం అంటే మట్టికాదు, మనుషులు" అని సగౌరవంగా చాటుతాం. కాని మన మాటకు చేతకు ఏమైనా పొంతన ఉందా? ఈ ప్రశ్నకు జవాబు స్పష్టంగా దేశంలో గల విభజన ఇస్తుంది. 1. పట్టణ ప్రాంత కుటుంబాలు, 2. గ్రామీణ ప్రాంత కుటుంబాలు. దీనికితోడు కుల వ్యవస్థ, సృష్టించిన పేదరికం, ప్రాంతీయ తత్వం, మొదలయిన కుంచిత భావాల వలన అనేక సమస్యలు ఎదెరవుతున్నాయి. పేద కుటుంబాల స్థితి ఇప్పటికి కనీస అవసరాలుకూడా తీర్చుకోలేని పరిస్థితుల్లో ఉన్నాం. అందుకే బాల్య వివహాలు, బాల కార్మి కత్వం, బానిసత్వం, పాలేరుతనం, నిరక్ష్యరాస్యత, వ్యభిచారం వంటి అరాచకాలు; అనైతిక విలువలు పెచ్చుపెరిగి దూషణలు అయినా, ఆరుదుగా వచ్చే కొన్ని సంఘ సంస్కరణల ద్వారా కొన్ని మార్పులు వస్తున్నాయి. మనిషిని మనిషిగా గుర్తించ గలుగుతున్నారు. తోటివారికి అవసర సమయాలలో సహాయపడుతున్నారు. కాని ఇది చాలదు. అనుక్షణం వచ్చే సంస్కరణవల్ల కుటుంబ వ్యవస్థలో చైతన్యం పెరుగుతుంది. ఇందుకు క్రైస్తవులు నడుం బిగించాలి.

**1. కుటుంబం అనగా ఏమిటి?** "దేవుడు తన పోలికలో నరుని సృష్టించాడు" (ఆది. 1:27). ఆదాం ఏవలు ఆది దంపతులు. కుటుంబం ఏర్పడాలంటే వివాహం ముఖ్యం. వివాహమన్నది స్త్రీ పురుషుల మధ్య జరిగే ఒప్పందం కాదు, కాని పవిత్ర ఒడంబడిక. భార్యభర్తలు ఒకరిలో ఒకరు భాగస్థులవుతారన్న విషయానికి సమ్మతించడం. ఇందుకే ఆది దంపతుల వివాహం దేవుని సముఖంలో ఆదర్శంగ జరిగింది. "మీరు సంతానాన్ని కని, అభివృద్ధి చెందండి" (ఆది. 1:28) అని దీవించాడు. ఆమీదట, మానవ జాతిని ఫలింప జేసాడు. గృహస్థ జీవితాన్ని చేపట్టిన భార్యభర్తలు పరస్పర ప్రేమకలిగి, సహజీవనం ద్వారా వారి ప్రేమకు ప్రతిరూపాలైన బిడ్డలు పుడతారు. అట్టి కుటుంబాలలో తల్లిదండ్రులు కుటుంబాన్ని పోషిస్తూ, బిడ్డల ఆలనా పాలనా చూస్తూ, కష్టమైనా, సుఖమైనా, ఆరోగ్యమైనా, అనారోగ్యమైన, కలిమియైనా, లేమియైనా కలిసి కట్టుగా జీవన యాత్రను సాగిస్తారు.

గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయంపై ఆధారపడి జీవించే కుటుంబాలు కొన్ని, కూలీ చేసికొని బ్రతికే కుటుంబాలు ఇంకొన్ని. ఉద్యోగం చేస్తూ జీవించే కుటుంబాలు మరికొన్ని. ఏ కోవకు చెందినా, కుటుంబంలో ఆనందం, శాంతి



సమాధానాలు ఉండాలంటే మొట్టమొదట భార్యభర్తల మధ్య సదవగాహన, సహృదయం పరస్పర ప్రేమ కలిగుండి, ఎలాంటి దురలవాట్లు, వ్యసనాలకు లోనుకాకుండ పిల్లలకు ఆదర్శప్రాయంగ ఉండాలి. పిలల్లను క్రమశిక్షణతోబాటు విద్యాబుద్ధులు నేర్పుతూ, దైవభక్తి పెద్దలయెడ గౌరవం వారిలో పెంచాలి. లోక పోకడలు, నేటి సినిమాలు, దూరదర్శన ధారావాహికలు, భ్రూణ హత్యలు, మున్నగునవి కుటుంబాన్ని చిన్నాభిన్నం చేయడమేగాక, విడాకుల వరకు దారితీయగలదు. ఉద్యోగరీత్యా భార్యభర్తలు దూరంగ ఉన్నపుడు ఇద్దరూ శీలవరులుగా ఉండాలి. ఏ కుటుంబంలో అనురాగం. ఆత్మీయత, పరస్పర సహకారం ఉంటాయో ఆ కుటుంబం ఆదర్శంగ ఉంటుంది.

## 2. భారతదేశ కుటుంబ వ్యవస్థ

మన దేశంలో ఎన్నో రకాల ప్రజలు ఉన్నప్పటికి వారిని నాలుగు తరగతులుగ విభజించవచ్చు: 1. ధనికులు (రిచ్), 2. మధ్య తరగతి వారు (మిడిల్ క్లాస్), 3. పేదవారు (పువర్), 4. అట్టడుగు వారు (బిలో పావర్టీ లైన్). కుటుంబ వ్యవస్థ ఈ నాలుగు తరగతుల్లో ఒకేలా ఉండదు. ఒక్కొక్క తరగతికి చెందిన కుటుంబాలలోగల సమస్యలు ఒక్కో రకంగా ఉంటాయి. కుటుంబ వ్యవస్థ ఒక్కటే, కాని సమస్యల, బాధల కారణాలు వేరువేరుగా ఉంటాయి.

కుటుంబ వ్యవస్థ దేశానికి వెన్నుపూస లాంటిది, అదే సమాజంలో కుటుంబ వ్యవస్థ ఓ ఊయల లాంటిది. దేశంలోను, సమాజంలోను కుటుంబం ప్రముఖమైన స్థాపన. ఈ స్థాపనను నిజం చేసేదే భార్య భర్తలు. కుటుంబ వ్యవస్థ అభివృద్ధి చెందడానికి కొన్ని సంస్థలు అవసరం. ముఖ్యంగ పాఠశాలలు, ప్రభుత్వ స్వచ్ఛంద సంస్థలు, నైతిక బలమును చేకూర్చే మత సంస్థలు ఉండాలి. అందుకే మానవుల కోసం స్థిరమైన పర్యావరణంగా కుటుంబాన్ని దేవుడు సృష్టించాడు. ఫలితంగ ప్రతి ఒక్కరు తమ పిల్లల కోసం కుటుంబ వాతావరణాన్ని ఏర్పరచుకుంటారు. ముఖ్యంగా.....

**2. 1.** శారీరకంగా పిల్లల్ని దృఢంగా పెంచాలి; పౌష్టిక ఆహారాన్ని ఇస్తూ, శరీరాకృతి కలిగేలా భోజనాన్ని అందిస్తారు.

**2. 2.** శారీరకంగా మాత్రమేగాక, తమ పిల్లలు బుద్ధిపరంగా కూడా ఎదగాలని ఆలోచిస్తారు. మంచి మనసు ఉండాలంటె మంచి ఆలోచనా ధోరణి ఉండాలి. అందుకు మంచి విద్యాపీఠాలుండాలి. (పుట 19)

**2. 3.** ఆధ్యాత్మికంగా, సామాజికంగా పిల్లలను మంచి మార్గంలో నడిపించాలి. దైవసాయాన్ని అర్థించమని నేర్పడం, నైతిక విలువలను తెలియపర్చడం కుటుంబంలోనే ప్రారంభమవుతుంది.

**2. 4.** ఈ విలువలను ముందు తల్లిదండ్రులు పాటించి, అప్పుడు పిల్లలకు నేర్పాలి. ఇట్టే పట్టుకుంటారు. భార్యభర్తల ప్రేమ బంధాన్ని పిల్లలు ఆదర్శంగ తీసుకుంటారు. పెద్దల మధ్య వివాదాలుంటే వాటినే పిల్లలు అనుసరిస్తారు. ప్రేమలో, ఆప్యాయతలో వారిని పెంచాలి. పిల్లలు తల్లిదండ్రులతో స్వేచ్ఛగా మాట్లాడగలగాలి. అపుడు పిల్లలు క్రమశిక్షణలో ఎదుగుతారు.

**2. 5.** కుటుంబం ఒక సృష్టి బిందువు. ఎందుకంటే భార్యభర్తల ప్రేమ బంధం కటుంబం నుంచే పుడుతుంది. అలానే కుటుంబం ఒక సారవంతమైన నేల. పిల్లలు ఈ క్షేత్రంలో అభివృద్ధి చెందుతారు. దేవుడు ఇచ్చిన వరాలను, శక్తిసామర్థ్యాలను పండించుకుంటారు.

**2. 6.** కుటుంబం భద్రతకు సంరక్షణకు నిలయం. జీవితం పూల పాన్పు కాదు. కాష్టాలు, కన్నీళ్లు, ఆనంద సంతోషాల కలియకే జీవితం. ఎదురయ్యే అలజడులు, తుఫానులను తట్టుకొని సేదతీర్చుకొనేది కుటుంబంలోనే. షడ్రుచుల జీవితంలో అనేక ఆటుపోటులు కలగడం సహజం. మరి ఈ చీకటి వెలుగుల జీవితాన్ని కాపాడేది కుటుంబమే.

**2. 7.** కుటుంబం విలువలను అందించే ఓ కేంద్ర బిందువు. తరతరాల నుండి వచ్చే సంస్కృతి సంప్రదాయాలులానే ఒక తరం నుండి మరో తరానికి విలువలను అందించేది కుటుంబం. ఉదాహరణకు ప్రేమ, క్షమాగుణం, దయ, ఉదారత్వం, మనిషి ముఖ్యమన్న ధోరణి, పరులపై గౌరవభావం వంటి విలువలు పిల్లలకు సమాతృకగా అబ్బుతాయి. కుటుంబంలో సభ్యులందరూ ఒకరిని ఒకరు ప్రేమతో గౌరవించుకున్నట్లయితే, ఆ ఆప్యాయతపు పలకరింపుల్లో చిన్నవారు తన్మయం చెంది, వాటిని పుణికిపుచ్చుకుంటారు. ఇటువంటి స్వచ్ఛమైన ప్రేమను కుటుంబం తరువాత చర్చిలోను, విద్యాలయాలలో నేర్చుకుంటారు. ఈ ఆధ్యాత్మిక, నైతిక విలువలు భవిష్యత్తు జీవితానికి పునాదులుగా ఉంటాయి. అందుకే ఆంగ్లంలో ఒక సామెత ఇలా చెబుతుంది,



“వాల్యూస్ ఆర్ నాట్ టాట్ బట్ ఆర్ కాట్” విలువలు నేర్చుకొనేవి కావు కాని, పట్టుబడేవని దానర్థం. అందుచేతనే తల్లిదండ్రులు మంచి విలువలను ఆచరిస్తూ పిల్లలకు ఆదర్శం ఇవ్వాలి.

బాధలు కలిగినపుడు కృంగిపోవడం, సంతోషం వచ్చినపుడు ఉబ్బిపోవడం తగదు. అనుకూల వాదంతో (పాజిటివిజం) ఉండాలి. సమస్యలను పరిష్కరించుకోవాలి. ఒండొరుల హెచ్చుతగ్గులను అంగీకరించుకోవాలి. ఇచ్చిపుచుకొనే ప్రేమ (రెసిప్రోకల్ లవ్) ఉండాలి. మనసును నొప్పిస్తే దేవుడిచ్చిన క్షమా వరాన్ని వాడుకోవాలి. ప్రేమ-క్షమా గుణాలముందు ఎంతటి మనస్పర్థలైనా మటుమాయమవుతాయి. కృతజ్ఞతలు, చిన్న పొగడ్తలు అవసరమే! అపుడు ఆనందంగా ఉండగలరు. తల్లిదండ్రులను బట్టి సంఘంలో తమ పిల్లలకూ గౌరవం దక్కుతుంది.

## 3. కుటుంబ వ్యవస్థలోని సమస్యలు

కుటుంబ వ్యవస్థలో అనేక సమస్యలు ఉంటాయి. సాంఘిక, ఆర్థిక పరిస్థితుల గురించి వేరే వ్యాసంలో చూస్తారు. ఇక్కడ మనం 1. భౌతిక-వస్తు వినిమయం, 2. విచక్షణ/ రాహిత్యం, 3. మతపరమైన ఆచారాలు-మతోన్మాదము 4. తప్పుడు అభిప్రాయాలు అన్న అంశాలను చూద్దాం.

### 3.1. భౌతికవాదం/వస్తువినియమ వాదం

ప్రస్తుతం ఈ వాదం (కన్సూమెరిజం) కుటుంబ వ్యవస్త మీద ఎక్కువ ప్రభావం చూపుతుంది. ధనముంటే చాలు ఇక ఏమీ అక్కర లేదన్న భావం ప్రతి ఒక్కరిలో చోటు చేసుకుంటుంది. కాని ధనమే అన్ని వినాశాలకు దారితీస్తుంది. విలాసవంతంగ ఖర్చు పెట్టడం, దుర్వినియోగం చేయడం, వస్తువుల విలువను గుర్తించకపోవడం, అవసరమున్నా లేకపోయినా ఇంటిని వస్తువులతో నింపడం లాంటి పనులు ఎక్కువయ్యాయి. రంగులను చూసి వస్తువుల మీద మోజుపడడం, హోదాకోసం, పోటీ కోసం వాటిని వీటిని కొనడం జరుగుతుంది. ఇదిలా ఉండగా ప్రచార మాధ్యాలు (మీడియా) అభివృద్ధి చెందడం వలన, దాని గురించి సరియైన అవగాహన లేకపోవడం వలన కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుంది. చివరికి కుటుంబాన్ని ఒక కొనుగోలు వస్తువుగా చిత్రీకరిస్తూ విలువల్ని మంటగలుపుతున్నారు. పేద కుటుంబాలు

అధైర్యపడుతున్నాయి. ధనిక కుటుంబాలు అస్తవ్యస్తంగ తయారవుతున్నాయి. అనవసర ఖర్చులతోబాటు, వరుడ్ని, విద్యను, వినోదాన్ని కొనవలసి వస్తుంది. ఇలాంటి వాటితో కుటుంబ వ్యవస్థ అతి ధారుణంగ తయారవుతుంది.

## 3.2. విచక్షణ / విచక్షణారాహిత్యం

ప్రచార మాద్యమాలు వలన ప్రజలు సంకుచిత మనస్కులై అవే లోకంమని అనుకుంటున్నారు. ప్రచురించిన ప్రేమ కథలు,శృగార లీలలు నేటి యువతరాన్ని, పిల్లలను కూడా ప్రభావితం చేస్తున్నాయి. సమయం దొరికతే చాలు టీవి చస్తూ కాలం గడిపేస్తున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడే తీరికలేదు ఈనాడు. అందరూ సరదాగ మాట్లాడుకోక, టీవి సీరియళ్లకు అతుక్కుపోయి ఒంటరితనానికి దగ్గరవుతున్నాడు. పాతకాలంలో కుటుంబాలు సంతోషంగ గడిపేవారు. ఈనాడు చిన్న కుటుంబాలైనా ఆనందంగ జీవించలేకున్నారు. సృజనకు, మంచి ఆలోచనలకు, దైవచింతనకు, ఆటవిడుపుకు తావులేదు. పైగా మాద్యమాలు తప్పుడు తోవను పట్టించి, కుటుంబ వ్యవస్థను అతలా కుతలం చేస్తున్నాయి.

## 3.3. మతపరమైన ఆచారాలు / మతోన్మాదం

కొన్ని మత లేక సంస్కృతులను బట్టి పురుషాదిక్య పరిస్థితి నెలకున్నపుడు, కుటుంబంలో భార్య స్థానం ద్వితీయం లేక తృతీయం అవుతుంది. ఒక్కొక్క సారి ఆమె స్థానం చిట్టచివరిదిగా ఉంటుంది. అటువంటప్పుడు భార్యభర్తల మధ్య ఉండవలసిన అన్యోన్య ఆప్యాయతలు ఉండవు, భార్యకు కుటుంబ నిర్ణయాలలో భాగం ఉండదు. కొన్ని యెడల మత సిద్ధాంతాలు కూడా ఆమెను నొక్కిపెట్టి ఉంచుతాయి. భార్యపభర్తలు వేరు వేరు మతాలకు చెందినపుడు, స్వేచ్ఛలేక వారి విశ్వాసాన్ని అనుసరించటానికి వీలుపడని పరిస్థితులు నెలకొని ఉంటాయి. మత మౌఢ్యం, మతోన్మాదం వలస కుటుంబాలలో రగడలు, రాదాంతాలు సంభవిస్తాయి. భారత స్త్రీకి  వినలేని గౌరవం ఉందని, దేవతని కొనియాడడమే తప్ప నిజానికి స్త్రీని ఆటవస్తువుగానే భావించడం జరుగుతుంది. దీని మూలంగ మతం పై ద్వేషం మనసులో పేరుకుపోయి, వారిలో అసహనం చోటు చేసుకుంటుంది. తద్వారా భార్యభర్తల మధ్య ద్వేషం మనసులో పేరుకుపోయి, వారిలో అసహనం చోటుచేసుకుంటుంది.



తద్వారా భార్యభర్తల మధ్య పొరపొచ్చాలు అధికమై, భావోద్వేగాలకు దారితీస్తుంది, ఒక్కొక్కపరి విడాకులవరకు వెల్తుంది.

## 3.4. తప్పుడు అభిప్రాయాలు

భారతదేశం మూఢ నమ్మకాలకు ప్రసిద్ధి. వీటివలన తమ పరిస్థితులు కర్మ మూలంగ సంభవించాయని భావించి, ఏమాత్రం కృషి సల్పరు. ఈ సిద్ధాంతం క్రైస్తవంలో కూడ గూడు కట్టుకుంది. దేవుడే మాకీ దుస్థితిని ఇచ్చాడని తలంచి, నిర్వీర్యమై, వగచి “కర్మ” అని భవిష్యత్తు గురించి ఆలోచించరు. అలాగే ధనవంతులు పేదవారిని శాపాగ్రస్తులుగా పరిగణిస్తారు. ఈ తత్వంతో అనేక మంది ‘‘మా గతి ఇంతే” అని నిర్లక్ష్యంగ, నిరాశతో జీవిస్తున్నారు. అందువలన దేశంలో పేదరికం పెరుగుతుందే తప్ప ప్రగతి కనిపించదు. దానికితోడు సమస్యలు పెరుగుతూనే ఉంటాయి.

## 4. మరికొన్ని సమస్యలు

దేశం అభివృద్ధి చెందడానికి అనేకమైన మార్పులు చోటుచేసుకుంటాయి. కాని ఒక్కొక్కపరి అవే కుటుంబ వ్యవస్థను కనిపించకుండ దెబ్బతీస్తాయి. అవి జీవనోపాదికి అవసరమే అయినా వానుకమాటు నుండి వ్యవస్థను కూలదోస్తాయి. అవి ఎలా దెబ్బతీసి, కూలదోస్తాయని ఇక్కడ చర్చించడం లేదు, కాని ఆ అంశాలను కేవలం పొందుపరుస్తున్నాం. అవి, 1. పారిశ్రామీకరణం అధికమవడం, 2. పట్టణం మీద మోజుతో గ్రామీణ జీవితానికి స్వస్తి పలకడం, 3. నిరుద్యోగ సమస్య, 4. కొందరిలో నిరక్ష్యరాస్యత, 5. విదేశీ దేశీయ సంస్కృతి ప్రభావం – దాని మూలంగ వివాహంలో మార్పులు చోటుచేసుకోవడం, 6. అధిక జనాభ వలన, 7. వ్యవసాయ క్షేత్రాలు తగ్గు ముఖం పట్టడం, 8. వాణిజ్య వ్యవహారాలు – కొనుగోలుదారుల ధోరణి, 9. నీతి నియమాలకు నీళ్ళొదలడం, 10. బాల కార్మికుల ఉనికి ఇలా ఎన్నెన్నో కారణాలు కుటుంబ వ్యవస్థను చాపక్రింద నీరులా పాడుచేస్తున్నాయి.

ఇలా ఎన్నెన్నో కారణాలవల్ల కుటుంబ వ్యవస్థ దెబ్బతింటుంది. కనుక, దేశం బాగుపడాలంటే, ముందుగా సంఘువ్యవస్థ బాగుండాలి. సంఘువ్యవస్థ బాగుండాలి. మనుష్యులు గొప్పవారవ్వాలన్నా, చెడ్డవారవ్వాలన్నా కుటుంబం నుండే మొదలవుతుంది.

కాబట్టి ముందుగా కుటుంబ సమస్యలను సరిదిద్దాలి. అందుకోసం అందరూ కృషిచేయాలి. కుటుంబంలో మంచి వాతావరణాన్ని నెలకొల్పాలి. నేటి బాలలే రేపటి పౌరులు. అలానే రేపటి కుటుంబ వ్యవస్థ. అందుచేత, ప్రభుత్వం, మతం, సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు తల్లిదండ్రులు ఎనలేని కృషి సల్పాలి. అక్షరాస్యత పెంచి, పిల్లల ఆలోచన ధోరణలను సరళ మార్గంలో పెట్టి, కుటుంబ గౌరవాన్ని పెంచే భావి పౌరులుగా తీర్చిదిద్దాలి.

## 6. మంచి కుటుంబానికి ఉండాల్సిన లక్షణాలు

మంచిచెడులను వేరు చేయగల సామర్థ్యం పెంచడానికి విలువలు చాలా అవసరం. ఓ మంచి కుటుంబంగా సంఘంలో నిలబడటానికి ఆ కుటుంబ సభ్యులు ఎన్నో నైతిక విలువలను కలిగుండాలి. వాటిలో ముఖ్యమైనవి. 1. ప్రేమ, 2. క్రమ శిక్షణ, 3. కట్టుబాటు, 4. సుమాతృక, 5. బాధ్యత. వీటిని విపులంగ చూద్దాం.

### 6.1. ప్రేమ

ప్రేమ అనేది చాలా గొప్ప విషయం. మనసులను, మనుష్యులను కలిపేది ప్రేమ. ఆపదలో ఆదుకొనేది ప్రేమ. అవసర సమయాలలో ఇతరులకు సహాయపడేది ప్రేమ. శత్రువలను సహితం ఆదరించగలిగేది ప్రేమ. "తన స్నేహితుని కొరకు ప్రాణమిచ్చుట కంటె వేరే ప్రేమ లేదు" అని ప్రభువు బోధించాడు. ప్రేమ ఒక వస్తువు కాదు, పరులను ప్రేమించడం ద్వారానే ప్రేమను చూపగలం. కరుణతో చూడడం ద్వారా, చల్లని మాటద్వారా, కరచాలనం ద్వారా, దయతో ఉపకారం చేయడం ద్వారా ప్రేమను చూపగలం. కుటుంబంలో ప్రేముంటే చాలు ధనైశ్వర్యాలు అవసరం లేదు.

### 6.2. క్రమశిక్షణ

"మొక్కై వంగనిది మ్రానై వంగునా? అన్న సామెతకు అర్థం చిన్న తనంలో క్రమశిక్షణ లేనపుడు పెద్దయినపుడు సంఘ విద్రోహులుగా మారవచ్చు. పాదుకు పందిరి అవసరం, బంగారు పళ్లానికైనా చేరువు అవసరం. చిన్న మొక్కలను మనకు కావలసిన రీతిలో వంచి ఆకారాలను మలచవచ్చు. అలానే చిన్నపుడే పిల్లలను క్రమశిక్షణలో పెంచితే, వారు పెరిగి పెద్దయి సంఘానికి ఉపయోగపడే పౌరులుగా



తయారవుతారు. అయితే, ముందు తల్లిదండ్రులు మంచి క్రమశిక్షణ కలిగుండాలి. వారిని చూచి, పిల్లలు నేర్చుకుంటారు. అలాంటి పిల్లలు సమాజంలో ప్రయోజకులుగా ఉంటారు. దీని మూలంగ సంఘం, దేశం బాగుపడుతుంది. కనుక పిల్లలకు, పెద్దలకు కూడా క్రమశిక్షణ అనివార్యం.

### 6.3. కట్టుబాటు

ఇది పాత పదం. బహుశా చాలా మంది ఆధునికలు ఆలకించి ఉండదు. కాని ఇది సంఘంలో అవసరం. కట్టుబడి, కట్టుదిట్టం, కట్టడి వంటి పదాలు కట్టుబాటుకు పర్యాయ పదాలు. కట్టుబాటు అంటే అన్నింటికి తలవంచమని కాదు. కుటుంబం అన్నాక, సంఘం అన్నాక తప్పక ఈ కట్టుబాట్లు ఉంటాయి. కుటుంబ శ్రేయస్సుకోరి, సంఘం అభివృద్ధికోరి పెద్దలు కొన్ని నియమాలను ఏర్పరుస్తారు. కుటుంబ సభ్యులు, దేశ పౌరులు నియమాలకు విలువనిచ్చి, నీతినియమాలకు బద్ధులై ఉండాలి. అపుడు ప్రతీది బాధ్యతాయుతంగ ఉంటుంది. ఎవరిష్టం వారిదైతే అంతా చిందర వందరగా తయారై, కుటుంబ విలువలను మంటగలుపుతారు. అపుడంతా చిన్నాభిన్నం అవుతుంది. క్రమంతప్పి, అరచకాలు అందోళనలు విరివిగా చోటుచేసుకుంటాయి. కనుక, ప్రశాంతత నెలకొని ఉండాలంటే, కుటుంబంలోను, సమాజంలోను ఈ కట్టుబాట్లు చాలా అవసరం.

### 6.4. సుమాతృక

"ఫేస్ ఈజ్ ద ఇన్డెక్స్ ఆఫ్ ద మైండ్" అంటే ముఖం చూస్తే చాలు బుద్ధులెలాంటివో తెలుస్తాయి. అలానే తల్లిదండ్రులు ఎలాంటివారో వారి పిల్లల్ని చూసి చెప్పవచ్చు. ప్రతీ చిన్న విషయం పిల్లలు తల్లిదండ్రుల నుంచి నేర్చుకుంటారు. అందుకే బిడ్డ మొదటి పాఠశాల అమ్మవడి అంటారు. పిల్లలు బడికి వెళ్ళినా, గుడికి వెళ్ళినా, జీవన విధానాలు నేర్చుకొనేది ఇంటి వద్దనే. అందుకే తల్లిదండ్రులు ప్రేమ, అనురాగం, క్షమాగుణం, దయ, కృతజ్ఞతా భావం, సౌభ్రాతృత్వం, నీతి నిజాయితీ, సేవానిరతి వంటి గుణాలను పిల్లలకు నేర్పాలి. ఈ సుమాతృకలను అనుసరించి పిల్లలు ఎదిగితే రత్నాలౌతారు. అపుడు భారతదేశం "రత్నగర్భ" అన్న నానుడి నిజమవుతుంది.

### 6.5. బాధ్యత

ఎంత హక్కు ఉంటుందో అంత బాధ్యత ఉంటుంది. అలానే ఎంత అధికార ముంటుందో ఆంత బాధ్యత ఉంటుంది. తండ్రి ఇంటి యజమాని అలాని అధికారిలా ఉండకూడదు. ప్రేమతో అధికారాన్ని నెరపాలి. భార్యను ప్రేమతో చూసుకొని, పిల్లలను లాలించాలి. పునీత యోసేపు బాలయేసును జాగ్రత్తగా చూసుకున్నాడు. తరువాత తల్లి యజమానురాలు. ఢీల్లికి రాజైనా ఓ తల్లికి కొడుకేనని సామెత. తల్లినిబట్టి పిల్లలు. పరిశుద్ధ మరియ ఎంతగా యేసుని తీర్చిదిద్దింది. పూర్వ నిబంధనలో సమూయేలు తల్లి హన్నా, మక్కబీయుల్లో ఏడుగురు కుమారుల తల్లి చాలా ఆదర్శవంతులు. పిల్లలుకూడా తమవంతు విధులను నెరవేర్చాలి. బాలయేసు విధేయతను చూపి, దృఢకాయుడై తన సిలువ మార్గానికి తననుతాను సద్ధపరచుకున్నాడు. అలానే పిల్లలు ఏదైతే అవాలనుకున్నారో అందుకు తమనుతాము సిద్ధపరచుకోవాలి. ఇది వారి బాధ్యత కూడాను.

### ముగింపు

దేవుడు మానవుల కోసం ఎన్నో వరాలను అనుగ్రహించాడు. వాటన్నిటిలో ప్రధానమైనది కుటుంబ వ్యవస్థ. మనిషి ఒక కుటుంబంలో పుట్టి, తరువాత కాలంలో తానే ఒక కుటుంబాన్ని ఏర్పరచుకొని అందులో గల బాధ్యతలను నెరవేర్చడం ద్వారానే పరిపూర్ణతవైపు పురోగమించగలడు. ఈ విధంగ మనిషి జీవిత కాలగమనం కుటుంబం అనురాగ నిలయమై, శాంతి సమాధానాలకు ఆలయమై ఉంటే గృహమే స్వర్గసీమగా భాసిల్లుతుంది. భార్యభర్తల మమతానురాగాల ఆలింగనం శిశువుకు జన్మనిస్తుంది. తల్లిదండ్రుల ప్రేమాను రాగపు శిక్షణలో బిడ్డ అభివృద్ధి చెందుతుంది. బిడ్డలు మంచి మనుషులుగా మారేది ఈ గృహసీమలోనే. మానసిక ఎదుగుదల పొందేది మంచి బడులలోనే. ఆధ్యాత్మిక పెంపొందు జరిగేది చర్చిలోనే. ఈ మూడు దేవాలయాలు మనిషిని పరిపక్వం వైపు నడిపిస్తాయి, ఉన్నత వికాస శిఖరాలను అధిరోహింపజేస్తాయి. మంచి వ్యక్తిత్వంలో రాణిస్తారు. కాబట్టి, మనషి జీవనారంభం, ఆలంబన, వ్యక్తిత్వం నిర్మాణం, మనోవికాసం అన్నీ వికసించేది కుటుంబాన్ని బట్టే. మట్టి మనిషిని మనిషిగా తయారు చేసే ఈ కుటుంబానికి, కుటుంబ వ్యవస్థకు జోహర్లు.

❀ ❀ ❀ ❀

# 5. కుటుంబాలలో కారుణ్య జూబిలి సంవత్సర వేడుకలు

**– బ్రదర్ బొడ్డు సునిల్**

“కారుణ్య జూబిలి సంవత్సరం అనేది మన శత్రువులను క్షమించడానికి, ఒకరితోనొకరు సఖ్యతపడటానికి, మనలోగల ప్రతీ గాయాన్ని స్వస్థపరచుకోడానికి ప్రతీ కుటుంబ సభ్యునికి ఇది మంచి సమయం” అని ఫ్రాన్సిస్ జగద్గురువులు నుడివారు. ప్రతీ కుటుంబం నేటి ప్రపంచానికి సాక్షులుగా, దేవునికి ప్రతీకలుగా ఉండాలి. తద్వారా తండ్రి దేవుని కరుణా కటాక్షాలుకుటుంబాల పై ఎల్లప్పుడు ఉంటాయి. క్రీస్తు ప్రభువు పలికినట్లు, “పరలోక తండ్రివలె కనికరము గలవారై యుండుడు” అన్నది ప్రతీ కుటుంబ సభ్యుని మదిలో మెదలుతూ ఉండాలి. ఆ విధంగ ప్రభుని దివ్య ముఖమును ప్రతియొక్కరిలో దర్శించగలం, రక్షణ పొందగలం.

### 1. కారుణ్యం అంటే ఏమిటి ?

కారుణ్యం అంటే, తన అధికారానికి లోబడి, తన నుండి దాక్షిణ్యం పొంద హక్కులేనట్టి వ్యక్తిపై ఒకరు చూపే సానుభూతి, దయకాదు. కాని, ఇది దేవుని కరుణ, తన మృదుత్వానికి, ప్రేమ కలిగిన దయకు సంబంధించింది. “కృప మానవున్ని పాపాత్ముడని, దోషియని, నిందితుడని తలస్తే, కారుణ్యం అదే మానవున్ని కష్టస్థితిలో, అవసర సమయాలలో ఉన్నవాడని గ్రహిస్తుంది” అని విలాడ్ ఎరిక్‌సన్ అన్నాడు. రెండవ జాన్‌పాలుగారు, “ప్రేమకు మారుపేరు కారుణ్యం” అని అన్నారు. దేవుని కారుణ్యం మానవుని శారీరక, మానసిక, ఆధ్యాత్మిక బాధలలో హత్తుకుంటుంది. మనిషి పాపం చేసి దేవుని నుండి దూరంగనుండి నిస్సహాయ స్థితిలో ఉన్నప్పుడు దేవుడు చూపే స్పందన కరుణ. దీనిని క్రీస్తు తన సిలువ మరణ ఉత్థానాల ద్వారా మానవుని పాపంనకు ప్రాయశ్చిత్తంచేసి, తన కరుణను పునరుద్ధరించారు.

కారుణ్యం అంటే దయ, సానుభూతి, ఇతరులపట్ల క్షమాగుణంతో వ్యవహరించడం. ఇతరలకు దు:ఖంనుండి ఉపశమనాన్ని, కట్టలేని పరిస్థితిల్లో వారి అప్పులను రద్దుచేయుట. కారుణ్య మనేది దయ, సహనం, క్రియాశీలతలు సంగమమై ఉన్నాయి. కరుణకు మూడు గుణాలుంటాయి. **1. జాలి :** ఇతరులు బాధలలో ఉన్నపుడు వారికి సహాయ పడాలనే తపన ఉంటుంది. వీరి స్పందన లోతుగా ఉంటుంది. ఇతరులు కష్టాల్లో ఉంటే సాయం చేయాలన్న మనస్తత్వం వీరిది. **2. క్షమాపణ :** ఒకరు తప్పు చేసినపుడు దోషిగా చూడక, మన్నింపును దయచేయచేస్తారు కొందరు. తప్పులను మన్నించడం దేవుని సుగుణం కనుక, క్షమించేవారు దేవునితో సమానం. **3. సహనం :** ఏదేని తప్పు జరిగినా, లేక అనుకున్నది జరగకపోయినా కొందరికి చట్‌మని కోసం వస్తుంది. అలాకాకుండా నిగ్రహించుకొని, ఓర్పుతోను, సానుభూతితోను విషయాన్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నించడం. ఇటువంటి వారు కొందరు పడరు.

ఇలా కరుణ ఇతరుల తప్పిదాలను క్షమిస్తుంది, చెడ్డవారని చూచి చింతిస్తుంది, కష్టాల్లో ఉన్నవారి యెడల సాయం చేయాలని తపన పడుతుంది, ప్రతీ కార్యమందు పట్టువిడువక ప్రయత్నిస్తుంది. ఇప్పుడు దీనిని ఇంతగా గుర్తు చేయడం ఎందుకంటే, ఈనాటి ప్రపంచం అవినీతిలో కూరుకుపోయింది. పాపపు జీవితాలు లోకాన్ని నాశనం చేస్తుంది. కాబట్టి దేవుని కారుణ్యం ఎంతైనా అవసరం. ఈ కారుణ్య నీతి పరంగా ఏది తప్పో ఏది ఒప్పో అని తీర్పు నివ్వదు. కారుణ్య హృదయంలోగల మంచి నిధిని బయటకు తెస్తుంది.

## 2. ప్రత్యేకమైన కారుణ్య జూబిలి సంవత్సరం ఎందుకు?

ద్వితీయ వాటికన్ మహా సభలు ముగిసి 50 సంవత్సరాలు అయిన సందర్భంగాను, ఈ జూబిలిని పురస్కరించుకొని, తల్లి శ్రీసభకు దూరంగ ఉన్న వారికి దేవుని కారుణ్యాన్ని అందచేయాలన్న సంకల్పంతోను పరిశుద్ధ ఫ్రాన్సిస్ జగద్గురువులు డిశంబర్ 8, 2015 నుండి నవంబర్ 20, 2016 వరకు పునీత పేతురుని బసిలికాలో కారుణ్య జూబిలి సంవత్సరంగ ప్రకటిస్తూ "మిజెరి కోర్టియా ఉల్‌తుస్" అనే పత్రాన్ని విడుదల చేసారు. దీని సారం : "తండ్రి దేవుని కారుణ్యం యేసుక్రీస్తు. క్రైస్తవ విశ్వాస రహస్యమంతా ఈ మాటలలో నిక్షిప్తమై ఉంటుంది. నజరేతు యేసునందు కారుణ్యం ప్రత్యక్షమవుతుంది. అతనియందే అది అత్యున్నత స్థితికి చేరుకుంది. కరుణ అనేది ఆనందం, పవిత్రత, శాంతల ఊట. మన రక్షణంతా దీనిమీదే ఆధారపడుంది. ఇది పరమ పవిత్ర త్రీత్వైక దేవుని రహస్యం. ఎందుకంటే, దేవుడు చిట్టచివరిగా మనలను కలుసుకొనే అత్యున్నత చర్య. కొన్నిసార్లు మనకు మరింత చురుకుగా, దృఢత్వంతో కరుణకలిగి ఉండుటకు పిలువబడితిమి. ఎలయన, తండ్రి దేవుని నిర్దిష్ట కరుణ కార్యం యొక్క చిహ్నం మన జీవితంలో కూడా చోటు చేసుకోవచ్చును. తద్వారా విశ్వాసులు తమ సజీవ సాక్ష్యాంతో దృఢంగా కారుణ్యంలో బలపడాలి".



ఆదామవ్వల పాపం తరువాత దేవుడు మానవజాతిని పాపంలోనే విడిచి పెట్టాలనుకోలేదు. కాని, తన దృష్టిని నిష్కళంక ప్రేమ కలిగిన మరియవైపు మరల్చారు. మానవ రక్షకునికి తల్లిగా ఎన్నుకున్నారు. ఘోర పాపంలో పడున్న మానవునిపై తన సంపూర్ణ కరుణను ప్రదర్శించాడు. అందుకేనేమో, "దేవునికి మరో పేరు కారుణ్యం". ఆయన కరుణను, ప్రేమను చాటి చెప్పటానికి మాత్రం ఉపయోగించలేదు. ఎందుకన, ప్రేమను ఆయననుండి ఎంత మాత్రం వేరుచేయలేం. దేవుడు ఎప్పుడూ కోరుకొనేది మన జీవితం సంతోషంగా ఉండాలని, శాంతి సమాధానాలు కలిగుండాలని కోరుకున్నాడు. ఈ మార్గమందు కారుణ్యం కలిగి క్రైస్తవులుగా ప్రేమను కనబరచాలి.

పరిశుద్ధ జాన్ పౌలు పలికినట్లు, "మనం నేడు సంస్కృతిక పరిస్థితుల ప్రభావం వలన కరుణ అంశాన్ని మరచిపోతున్నాం. ఈనాటి మనస్తత్వం, గతంలోని ప్రజల కంటే ఎక్కువగా దేవుని కరుణను వ్యతిరేకిస్తున్నట్లుంది. జీవితం నుండి తొలగిస్తున్నట్లుంది. అసలు మానవ హృదయం నుండే కారుణ్యమనే ఆలోచనను తొలగిస్తున్నట్లుంది". అంటే, మానవత్వమంతా సమకాలీన సహజ జ్ఞానములన్నిటి ప్రకారం ఇది అంతులేని ప్రమాదంనకు, బెదిరింపునకు లోనైయుంది. క్రీస్తు పరమ రహస్యం ఇటువంటి సమయంలో జగద్గురువుని కారుణ్యమంటే దేవుని కరుణగల ప్రేమయని ప్రకటించుటకు ప్రేరేపిస్తుంది. ఇక్కడ శ్రీసభ తననుతాను ప్రేమకు సేవకురాలిగా చేసికొంటుంది. సమస్త ప్రజలకు మధ్య వర్తిత్వం వహిస్తుంది. అది

ప్రతి ఒక్కరిలోను ఉన్న ప్రేమ. ప్రతి ఒక్కరిని మన్నించగల ప్రేమ. ఎక్కడైతే శ్రీసభ ఉంటుందో అక్కడ తండ్రి కృప బహిర్గతమవుతుంది.

చివరిగా, ప్రభుని మాటలైన, "తండ్రివలె మీరును కనికరము కలవారై ఉండుడు" (లూకా 6:36). అన్న నిజాన్ని ఈ జూబిలి తెలియజేస్తుంది. అలానే మరియమాత కూడా కరుణగల ద్వారం వంటిది. ఇది ఒక జీవిత కార్యక్రమం. తండ్రి దేవునివలె కనికరం కలిగి ఉండడం ఈ పవిత్ర సంవత్సరంనకు ఆదర్శం. కాబట్టి ప్రతీ కుటుంబం జీవిస్తూ, దేవుడు మనలను ఎంతగా ప్రేమిస్తున్నాడో రుజువు చేయగలం.

## 3. కుటుంబాలలో కారుణ్యం ఎలా?

కుటుంబ జీవితంలో కారుణ్యం వజ్రం లాంటిది. అది చాలా ముఖతలాలతో కూడినట్లే ఈ కారుణ్య సుగుణాన్ని వివిధ విధాలుగా చూపవచ్చు. అన్నింటిని చూడకపోయినా ఈ విభాగంలో అరింటిని మనం చూద్దాం.

### 3.1. ఓర్పుతో కూడినది కారుణ్యం

కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరు వక్రబుద్ధితో ఉన్నట్లయితే వారి యెడల కారుణ్యంతో ఓర్పును ప్రదర్శించాలి. ఒక చెట్టుకు కాసే పండ్లన్నీ మంచిగా ఉండవు. అలానే పుట్టిన బిడ్డల్లో ఒక బిడ్డ చెడు బుద్ధులకు లోనుకావచ్చు. బిడ్డ శ్రేయస్సు కోరి, మంచి బుద్ధులు చెబుతూ మార్చటానికి ప్రయత్నించాలి. భర్తగాని పెడసరంగ ప్రవర్తించవచ్చు. ఒకరిని ఒకొకరు మన్నించుకోడానికి కారుణ్యంతో కూడిన ఓర్పు అవసరం. కుటుంబంలో ఒకరు దీర్ఘకాలిక జబ్బుకు గురికావచ్చు. వారికి సేవచేయడానికి సముద్రమంత ఓర్పుకావాలి. యాకోబు అంటారు, "దివ్యమగు వివేకము స్వచ్ఛమయినది. అంతేగాక, అది శాంతి ప్రధమైంది, మృదువైనది, స్నేహపూర్వకమైనది. అది కనికరముతో నిండి యుండి సత్కార్యప్రధమగును. అది పక్షపాతమునకును, వంచనకును దూరమైనది" (3:17).

### 3.2. అపకారికి ఉపకారం

నిన్ను ఎవరైతే హింసిస్తున్నారో వారికి సహాయం చేయడమే కరుణ. నీసహోదర రునిపట్ల కరుణకలిగి జీవించనట్లయితే ఏవిధంగా నీవు అతనిని/ఆమెను



ప్రేమించగలవు? అని క్రీస్తు మనలను ప్రశ్నిస్తున్నారు. సామెతలు 3:27 లో "నీకు శక్తిగలదేని ఇతరులడిగిన ఉపకారమును తప్పక చేసి పెట్టుము" అని వాక్యం చెబుతుంది. దేవుడు మనలను కేవలం చూడడం మాత్రమే కాదు, ఆయన మన ఆలోచనలను కూడా పరిశీలిస్తున్నాడు. అందుచేతనే మనం కరుణకలిగి, సహాయక క్రియలు ఆనందంతో చేయాలి. "అపకారికి నుకారము నెపమెన్నక చేయుము" అని పద్యం కూడా ఉంది. ఉపకారం చేసేటప్పుడు సాయం అందుకొనే వ్యక్తియొక్క తప్పుల్ని ఎంచరాదని భావం. దీనిని క్రీస్తు ఏనాడో మనకు బోధించాడు కనుక క్రైస్తవునిగా మనం అలానే చేయాలి.

### 3.3. నక్రోధం నద్వేషం

కరుణ అంటే రెండవ అవకాశాన్ని దయ చేయటం. ఎవరైనా మనకు హాని చేసినపుడు ఆ వ్యక్తిని వదలించుకోడానికి చూస్తాం. కాని పరిశుద్ధ గ్రంథంలో ఇలా వ్రాసుంది : "వైరము, మోహము, క్రోధము అను వానిని త్యజింపుడు, అరుపులుగాని, అవమానాలుగాని ఇక ఉండరాదు. ఏవిధమైన ద్వేషభావం ఉండరాదు. దానికి బదులుగా పరస్పరం దయను, మృదుత్వమును ప్రదర్శింపుడు. క్రీస్తుద్వారా దేవుడు మిమ్ము క్షమించినట్లే ఒకరిని ఒకరు క్షమింపుడు (లూకా 6:35-36). ఇదే కుటుంబ సభ్యులకు వర్తిస్తుంది. భార్యాభర్తలు ఒకరిని ఒకరు క్షమించికోవాలి, తల్లిదండ్రులు బిడ్డలు ఒకరిని ఒకరు మన్నించుకోవాలి. అపుడే కుటుంబంలో శాంతి ఉంటుంది.

### 3.4. కరుణ మార్గం

ప్రజలను కారుణ్యంగల క్రీస్తువైపు మరల్చడానికి తననుతాను తగ్గించుకొని, కరుణగలిగి ప్రవర్తించాలి. అపుడే కరుణామయుని సుభవార్త ఇతరులకు అందుతుంది. యూదా తన లేఖలో తెలియ పరచినట్లు "కొందరు సందేహపడువారు ఉన్నారు. వారిపై దయచూపుడు. అగ్నిగుండమునుండి వెలుపలికి లాగి వారిని రక్షింపుడు" (1:22-23). జాలి చూపనియెడల వారు మననుండి దూరంగా పోవుదురు. పాపాత్ముని యెడల ఎల్లప్పుడు కరుణకలిగి ఉండాలి. ఓర్పు, సహనం వహించి, దయతో ఆశించిన మార్పును తీసుకురావాలి. పాపంవలన ఎవరిని భయాందోళనలకు గురిచేయరాదు. దేవుడు కరుణామయుడు, పశ్చాత్తాప పడిన పాపమన్నింపు గలదన్న ఆశతో జీవించాలి.

### 3.5. నిస్సహాయులకు కరున వంతెన

అనామకులు, సంఘంనుండి వెలివేయబడినవారు, నిరాధరణకు గురైనవారు, చిరునామా లేనవారు అనేకమంది సంఘంలో మనకు కనిపిస్తారు. అటువంటి వారితో స్నేహ పూర్వకంగా మాట్లాడేందుకు కరుణ చాలా ఉపయోగపడుతుంది. ప్రభువు అంటారు. "నాకు కారుణ్యము కావలయునుగాని, బలి అవసరము లేదు అను లేఖనము నందలి అర్థమును గ్రహింపుడు. నేను పాపులను పిలువ వచ్చితినిగాని, నీతిమంతులను పిలుచుటకు రాలేదు".

### 3.6. సత్సంబంధం

నియమాలకంటే సత్సంబధాలు ముఖ్యమని భావించడం కరుణ. అందుకే భక్త పౌలు అంటాడు "తోటి వానిని ప్రేమించువాడు, వానికి ఏ కీడును చేయడు. కనుక ప్రేమ కలిగి యుండుట ధర్మశాస్త్రమును నెరవేర్చుటయే" (రోమీ 13:10). మంచి క్రైస్తవుడు ప్రతీ ఒక్కరిని స్నేహపూర్వకంగా పలకరించి, వారితో సత్సంబంధం ఏర్పరచుకుంటాడు. ఎవరితోను విరోధం పెట్టుకోడు.

కాబట్టి, కుటుంబ సమేతంగా ఈ ప్రత్యేక కారుణ్య జూబిలీ సంవత్సరాన్ని కారుణ్యంతో మసలడానికి ప్రయత్నించాలి. ఈ జూబిలి సంవత్సరమేకాదు, మన జీవిత కాలమంతా దేవుని దయతో ఉండడానికి చక్కని కృషి చేయాలి. తండ్రి దేవుని కరుణను ఇతరులకు చాటిచెప్పడం అంటే సువార్తను బోధించడమే అవుతుంది. వాక్యం చెప్పడమంటే కరుణ రసాన్ని ఇతరుల మనసుల్లో నింపడమే!

## 4. కారుణ్య క్రియలు విశ్వాస సాక్ష్యానికి నిలువుటద్దాలు

కుటుంబ సభ్యులు కారుణ్య క్రియల ద్వారా ప్రభు సువార్తను ప్రకటించువారుగా తయారవ్వాలి. కారుణ్య క్రియలను తమ విశ్వాస జీవితానికి సాక్ష్యాలుగా నిలపాలి. దేవుని కరుణను ప్రేమ రూపంలో ప్రసరింప చేయాలి. పరిశుద్ధ ఫ్రాన్సిస్‌గారు కారుణ్య క్రియలు గురించి తెలిపారు. అవి 1. వ్యక్తిగత కారుణ్య క్రియలు, 2. ఆధ్యాత్మిక కారుణ్య క్రియలు ఇవి చేయడం ద్వారా మనలోని, ఇతరులలోనుగల చెడు గుణాలను తీసివేసి, కరుణాప్రేమలను చూపగలం.



### 4.1. వ్యక్తిగత కారుణ్య క్రియలు

అవసర సమయాలలో ఇతరులకు వస్తుధన రూపాలలో ఆదుకొనడాన్ని వ్యక్తిగత కారుణ్య క్రియలని మనం అర్థం చేసుకోవచ్చును. ఇతరులు అడిగినపుడు సాయం చేసే వారు మాన్యులు, అడగకనే గమనించి సాయం చేసేవారు మహానుభావులు. క్రైస్తవులు దుర్భర స్థితికి స్పందించి, ఇతరులకు సాయమందిస్తూ మహానుభావులుగా ప్రభు కరుణ పతాకాలను ఎగురవేయాలి. ఈ ఉపాంశంలో మత్తయి 25:31-46 లో గల సప్త కారుణ్య క్రియలను చూద్దాం.

#### 4.1.1. ఆకలిగొన్న వారికి ఆహారము నొసగుట

మన చుట్టూ ఎంతోమంది ఆకలితో అలమటిస్తూ కనిపిస్తారు. పొట్టకూటికోసం రోడ్డున పడతారు. కాని వారిని పట్టించుకొనే వారు లేరు. క్రైస్తవ కుటుంబ సభ్యులుగా, దేవుని ప్రతీకలుగా మనం ఆకలికి గురియైన వారియెడల కారుణ్యాన్ని చూపాలి. వారి ఆకలిని ఆరికట్టాలి. మన ఖర్చులను తగ్గించి, త్యాగం చేసికొని, మిగిలిన సొమ్ముతో ఆకలిగొన్న వారిని ఆదుకోవాలి. ఒకరి కడుపును నింపినపుడు పొందే ఆనందం మోక్షానందమౌతుంది. ఎందుకన, దేవుని కారుణ్యం అక్కడ రూపు దిద్దుకుంటుంది. మన ఇల్లల్లో ఒక్కొక్కపరి చాలా భోజనం వ్యర్థమౌతుంటుంది. అలా వ్యర్థం చేయవద్దని ప్రభువే చెప్పాడు (యోహాను 6:12)

#### 4.1.2. దప్పికగొన్న వారికి దాహం తీర్చుట

ఈ లోకంలో ఎన్నో ప్రాంతాలలో సరియైన త్రాగునీరు లేక అలమటిస్తున్న ప్రజలెందరో ఉన్నారు. మొదట నీటిని ఆదా చేయాలి. మనకు ఎక్కువ నీరుందని దిమ్మరించకూడదు. ఇంటికి నీరు నిదానం అన్నారు. కనుక నీటిని జాగ్రత్తగా వాడాలి. వ్యర్థాలను వదలి నీటిని కలుషితం చేయకూడదు. లేనవారికి నీటిని ఇవ్వాలి. నీటి విషయంలో వ్యాపార ధోరణిని మానుకోవాలి. ఈనాడు నీటిని డబ్బుపెట్టి కొనే పరిస్థితి వచ్చింది. ముఖ్యంగ వేసవిలో మంచినీరు దొరకక కటకటామని ప్రజలు బాధపడుతుంటే అవకాసాన్ని డబ్బుచేసుకోడానికి కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇతరులకు నీటి జాగ్రత్తలను తెలియపరచి, నీటిని ఆదా ఎలా చేయాలన్న పద్ధతులను నేర్పాలి. ఈ విధంగా మనం కారుణ్య కార్యక్రమలో పాలివారమౌతాం.

### 4.1.3. వస్త్రహీనులకు వస్త్రాలను ఇచ్చుట

పేదవాడు సాదా బట్టలతోనే గడిపేస్తారు. కొందరైతే సరియైన బట్టలులేక, ముఖ్యంగ శీతాకాలంలో చలిని తట్టుకొనేందుకు కావలసిన దుస్తులుగాని, దుప్పట్లుగాని లేని అధమ పరిస్థితుల్లో ఉంటారు. మరి వారికి మనం తోడ్పడవద్దా? అవసరం మించి బట్టలు మనకు ఉంటాయి. అలమరల నిండా బట్టలే! మనం వస్త్రాలయాలలో బట్టలుకొనే ముందు ఆలోచించి, మనకు నిజంగా అవసరమా అని ప్రశ్నించుకోవాలి. కొత్తవి రాగానే కనీసం పాతవి (చిరిగినవి కావు) అనాథులకు అందజేయాలి. క్రిస్మస్ సందర్భంలో ఇంటికి దగ్గరగానున్న పేదవారికి కొత్తబట్టలు తీయాలి. అపుడు కరుణను పొందుదువు. ఈ వస్త్రలేమి సిగ్గును, పాపాన్ని తెలియజేస్తుంది. దానిని మనం తీసివేయాలి.

### 4.1.4. ఆశ్రయం లేనవారికి ఆదరణ చూపుట

ఉండడానికి చిన్న ఇల్లు ఉంటేచాలు కుటుంబమంతా జీవించేస్తుంది. ధారుణ సంఘటనల వలన కొన్ని కుటుంబాలు రోడ్డున పడతాయి. నిలువ నీడలేక విలవిలలాడిపోతారు. ఒక్కొక్కపరి ఒక చిన్న ఇంట్లో రెండుమూడు కుటుంబాలుంటాయి. ఇది ఉమ్మడి కుటుంబంకాదు. గతిలేక అలా కిక్కిరిసి ఉంటారు. కొందరు ఏ చెట్టునీడనో, పెద్ద భవంతి చాటునో గడిపేస్తుంటారు. మురికి వాడల్లో కటిక పేదవారు జీవనం గడిపేస్తుంటారు. బాగా ధనవంతులైన క్రైస్తవులు తలంచుకుంటె చిన్న కుటీరం ఏర్పాటుచేయగలరు. పది మంచి కుటుంబాలు కలిస్తే ఒక పేద కుటుంబానికి ఓగూడును ఏర్పాటుచేయగలరు. ఇదే మానవత్వం, ఇదే కారుణ్యం, ఇదే పరమార్థం. "ఆకాశ పక్షులకు గూళ్ళు, నక్కలకు బొరియలు కలవు. కాని, మనుష్య కుమారునికి తల వాల్చుకొనుటకైనను తావు లేదు అని ఓ రకంగా ఆక్రందన చేసారు. అది ఆయనది కాకాపోవచ్చు. అది నిలువనీడలేని నిరుపేదలది. వారికి సాయం చేయాలి మనం.

### 4.1.5. రోగులను పరామర్శించుట

మన ప్రాణం ఎంతో విలువైనది. దానిని దక్కించుకోవడానికి ఎంతో ప్రయత్నిస్తాం. కాని జీవిత ప్రయాణంలో జబ్బు అనేది మనిషిని అతలాకుతలం



చేస్తుంది. మన ఇంటివారు, బంధువులు, తెలిసినవారు జబ్బుగాపడుంటే బహుశా వారిని పరామర్శించడానికి వెళ్తాం. మనం జబ్బుగా ఉన్నపుడు ఎవరూ రాలేదని వాపోతాం. బాగున్నన్నాళ్లు మన వెనుక తిరుగుతారు. మంచాన పడ్డాక ఎవరూ పట్టించుకోరు. స్వార్థం, మనిషి విలువను గుర్తించక, అభిమానం ఆత్మీయత చచ్చిపోవడం వలన ఈ పరామర్శించడం ఉండదు. ఇంట్లోవాళ్లు వృద్ధులవగానే వృద్ధుల ఆశ్రమంలో పడేసి చేతులు దులుపుకొనే రకాలు నేటి ప్రజలు. రోగులను దర్శించడం వలన వారి జబ్బులు సగం తగ్గుతాయి. ఊరట మాటలు వారికి మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయి. దగ్గరుండి సేవలు చేస్తే వారు తొందరగా కోలుకుంటారు. మనం చూపే ప్రేమ, కరుణ వారికి ఎనలేని బలాన్నిస్తుంది.

### 4.1.6. చెరలోనున్న వారిని దర్శించుట

మానవ సమాజంలో కారుణ్యాన్ని అలవర్చుకోక, ఎన్నో చెడు అలవాట్లుకు లోనై, ఘోరమైన తప్పులుచేసి, చట్టప్రకారం శిక్షను పొంది, కారాగారంలో చాలా మంది ఉంటే, తప్పుచేయక పోయినా తప్పుకు సాయం చేసినవారు, అమాయకంగా ఇరుక్కొని శిక్షను అనుభవించేవారు, క్షణికుద్రేకానికిగురై నేరం చేసినవారు ఉన్నారు. వీరందరూ ఏదోక కుటుంబం నుంచి వచ్చినవారే. కనుక వారిని మనం దర్శించి, మంచిగా మాట్లాడి, కరుణను చూపగిలిగితే వారు పశ్చాత్తాపపడి మారుమనసు పొందడానికి అవకాశముంది. ఇటువంటివారి జీవితాలను ఉదాహరణలుగా చెప్పి, పిల్లలు అటువంటి మార్గం లోగాక సువార్తా మార్గంలో జీవించడానికి ప్రేరేపించాలి. తిరిగివచ్చిన ఖైదీలు మానసికంగా కృంగి ఉంటారు, సంఘంలో సిగ్గుతో తలవంచుకొని ఉంటారు. వారికి ధైర్యాన్ని నూరిపోసి, తలెత్తుకొని జీవించటానికి కరుణతోకూడిన ఆధరణ చూపాలి. వారిపై చిన్నచూపు చూసేవారిని మందలించాలి.

### 4.1.7. చనిపోయిన వారిని పూడ్చుట

పుట్టిన ప్రతి ప్రాణి మరణిస్తుంది. జననమరణాలు జీవన నిత్య సత్యాలు. అలానే ప్రతి మనిషి జీవితం కూడ. అయితే మనిషి మరణం వేరు. "అది అంతిమ మెలుకువ" అని వాల్టెర్ స్కాట్ అంటాడు. క్రీస్తును నమ్మిన వారికి పరలోక జీవితం ఉంది. అయినా మరణం దు:ఖాన్ని తెస్తుంది. మిగిలిన కుటుంబ సభ్యులు వేదనలో

ఉంటారు. కాని, పార్థివ శరీరానికి భూస్థాపనం అవసరం. తదితరులు ఈ కార్యక్రమాన్ని చూడాలి, సాయం అందించాలి. నేటి భూస్థాపితం ఖర్చుతో కూడుకున్నది. అవసరమైతే ధనసాయం చేసి, ఆ అంత్యక్రియలు ప్రార్థనలతో మానవహోదాకు తగిన విధంగా నిర్వహించాలి. ఆరు దివ్య సంస్కారాలను స్వీకరించిన ఆ దేహం పవిత్రమైనది. అంతవరకు అది పవిత్రాత్మకు ఆలయంగా ఉండింది. కనుక దేహాన్ని గౌరవించి పాతిపెట్టాలి. మనిషిని పోగొట్టుకున్న సభ్యులను ఓదార్చాలి. అపుడే మనకున్న విశ్వాసం వెల్లడవుతుంది, కరుణ ప్రతిఫలిస్తుంది. ఇకపోతే, అనాథ శవాలు ఉంటాయి. వాటి సంగతికూడ మనం చూడాలి. ఎందుకంటే, ఆ దేహాలు కూడా పవిత్రమైనవే. (తోబితు గ్రంథాన్ని చదవండి) అంతేగాక, మరణించిన వారి ఆత్మలు ఉత్తరింపు పొంది, పునీతమై దైవసన్నిధి చేరాలి. అందుకోసంగా మనం వారి గురించి పూజలర్పించి, ప్రార్థనలుచేసి, కారుణ్య క్రియలను చేయాలి.

### 4.2. ఆధ్యాత్మిక కారుణ్య క్రియలు

ఇవి ప్రార్థనలతోను, ధ్యానంలతోను కూడుకున్న కారుణ్యక్రియలు. ఆధ్యాత్మిక అవసరాలను దీర్చి, మనసులను దేవునివైపు త్రిప్పాలి. పాపత్ములను, అజ్ఞానులను, సందేహించు వార్ని కలిసి, వారికి ఆధ్యాత్మికంగా సహాయంచేసి మార్గాన్ని చూపాలి. మనసు హృదయాలలోగల చీకటిని తొలగించి, అందు కరణను, వెలుగును నింపాలి. ఈ అంశాలను కతోలిక శ్రీసభ సత్యోపదేశం, సంఖ్య 2447 లో చూస్తాం.

#### 4.2.1. పాపాత్ములను మందలించుట

ఒకరు పాపంలోపడి తప్పుడు మార్గంలో పయనిస్తున్నపుడు, ఆ వ్యక్తిని మందలించి 'నీవు చేస్తున్నది తప్పు' అని చెప్పి సత్యాన్ని బోధించి, ప్రభునివైపుకు మరల్చగలగాలి. తల్లిదండ్రులు తమ పిల్లలను సన్మార్గంలో పెంచాలి. తమ నడవడిక ద్వారా ప్రభుని వాక్యాన్ని బోధిస్తూ, కారుణ్యకార్యాలను నేర్పిస్తూ వారిని, ఇతర కుటుంబ సభ్యులను నడపగలగాలి. అలాని నేను నిజాయితీ పరుడ్నని నిరూపించుకోడానికో లేక ఎదుటువారిని కించపరచడానికో చేయకూడదు. పాపం వలన దేవునికి దూరమౌతామని, ఆయనకు సన్నిధిలో ఉంటే కరుణ ప్రేమలు పొందుతామని హిత బోధచేయాలి.



#### 4.2.2. అజ్ఞానులకు బోధించుట

గురువులవలె పెద్దపెద్దప్రసంగాలు ఇవ్వనక్కరలేదు. తెలిసినంత వరకు, విశ్వాసమున్నంత వరకు అజ్ఞానులకు బోధించి, వారిని సుజ్ఞానులుగా తయారుచేయాలి. ముందుగా క్రీస్తు గురించి, ఆయన బోధలు, కారుణ్య క్రియలు (అద్భుతాలు) తెలిపి, వారిలో అనుభూతిని కల్పించాలి. వేద సత్యాలను వివరించి, వారిని గురువుల కడకు తీసుకువెళ్లాలి. ఈ విషయంలో పిల్లలకు కూడా అవకాసం ఇవ్వాలి. అందుకే పెద్దలు, "ఇంట గెలిచి రచ్చ గెలవు" అన్నారు.

#### 4.2.3. సందేహించు వారికి హితబోధ చేయుడు

ఆధ్యాత్మిక విషయాలపై, పరిశుద్ధ గ్రంథంపై, శ్రీసభ సిద్ధాంతాలపై, దేవుని ప్రేమ కరుణలపై ఎవరికైన సందేహాలు కలుగవచ్చు. అటువంటివారు విశ్వాసంలో దిగజారి, దేవునికి దూరమౌతారు. అందుచేత పట్టు విడువకూడదు. వారిని కలిసి అన్ని విషయాలను స్పష్టంగా బోధించి నచ్చజెప్పాలి. దీనికి చాలా ఓపికేగాకుండా, మత విషయాలందు మనకు కూడా పట్టు ఉండాలి. మనం అన్నీ నేర్చుకొని, ఎలా బోధించాలన్నది కూడా తెలుసుండాలి.

#### 4.2.4. దు:ఖితులను ఓదార్చుట

రాపిడి లేనిదే రత్నం ప్రకాశించదు. అలానే కష్టాలను సహించినపుడే జీవితం సార్థకం అవుతుంది (చైనా సామెత). "మన సంతోషాలలో కూడా విషాదము మిళితమై యుండును. ఆనందము తర్వాత దు:ఖము వచ్చును (సామెతలు 14:13). "కష్టసుఖాలు కావడి కుండలు" అని అంటారు. ముళ్ళుయొక్క వాడి తెలిస్తేనే ఆనందం యొక్క సుఖం తెలుస్తుంది. ఈ లెక్క తెలిసినవారు బాధలను కూడా తట్టుకుంటారు. కాని ఈ లెక్క తెలియనివారు దేవుడే బాధలను పంపించాడని, ఇది దేవుని శాపమని రకరకాలుగా వాపోతుంటారు. వారికి దేవుని మనసును, చిత్తాన్ని తెలియపరచి, జీవితంలో రాట్టు తేలేటట్లు చేయగలగాలి. వారిలో దేవునియందు నమ్మకాన్ని, విశ్వాసాన్ని దృఢపరచాలి. క్రీస్తు పడిన బాధలను గూర్చి వివరించాలి (యెషయా 3:4-5; మత్తయి 11:28). కారుణ్యాన్ని వారి హృదయాలలో నింపాలి.

### 4.2.5. ఇతరుల తప్పులను భరించుట

"కష్టేఫలి" అన్నారు పెద్దలు. అన్నీ సక్రమంగా మనం అనుకున్నట్లు జరగవు. ఎవరో ఒకరు తప్పు చేస్తారు. కుటుంబంలో కూడా ఇలానే జరుగుతుంటుంది. త్రిత్వైక దేవునికి ఉన్నట్లు అందరికి ఒకే జ్ఞానం, ఒకే బలం, ఒకే స్వభావం ఉండవు. ఒక్కొక్కరిది వేరు వేరు భావాలు. అందరివి ఒకేలా ఉండాలంటే కలసి ప్రార్థించాలి, భక్తి విశ్వాసాలు ఒకేలా ఉండాలి. ఇందుకు సమయం పడుతుంది. కనుక ఇతరుల తప్పిదాలను మన్నించి, ఓర్పుతో వేచియుండాలి. నిరాశ పడకూడదు. క్రీస్తు బాటలో నడిస్తే అన్నీ సాధ్యమౌతాయి. పౌలుని మాటలను గుర్తు పెట్టుకొండి: "మీ కన్నులను శాశ్వత బహుమానముపై ఉంచుడు, ఓపిక కలిగి జీవింపుడు, తప్పును సహించి ఎదురు తిరగక ధైర్యముతో ప్రభునికై నిలుచుండుడు".

ఈ విధంగా కుటుంబ సభ్యులు వ్యవహరించాలి. క్రీస్తునందే నమ్మక ముంచి, విశ్వాసంతో జీవించాలి. బిడ్డలకు వాటినే నేర్పాలి. ఈ శారీరక ఆధ్యాత్మిక కారుణ్య క్రియలను అలవర్చుకోవాలి. అపుడే మంచి క్రైస్తవ జీవితాన్ని నెరపగలుగుతాం.

## 5. కుటుంబ సభ్యులు ఏవిధంగా కారుణ్య జూబిలిని జరుపుకోవాలి?

ఈ జూబిలిని మేత్రాసన స్థాయిలోను, విచారణ స్థాయిలోను జరగుతుండగా కుటుంబంలో కూడా జరుపుకోవచ్చు. ప్రత్యేక ప్రార్థనలు, పవిత్ర జీవితం ద్వారా, పాపసంకీర్తనం, పుణ్య క్షేత్రాలను దర్శించుట, గృహసీమను స్వర్గసీమగా మార్చడం వంటి కార్యక్రమాలను జరుపుకోవచ్చును.

### 5.1. దివ్యకారుణ్య ప్రార్థనను జపించుట

పునీత ఫౌస్తీన కోవలొక్కగారు ప్రభుని దివ్యదర్శనం ద్వారా ఈ దివ్యకారుణ్య ప్రార్థనను ప్రారంభించారు. ఈ ప్రార్థన జపమాల రూపంలో ఉంటుంది. కుటుంబమంతా కలిసి ప్రతిరోజు ఈ ప్రార్థనను చెప్పడం ద్వారా ప్రభుని కరుణను సభ్యులంతా పొందగలుగుతారు. పాప పరిహారం నిమిత్తం ప్రభు ఎలా శ్రమలు అనుభవించారో ధ్యానించాలి. పిల్లలకు దీని విశిష్టతను తెలిపి, వారికి దీనిపై శ్రద్ధ కలుగునట్లు చేయాలి. అందరూ సాక్షులుగా నిలబడాలి.



### 5.2. పవిత్ర జీవితమే కారుణ్య జీవితం

నేటి ప్రపంచంలో క్రైస్తవ కుటుంబ జీవితం రోజురోజుకు అడుగంటి పోతుంది. అవకతవకలు చోటు చేసుకుంటున్నాయి. క్రీస్తు కారుణ్యాన్ని గుర్తించి ప్రార్థిస్తే కుటుంబాలు బాగుపడతాయి. ఈ సదుద్దేశంతోనే జగద్గురువు జూబిలి సంవత్సరాన్ని ప్రతిష్ఠించారు. ఇందులో భాగంగా కుటుంబ సభ్యులు చేయవలసిన కార్యాలు రెండున్నాయి. 1. క్రీస్తు ప్రభునితో ఎల్లప్పుడు అంటిపెట్టుకొని జీవించాలి. దేవుని వాక్యం ద్వారా ఆయనకు దగ్గరగా ఉండాలి. ప్రభువు ఇలా పలికారు : "మీరు నా మాటపై నిలిచియున్నచో నిజముగా మీరు నా శిష్యులై ఉందురు. మీరు సత్యమును గ్రహించెదరు. సత్యము మిమ్ము స్వతంత్రులను చేయును (యోహాను 8:31-32). 2. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలతో తమ బంధాన్ని నిలుపుకోవాలి. పిల్లలకు కావలసినది ప్రేమతో కూడిన క్రమశిక్షణ. వాక్యం ఇలా చెబుతుంది : తల్లిదండ్రులారా! మీ పిల్లల కోపము రేపక వారిని క్రమశిక్షణలోను, ప్రభుని బోధనలోను పెంచుడు', (ఎఫెసీ 6:4). ఇది బాధ్యత కూడాను. ద్వి.కా. 6:6-7 చూస్తే, "నేడు నేను మీకు ఉపదేశించిన ఈ ఆజ్ఞలను ఏనాడును విస్మరింపకుడు. వీనిని మీ పిల్లలకు బోధింపుడు మీరు ఇంటనున్నను బయటనున్నను, శ్రమించుచున్నను విశ్రాంతి తీసుకొనుచున్నను వీనిని గూర్చి ముచ్చటింపుడు". అని తల్లిదండ్రుల బాధ్యతను గుర్తు చేస్తుంది. సామెతలు 22:6లో బాలుని తాను నడవవలసిన మార్గమునుగూర్చి బోధించినచో పెద్దవాడైన పిదపగూడ ఆ త్రోవను విడనాడడు. 3. తల్లిదండ్రులు పిల్లల మధ్య ఉండవలసిన బంధం ఎంతో ముఖ్యమైనది. పిల్లలకు రెండు ముఖ్య బాధ్యతలు ఉన్నాయి. తల్లిదండ్రులకు విధేయులై ఉండడం, వారిని గౌరవించడం (ఎఫెసీ 6:1-2). పౌలు ఈ విధంగ తెలియపరుస్తున్నాడు : "బిడ్డలారా, మీరు మీ తల్లిదండ్రులకు అన్ని విషయములలోను విధేయులగుడు. ఇందువలన దేవుని దృష్టిలో మరియు క్రైస్తవుల మధ్య ప్రీతి పాత్రులగుదురు" (కొలొస్సీ 3:20). మరలా దేవుని వాక్యం ఇలా అంటుంది: "తల్లిదండ్రులను గౌరవించుము" (నిర్గమ 20:12). 4. క్రైస్తవ కుటుంబం పవిత్రంగ ఉండాలంటే మూడు కారుణ్య క్రియలను చేపట్టాలి. అవి ప్రార్థన, విశ్వాసం, ఆనందం. ప్రార్థనద్వారా వినయాన్ని నేర్చుకుంటాం. ప్రార్థనలో కుటుంబానికి కావలసినది - ప్రభుని సహాయం, ఆయన శక్తి, ఆశీస్సులు, కారుణ్యం, క్షమాపణ. ప్రార్థన మనకు

సాధుత్వాన్ని నేర్పి, శక్తిని ఇస్తుంది. భర్త భార్యకోసం, భార్య భర్తకోసం, తల్లిదండ్రులు తమ పిల్లలకోసం, పిల్లలు తమ తల్లిదండ్రులకోసం ప్రార్థించాలి. దైనందిన జీవితంలో కుటుంబ సభ్యులు విశ్వాసం కనబరచి, ఒక ప్రేషిత కుటుంబంగా తయారుకావాలి. ఆనందమనేది ప్రార్థన విశ్వాసాల కలయిక. ఈ ఆనందం వలన కుటుంబంలో శాంతి సమాధానాలు ఉంటాయి. అపుడు కుటుంబాన్ని ప్రేమ గట్టిపరుస్తుంది. 5. తల్లిదండ్రులు పిల్లలను శ్రీసభ సిద్ధాంతాల ప్రకారం నడిపించాలి. సత్యోపదేశం, దివ్యబలిపూజ, దివ్యసంస్కారాలు, ప్రేమకారుణ్యాల గురించి వారికి బోధించాలి. దేవుని వాక్యంను వినిపించి, దాని ప్రకారం నడిపించాలి. ప్రార్థన చేయడం, ధ్యానించడం నేర్పి, విశ్వాసంలో జీవింపజేయాలి. కుటుంబ సభ్యుల మధ్య కారుణ్యం ఉండాలి.

### 5.3. సమాధానకరణ సంస్కారంను కొనియాడుట

దీనిని ప్రతీ కుటుంబసభ్యుడు తన జీవితంలో జరుపుకోవాలి. ఎందుకంటే, జీవితంలో ఎన్నో పాపాలను మూడగుట్టుకొని, పశ్చాత్తాపడకుండా జీవించావు. దివ్యపూజలో కూడా సరిగా పాల్గొనియుండవు. తద్వారా హృదయంలో గాయాలను పెంచుకున్నావేగాని, నయం చేసుకోలేదు. ఇటువంటి సమయంలో దైవకారుణ్యం ఎంతైనా అవసరం. ఏదైనా మంచికార్యం చేసినపుడు సంతోషిస్తాం. ఆత్మతృప్తి పొందుతాం. పాడుపని చేసినపుడు మనలోని అంతరాత్మ మనం తప్పుచేసామని చెబుతుంది. చేసిన తప్పును తెలిసికొని, దు:ఖించి, ఇకముందు అలాంటి తప్పును చేయనని మారుమనసు పొందడమే పశ్చాత్తాపం. తద్వారా నూతన జీవితాన్ని ప్రారంభిస్తాం. సామెతలు 28:13లో చెప్పినట్లు, "తమ పాపములను కప్పిపెట్టుకొనువాడు బాగుపడడు. ఆ పాపములను ఒప్పుకొని వానిని పరిత్యజించువాడు దేవుని దయను పొందును". కాబట్టి కనీసం నెలకొకసారి పాపసంకీర్తనము చేసుకోవాలి. దేవుడు ఎప్పుడూ క్షమాపూరితుడు, దయాళువు. తన కరుణను అమితంగా చూపుతాడు. మనస్పర్థలు ఏర్పడినపుడు వాటిని సరిదిద్దుకొని, సమాధానపడాలి. ఈ విధంగా ఈ కారుణ్యకార్యాన్ని చేసినట్లయితే దేవుని క్షమను, కరుణను పొందగలం.



### 5.4. తీర్థయాత్రకు వెళ్ళుట

క్రైస్తవ జీవితంలో తీర్థయాత్ర ఓ ముఖ్యమైన భాగం. ఎందుకంటే, ఇది జీవిత యాత్రకు ఒక నమూనా మనందరం యాత్రకులం. ప్రయాణంచేసి, చేరుకోవలసిన గమ్యానికి చేరుకోవడం ముఖ్యమని సూచిస్తుంది. ఈ స్థలాలను దర్శించినపుడు, ముఖ్యంగ పవిత్ర భూమిని (యిస్రాయేలు ప్రాంతం) తాకినపుడు ప్రభుని కారుణ్యమనే ఉనికిలోకి ప్రవేశించి, ఆయన కారుణ్యాన్ని పొందుతాం. కాబట్టి కుటుంబ సమేతంగా తీర్థయాత్రలకు వెళ్ళడానికి ప్రయత్నించాలి, ప్రభుని కారుణ్యం పొందాలి.

### 5.5. ఇంటిద్వారాలను పవిత్రమైన కారుణ్య ద్వారాలుగా చేయుడు

పునీత పేతురు బృహద్దేవాలయంలో పవిత్రకారుణ్య ద్వారాన్ని తెరచినట్లుగా, ప్రతీ మేత్రాసనంలో ముఖ్య దేవాలయాల పవిత్ర కారుణ్య ద్వారాలుగా చేయమని ఫ్రాన్సిస్ జగద్గురువులు తెలియజేస్తారు. ఈ ద్వారం క్రీస్తుకు గుర్తు. ఎందుకంటే, క్రీస్తే పరలోక జీవితానికి ఏకైక ద్వారం (యోహాను 10:9). ఆయనే శ్రీసభకు ద్వారం. ఇది ప్రజలందరికి, ముఖ్యంగా వెలిలో ఉన్నవారు లోనికి ప్రవేశించుటకు తెరవబడి ఉంటుంది. అలానే ప్రతీ కుటుంబం తమ ఇంటిని కారుణ్యద్వారంగా తయారుచేసుకోవాలి. గృహమందు ఆరోజున ప్రార్థనా కూటమిని నిర్వహించి, కలసి ప్రార్థించి, ప్రభుని నిరంతర కారుణ్యాన్ని అందరకు తెలియజేయాలి. తద్వారా ప్రభుని కారుణ్యాన్ని పొందుతాడు. ఎల్లప్పుడు సాక్షులుగా జీవించగలుగుతారు.

### ముగింపు

ప్రత్యేకమైన కారుణ్య జూబిలీ సంవత్సరం కుటుంబాలకు ఎంతో ముఖ్యమైన వత్సరం. ఎందుకన, కుటుంబాలలో కారుణ్యమనే సుగుణం అలవర్చుకోవడం ద్వారా ఇతరులకు, తమ కుటుంబీకులకు సాక్షులుగా తయారవుతున్నాం. ఈ కారుణ్యం అనే గొప్ప వరం ఈ సంవత్సరంతో అయిపోయేదికాదు. దానిని మన జీవితాలలో ఒక భాగంగా చేసుకోడానికి ఇది ఒక సదవకాశం. కుటుంబంలో ప్రార్థన, దైవభక్తి ఉన్నపుడు కుటుంబం దేవాలయం అవుతుంది. జీవిత పాఠాలు నేర్చుకున్నపుడు కుటుంబం పాఠశాల అవుతుంది. శాంతి సమాధానాలు ఉన్నపుడు కుటుంబం ఉ

ద్యానవనం అవుతుంది. వ్యాధిబాధలలో పరామర్శించినపుడు మంచి ఆసుపత్రి అవుతుంది. అందరు కలసిమెలసి ఉన్నపుడు చిన్న సంఘం అవుతుంది. కుటుంబంలో కారుణ్యం ఉన్నపుడు ప్రభుని కారుణ్యం అందరికి దక్కుతుంది. కడరాతీర్పునందు ప్రభువు మనలను ఈ కారుణ్య క్రియలనుబట్టే మోక్షరాజ్యం ఉంటుంది. కాబట్టి ప్రభుని కరుణను కుటుంబ సభ్యులమంతా అలవర్చుకొని, కారుణ్య సంవత్సరం చేసుకొని, ప్రభుని కారుణ్య పరలోక జీవితాన్ని పొందుదాం.

❊ ❊ ❊ ❊

# 6. పరిశుద్ధ గ్రంథములో కుటుంబ ప్రాధాన్యత

– బ్రదర్ మున్నంగి క్రాంతి కుమార్

**అవతరణిక**

కుటుంబ జీవితం జ్ఞానవివాహం ద్వారా మొదలవుతుంది. దీనికిగల ముఖ్య లక్షణం వధువరులు అంగీకార భావంతో భార్యాభర్తలుగా మారి, ఒకరినొకరు అర్థం చేసుకొని, ప్రేమతో ఏకశరీరులై, దేవుడు సృష్టించిన మానవజాతిని దేవుని సంకల్పానుసారం కొనసాగించడం.

ఈనాటి సమాజంలో కుటుంబాలు ఉండేతీరును చూస్తే వాటికి ఉండవలసిన ప్రాధాన్యతను కోల్పోయినట్లు కనిపిస్తాయి. ఎందుకంటే, కుటుంబ జీవితాన్ని విడాకుల ద్వారా రద్దుచేయడం, ఎవరి ఇష్టానుసారం వారు తమ బాధ్యతల్నీ మరచి, పిల్లలను గాలికివదలి, జీవించడాన్ని స్వేచ్ఛగా భావించే వారెందరో ఉన్నారు. వీటికి రుజువు – చెత్తకుండీల వద్ద వదలివేయబడ్డ చిన్నారులనెందరినో మనం వార్తాపత్రికల్లోనూ, టీవీ ప్రసారాల్లో వింటున్నాం, చూస్తున్నాం.

పరిశుద్ధ గ్రంథంలో కుటుంబ జీవితమనేది దేవుని యొక్క సంకల్పం వలన స్థాపనం జరిగింది. (ఆది. 2:21-23). భూమిపై నెరవేరిన దేవుని ఉద్దేశాలు, ప్రణాళికలందు కుటుంబం యొక్క పాత్ర ఎంతో ఘనమైనది. అందుకే బైబిలు వాక్యం చెబుతుంది. "వివాహము అందరిచేతను గౌరవింపబడవలెను" (హెబ్రీ 13:4). ముందుగా తెలిపినట్లు వివాహం కుటుంబ జీవితానికి తొలిమెట్టు. వివాహంలో స్త్రీ (వధువు), పురుషుడు (వరుడు) కష్టములోను, సుఖములోను, వ్యాధిలోను, బాధలోను ఒకరినొకరు విడనాడక ఐక్యమత్యంతో, అన్యోన్యంగా జీవిస్తామని ప్రభువు సన్నిదానంలో ప్రభువు పేరిట గురువుల యెదుట, సంఘం యెదుట ప్రమాణం చేస్తారు.

దేవుడు మానవులను స్త్రీపురుషులనుగా సృష్టించెను. వారిని ఒకరినొకరు బహూకృతులుగా సృజించారు. అయితే స్త్రీ పురుషులు ఎలా ఉండాలి? ఎలా

జీవించాలనే విషయాలను పరిశుద్ధ గ్రంథపఠనాల ఆధారంగా తెలుసుకుందాం. అదే విధంగా స్త్రీ పురుషులకు గ్రంథంలోగల ప్రాముఖ్యతను గురించి కూడా తెలుసుకుందాం.

## 1. మానవుడు

దేవుడు తన రూపంలో మనిషిని సృజించాడని ఆది. 1:26 తెలియపరుస్తుంది. సృష్టిలోని ప్రతి వస్తువును, ప్రతి జీవిని దేవుడు తన వాక్కు ద్వారా తయారుచేసాడు. కాని మానవున్ని చేసేటపుడు ఆయన ప్రత్యేకమైన శ్రద్ధతో, ప్రేమతో చేసి, తన శ్వాశను ఊది, జీవం పోశాడు. కనుకనే ఈ సృష్టిలో మానవుడు శ్రేష్టుడు. మనిషి ఒక్కడే నిటారుగా భుమిపై నడవగలిగిన మనిషికి మాత్రమే దేవుడు ఆదాం, అవ్వలని పేరు  పెట్టాడు. ఆదాంనుండి అతనిని పోలినట్లు అతని భాగస్వామిని (భార్యను) చేశాడు. ఈ గొప్పదనం ఏ జీవికి లేదు. అంతేగాక , దేవుడు తాను మాట్లాడేదానిని అర్ధంచేసుకొని, తిరిగి బదులు చెప్పే తత్వాన్ని సర్వసృష్టిలో కేవలం మానవులకు మాత్రమే ఇచ్చాడు (ఆది. 3:9–10). సామెతలలో చెప్పినట్లు (20:27), దేవుడు మనలోని అంతరంగంను చూస్తాడు. ఈ అంతరంగం మనం ఏమి చేయాలనో, ఏది చేయకూడదో (తప్పొప్పులను) తెలియజేస్తుంది. ఏ కార్యానికైనా అంతరంగం మంచిచెడులను నిర్ణయిస్తుంది.

తండ్రి దేవుడు తన నిత్యమైన ప్రేమ వలన ప్రతి మనిషి తన ప్రార్ధనల ద్వారా అడిగినవి పొందారని పరిశుద్ధ గ్రంథం తెలుపుతుంది. 1 రాజు. 17:17–24లో ఏలియా ప్రవక్త విధవరాలి కుమారుడు చనిపోయినపుడు, ఆమె విజ్ఞప్తిమేరకు, ఆ బిడ్డను పైగదిలోనికి తీసుకెళ్ళి, మూడుసార్లు బోరిగిలపడి దేవున్ని వేడుకొనగా ఆ పుత్రుడు బ్రతికాడు. అ.కా. 3:2–10 లో దేవాలయ ద్వారంవద్దగల పుట్టికతో కుంటివాడిని పేతురు యేసుక్రీస్తు నామంన స్వస్థపరచాడు. ఇలా ఎన్నో అద్భుతమైన సుగునాలతో మానవున్ని దేవుడు సృజించి, సృష్టిపై అధికారాన్ని ప్రసాదించాడు.

## 2. స్త్రీలు

దేవుడు చేసిన సృష్టిలో కడగా నరునినుండి నారిని చేసెనని ఆది. 2:21–22 లో వాక్యం తెలియజేస్తుంది. అవ్వ ఆదాములే మన తల్లిదండ్రులు, సృష్టింపబడిన ఈ స్త్రీ వరునికి చక్కని తోడుగా, తగిన బహూకృతిగా దేవుడు చేసెనని ఆది. 2:18 వ్యక్తపరుస్తుంది.



స్త్రీలు తమ సహజసిద్ధమైన శరీరం వలన పురుషునికన్నా తక్కువ దృఢత్వం కలిగి, శాంతానికి మృధుత్వానికి, మర్యాదకు ప్రతీకలని ప్రకృతి తెలియజేస్తుంది. ఇదే విషయాన్ని 1పేతురు 3:7 లో స్త్రీలు "జీవము అను కృపావరములో మీతో (భర్త) పాలివారై ఉన్నారని ఎరిగి సగౌరవముగను ఉదారముగను వారితో జీవింపుడు" అని హెచ్చరిస్తున్నాడు. ఆచార సంప్రదాయాల ప్రకారం కూడా స్త్రీలకు ప్రత్యేకమైన స్థావర నివాసం కలదని గ్రంథం చెబుతుంది. ఆది. 24:67లో ఈసాకు, భార్యయగు రిబ్కాను తన గుడారమునకు తీసుకొనిపోయి, ఆమెను కాలు క్రింద పెట్టనీయక చూచకొనెను. ఆది. 31:33 లో లేయాకు, రాహేలుకు, ఇతర దాసీ స్త్రీలకు ప్రత్యేకమైన గుడారాలు కలవని గ్రంథం తెలియజేస్తుంది. వారు పనిపాటులలో (నిర్గమ 35:25–26) భక్తికార్యాలలో (నిర్గమ 15:20–21) పురుషులతో సమానంగా కలిసి పాల్గొనేవారని పూర్వనిబంధన తెలుపుతుంది.

పరిశుద్ధ గ్రంథం స్త్రీలకు ఎంతో ప్రాముఖ్యతను ఇచ్చింది. సారా రెబెక్కాల వంటి పతివ్రతలు మొదలుకొని వేశ్యమైన రాహాబు వరకు; ఎస్తేరు వైభవం నుండి నామానుకు సాక్ష్యమిచ్చిన చిన్నది వరకు; నిస్వార్ధరాలైన రూతునుండి స్వార్ధపరురాలైన అతల్యా వరకు; బైబిలు స్త్రీలు తమ జీవితాలద్వారా మేలును గాని, కీడునుగాని తమ చుట్టుప్రక్కల ఉన్నవారికి కలిగించారు. అదేవిధంగా నేడుకూడ స్త్రీలు తమ చుట్టూ ఉన్నవారిని ప్రభావితులను చేస్తున్నారు. తమ భర్తలనే కావచ్చును, తమ పిల్లలు, స్నేహితులు, పొరుగు వారు కావచ్చును. స్త్రీలు మంచి నియమాలను ప్రబోధించి దేవునిపట్ల లోతైన ప్రేమను, తమ పిల్లలపట్ల, ఇతరులపట్ల సద్భావంగల హన్నాను పోలియుండవచ్చును, (కీర్తన 109:14). మనం పరిశుద్ధ గ్రంథంలోని స్త్రీల గురించి ద్యానించినపుడు వారి తత్వాలను గ్రహించి, నిత్యత్వమందు స్త్రీలకొరకు దేవునికిగల ప్రణాళికను మనం అర్ధంచేసుకుంటాం. నేటి స్త్రీలుకూడా తమకోసమై ఉన్న ప్రణాళికను ప్రార్ధన ద్వారా తెలుసుకోవాలి.

## 3. స్త్రీపురుషులగు భార్యభర్తలు – పరిశుద్ధ గ్రంథం

యూదుల ఆచారం ప్రకారం ఒక వ్యక్తి స్త్రీకి తగిన విలువను చెల్లించి, ఆమెను తన భార్యగా స్వీకరిస్తాడు. మరియమ్మకు యోసేపుతో ప్రదానం జరిగినపుడు (మత్తయి 1:18), యోసేపుకూడా మిష్నా ప్రకారం ఒక రాగి నాణెం (పెరుతాహ్) చెల్లించి, మరియ తనకు పెరుతాహ్ కన్నా విలువైనదని తెలుపటానికి అప్పటివరకు

దాచిన సొమ్మును శుల్కంగా ఇచ్చినట్లు చెబుతారు. ప్రదానం లేక వివాహ నిశ్చితార్థం జరిగిన కొన్ని దినాలకు బంధుమిత్రులతో యూదుల ఆచారం ప్రకారం బహిరంగంగా వివాహం జరుగుతుంది.

వివాహం అనేది దేవుని సంకల్పం. స్త్రీ పురుషుని ప్రక్కటెముక నుండి చేయబడింది. కనుక భార్య భర్తలు సరిసమానులు అనే అర్థం గోచరిస్తుంది. వివాహం అనే పవిత్ర సంస్కారం జరిగినప్పటినుండి ఏడాది వరకు పురుషుని ఎటువంటి యుద్ధాలకు, కఠినమైన పనులకు పిలువక, భార్యభర్తలు అన్యోన్యంగా, సంతోషంగా ఇంటిపట్టునే ఉండనిమ్మని ద్వితీయో 24:5 తెలియజేస్తుంది.

సృష్టి సహజ సిద్ధంగా పరిపూర్ణ ఆరోగ్యవంతులైవారు వివాహం చేసుకోవాలి. ఏదిఏమైనప్పటికి, మూడు రకాల వ్యక్తులు చేసుకోటానికి అనర్హులుగా సమాజం పరిగణిస్తుంది. వారు ఎవరన : పుట్టుకతోను, పరులచే చేయబడిన, తమకుతాముగా అయిన నపుంసకులు వివాహం చేసికొనరు, (మత్తయి 19:12). పౌలు వివాహం గురించి ఈ విధంగా తెలుపుతున్నాడు : ప్రతొక్కరు వివాహం చేసుకొని, స్వంత భార్యను లేక భర్తను కలిగుండవలెను. ఒకరినొకరు విడనాడరాదు. వ్యభిచారంన పడకుండా వివాహం చేసికొనుటయే మేలు. దేవుని కృపాశక్తి వలన అవైవాహిక స్థితిలో జీవించగలరు, (1 కొరింతీ 7:1,2,9). స్త్రీ పురుషులు ఎఫేసు. 5:22-24 వాక్యాలను అపార్థం చేసుకుంటారు. నిజానికి అధికారం అనే పదంలో ప్రేమ దాగివుంది. ప్రేమ ఉంటేనే అధికారం ఉంటుంది. ఈ భావనతో వాక్యాలను బాగా అర్థం చేసుకోవచ్చును. ఇదే భావంతో పేతురు కూడ వ్యక్తపరుస్తున్నాడు. (లేక 3:1, 2, 5-6). కాకుంటే, ఇక్కడ పేతురు విశ్వాసాన్ని బలపరచాడు. ప్రేమ విశ్వాసాలు మిళితమైన అధికారం గురించే ఎస్తేరు 3:22; ఆది. 3:16 వాక్యాలలో అర్థాన్ని గ్రహించాలి. అందుకే పౌలు అంటాడు: భర్తలు తమ భార్యలను ప్రేమించాలిగాని కఠినంగా ఉండరాదు. ఏ భర్త తన భార్యను ప్రేమిస్తాడో, అతడు తననుతాను ప్రేమించుకొన్నట్లే, (కొలస్సీ 3:19; ఎఫెసీ 5:28). సామెతలు 5:15-20లో నీవు పెండ్లాడిన భార్యతో సంతోషంగా జీవింపుము, ఎల్లవేళల ఆమె ప్రేమానురాగాలతో ఆనందింపుము. ఇతర స్త్రీలయందు ఆనందంను వెదకి, పాపములకు పూనుకొనవద్దని హెచ్చరిస్తుంది.

భర్తగాని, భార్యగాని ఏ ఒక్కరు విడాకులు తీసుకొనరాదు. క్రీస్తుప్రభువు మత్తయి 19:5-7 లో భర్త తన తల్లిదండ్రులను విడనాడి, భార్యను హత్తుకొని,



ఏకశరీరులై జీవించును. కనుక, దేవుడు జతపరచిన దానిని మానవుడు వేరుపరపరాదని దైవాజ్ఞను ఇస్తున్నాడు. మార్కు 10:6, 11-12 లో ప్రభు తన భాగస్వామిని పరిత్యజించి, వేరొక భాగస్వామినిని వివాహమాడువారు వ్యభిచరించుచున్నారని హెచ్చరించు చున్నాడు. హెబ్రీ 13:4లో ఇలా ఉంది: “వివాహము అందరిచేతను గౌరవింప బడవలెను. వివాహబంధము నిష్కల్మషమైనదిగా ఉండవలెను. ఏలయన, అవినీతిపరులును, వ్యభిచారులును దేవుని తీర్పునకు గురియగుదురు”. మలాకీ 2:14-16లో భర్తలారా! మీరు పెండ్లాడిన భార్యకు ద్రోహము చేసిన, మీరు ఆమె పట్ల విశ్వసనీయత కలిగి జీవిస్తానని దేవునియెదుట నీవు నీభార్యకిచ్చిన మాటను నిలబెట్టుకొనమని ప్రభువు గద్దిస్తున్నాడు. అంతేగాక, యిస్రాయేలు దేవుడవైన నేను విడాకులను అసహ్యించుకొందును, మీరు మీ భార్యలపట్ల క్రూరంగా ప్రవర్తించుట నేను సహింపజాలను అని సాక్షాత్తు దేవుడే హెచ్చరిస్తున్నాడు.

వివాహబంధంలో విభిన్న వ్యక్తిత్వాలుగల స్త్రీపురుషులుంటారు. వీరిరువురు కలిసి జీవించడం ఊహించినంత సులువుకాదు. ఎందుకంటె వారి ఆలోచనలు, కోరికలు, పనులు ఒకరికొకరికి పొంతన కుదరకపోవచ్చు. ఈ చిక్కులను, మనస్పర్థలను తొలగించి ఏక మనస్కులై కుటుంబ జీవితాన్ని గరపాలి. భిన్న అభిప్రాయాలు వచ్చినపుడు ఎవరో ఒకరు తగ్గాలి. మంచి ఆలోచన ఎవరిదో ఆ ఆలోచనకే ఇద్దరు తలవంచాలి. ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించడం ఉత్తమం. ఒక్కొక్కపరి కుటుంబాన్ని కాపాడటంలో సొంత నిర్ణయం కూడా పనికోస్తుంది. ఉదాహరణకు: నాబాలు భార్య అభిగాయిలు దావీదుని కలిసి, శరణువేడిన తీరు ప్రశంసనీయం, (1 సమూ 25:14-35). ఆమె భక్తిపరురాలు గనుక ఆ పని చేయగలిగి, కుటుంబాన్ని కాపాడింది.

గుణవంతురాలైన స్త్రీ దైవభయం కలిగుంటుంది. ఆమె భర్తకు సాటియైన సాయంచేస్తు, నీతినియమాలతో స్థిరనిశ్చత కలిగుంటుంది. సామెతలు 31:10లో యోగ్యురాలైన గృహిణి పగడముల కంటెను విలువైనదని బోధన. ఈ 31వ అధ్యాయంలో ఆదర్శ గృహిణి గురించి 10 నుండి 31 వాక్యాలు మధురంగా స్త్రీని కీర్తిస్తాయి.

తన సృష్టికర్తముందు పురుషుడు నిర్దోషిగాను, పవిత్రుడుగాను నిలువవలెనని యోబు (4:17) హెచ్చరిస్తున్నాడు. యావత్తు సృష్టిలో అతడు ఏమీకాడు, అయినా ప్రభువు అతనిని గుర్తించాడు (కీర్తన 144:3). కనుక, పురుషుడు ప్రభువుయెడల

విశ్వాసం కలిగుండాలి. "నరుని నడిపంచువాడు ప్రభువే, కానిచో మనుజునికి త్రోవ యెట్లు తెలియును?" అని సామెతలు 20:24 ప్రశ్నిస్తుంది. నరుడు ప్రభుని మాట ఆలకించి, తన కుటుంబాన్ని దైవమార్గంలో నడిపించాలి. చిన్నపిల్లలు తల్లి దండ్రులపట్ల ఏవిధంగా ప్రవర్తించాలో సీరా. 3:1-16 వచనాలు తెలియపరస్తాయి.

**ముగింపు**

క్రైస్తవ సంఘం యావత్తు క్రీస్తుకు పెండ్లికుమార్తె లాంటిది. క్రీస్తురాజు పెండ్లికుమారుడు, అతని వధువు క్రైస్తవ జనాంగం. ఆది నూతన యెరూషలేంతో పోల్చారు. కనుక, క్రైస్తవులు దర్శనగ్రంథంలో చెప్పినట్లు నూతన యెరూషలేంలా తన భర్తను (క్రీస్తును) చేరబోవుటకు వస్త్రధారణ చేసికొని సిద్ధపడిన యువతి (వధువు) వలె ఉండాలి, జీవించాలి (21:2). క్రీస్తు రెండవ రాకడంలో ఒక వివాహం జరగనున్నది. అదే గొర్రెపిల్ల వివాహ మహోత్సవం. సిద్ధపడినవారే ఈ వివాహ మహోత్సవంలో వధువువలె ప్రవేశింప అర్హులు. ఈ భూలోకంలో జరిగే వధూవరుల జ్ఞానవివాహం ప్రభువైన యేసుక్రీస్తుతో నిత్యమైన బంధమగు పరలోక వివాహంనకు సూచనగా ఉంది. మొదటి ఆదాంకు అవ్వ అవసరమయ్యెను, అలానే మలి ఆదామైన క్రీస్తును క్రైస్తవ సంఘమే పెండ్లి కుమార్తె. అయితే, ఈ సంఘం లేక కుటుంబం సంపూర్ణతను కలిగుండాలి. (ఎఫెసీ 1:23). భార్య అయిన స్త్రీలు పరిశుద్ధ గ్రంథ మందలి సారా మొదలుకొని పునీత మరియవలె మసలుకోవాలి. అదే విధంగా పురుషులు అబ్రహాం మొదలుకొని పునీత యోసేపులా ఆదర్శంగా జీవించి, కుటుంబ సభ్యులను విశ్వాసంలో నడిపించాలి.

❊ ❊ ❊ ❊

# 7. శ్రీసభ అధికార పత్రాల బోధన - విద్యాబుద్ధులను గరపుటలో కటుంబ పాత్ర

- బ్రదర్ మల్లవరపు శరత్‌బాబు

**ఉపోద్ఘాతం**

దాంపత్య జీవితంలో సంతానం దేవుడిచ్చు ఒక అపురూపవరం (ఆది 4/1; న్యాయా 13/2-5) పిల్లలంటే అందరికీ యిష్టం వారు చేసే చిలిపి చేష్టలు, తల్లిదండ్రులకు వ్యాత్సల్యపూరితంగా ఉంటాయి. ఎందుకంటే వారి సంతానం ద్వారా వంశాన్ని అభివృద్ధిపరుచుకుంటారు పూర్వాకాలంలో సంతానం లేని కుటుంబాన్ని దేవుడు శాపానికి గుర అయిన కుటుంబంగా పరిగణించేవారు. దేవుడిచ్చు ఈ సంతానంను భార్యాభర్తలు వారిని బాల్యం నుండే మంచి విలువలతో పెంచాలి ఎందుకంటే మొక్కై వంగనిది మ్రానై వంగునా" అన్నట్లుగా బాల్యంనుండే మంచి మానవతా విలువలతో, ఆర్చిదిద్దుతామో, దానిపైనే వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది పిల్లలు ప్రయోజకులు కావాలన్నా, వారి యొక్క గౌరవాన్ని నిలబెట్టాలన్నా పసిప్రాయంలోనే వారికి మంచి అలవాట్లు నేర్పుతూ, జ్ఞానవికాశం కలిగిన వ్యక్తులుగా తయారు చేయాలి.

పుట్టుకతోనే ప్రతిఒక్కరూ తమ తల్లిదండ్రుల స్వభావ, సంస్కారాలను వెంట బెట్టుకొనివస్తారు. లౌకిక జీవనం లో పిల్లల మనసుల్లో సరైన సంస్కారాలు, మానవతా విలువలు అందించడం తల్లిదండ్రుల బాధ్యత. ఎందుకంటే చిన్నతనం నుంచే ఏర్పడిన లక్షలాది అనుభవాలు వీరిలో ఉంటాయి. ఏ సంఘటన అనభవం అయిన వారి మనసులో ఒక అభిప్రాయాన్ని మిగిలిస్తుంది దాని ద్వారా మనసులో విషయంపై ఇష్టం (పాజిటివ్ అభిప్రాయం) లేద ద్వేషం (నేగిటివ్ అభిప్రాయం) ఏర్పడుతుంది.

దాని ప్రభావం వారి రాబోయే జీవితంపై ఉంటుంది పిల్లలను ఎక్కువగా ప్రభావితం చేసేది ఆదర్శవంతమైన అంశాలు కాబట్టి తల్లిదండ్రులు పెద్దలు వారి జీవిత ఆదర్శం ద్వారా పిల్లలకు జీవిత పాఠాలను నేర్పాలి.

రకరకాల మనుషులు, మనసులు, ఆలోచనలు, అభిప్రాయాలు, కోరికలు, ధర్మాలు ఇలా ఎన్నో విధాలుగా ఉంటాయి. పిలల్లను తల్లిదండ్రులే సరైన మాటలతో, విద్యతో మంచి మార్గంలోకి నడిపించాలి. ఓసారి గ్రీక తాత్వికుడు అరిస్టాటిల్ దగ్గరికి ఒక తల్లి తన కొడుకును తీసుకు వచ్చి, ఎంత వయసులో బాబుకి క్రమశిక్షణ నేర్పాలి అని అడిగిందట అప్పుడు అరిస్టాటిల్, ఈ బాబు వయస్సెంత అని అడిగారట ఆ తల్లి ఐదు అని సమాధానం ఇచ్చింది అప్పుడు అరిస్టాటిట్, యిప్పటికే ఐదు సం॥రాలు ఆలస్యమయింది అని అన్నారట అనగా క్రమ శిక్షణ, విద్యాబుద్ధుల అనేది పుట్టుక నుండే నేర్పించాలి అప్పుడే వారు సరైనతీరులో ఉంటారు అందుకే మన తల్లి అయిన కతోలిక శ్రీసభ అనేక విశ్వలెఖలు, అధికార పత్రాల ద్వారా తల్లిదండ్రులు కుటుంబంలో పిల్లలను ఏవిధంగా పెంచాలి మెలగాలి అన్నవిషయాల గురించి పదే పదే బోధిస్తూ గుర్తు చేస్తూ ఉంది. ఎందుకంటే నేటిపిల్లలే రేపటి పౌరులు తల్లిదద్రుల జీవితం సరిగా లేకపోతే పిల్లల్ని సరైన దారిలో పెట్టడం కష్టం.

ప్రపంచ ప్రఖ్యాత శ్రీలంక క్రికెట్ బౌలర్ ముత్తయ్య మురళీదరన్‌ని ఒక పాత్రికేయుడు అడిగాడు, “ఆటలో వెస్టిండీస్ ఆటగాడు క్రిస్‌గెల్ పెంకిగా ప్రవర్తించడం మీద మీ అభిప్రాయమేమిటి? అని, సమాధానంగా తల్లిదండ్రుల పెంపకం సరిగా లేకపోవడం కారణ తనకంటే పెద్దవారయిన సీనియర్స్ అతన్ని సరిదిద్దక పోవడం అని సమాధానమిచ్చారట.

ఇది నిజమేననిపిస్తుంది తల్లిదండ్రులు పెద్దలు–పిల్లలను సరైనసమయంలో సరిదిద్దకపోతే, తరువాత సరిదిద్దలేము.

తల్లి అయిన కతోలిక శ్రీసభ అధికార పత్రాలద్వారా వివిధమయిన విషయాలను తెలియజేస్తుందో చూద్దాం.

### ప్రస్తుత కాలంలో కతోలిక శ్రీసభ సత్యోపదేశం

ఈ అధికార పత్రంలో సంఖ్య. 68లో కుటుంబానికి ఆధ్యాత్మికతను పెంపొందించే ఒక ప్రత్యేకమైన లక్షణం ఉంది. ఈ లక్షణాన్ని ఎవరూ కూడా



తీసివేయలేరు. ఈ లక్షణాన్ని ముఖ్యంగా రెండవ వాటికన్ మహాసభలు గుర్తించి, అప్పటినుండి మన తిరుసభ దీనిని పెంపొందింప చేస్తుంది. కుటుంబ సభ్యులంతా కలసి ఒకరిని ఒకరు అర్థం చేసుకుంటూ, సహాయం చేసుకుంటూ, వారి జీవితాల ద్వారా విశ్వాసంలో బలపడతారు. సాక్షిగా కొనసాగుతూ, సువార్త విలువల ప్రకారంగా జీవిస్తారో, వారి అనుదిన జీవితాలలో అప్పుడే తల్లిదండ్రులు వారి బిడ్డలకు విద్య నెర్పిస్తూ కతోలిక విశ్వాసంలో బలపడేలా తోడ్పడతారు. ప్రతి కుటుంబంలో జరిగే సంఘటనలలో అనగా దివ్య సంస్కారాలను పొందెటప్పుడు, దైవార్చన పండుగలు కొనియాడినపుడు, పుట్టినరోజు పండుగలు, ఇంకా ఏమైన పండుగలు జరిగినప్పుడు, పిల్లలకు ఆధ్యాత్మికం గురించి చెప్పాలి, అధికంగా కనపరచాలి. తల్లిదండ్రులు జాగ్రత్త వహించి, ఆ పండుగల యొక్క ప్రాముఖ్యతను బిడ్డలకి తెలియజేయాలి. ఆవిధంగా కుటుంబం యొక్క ప్రాముఖ్యతను బిడ్డలకి తెలియజేయాలి. ఆవిధంగా కుటుంబం యొక్క ఆధ్యాత్మికత పిల్లల జీవితాలలో ఎంతో ప్రభావితం చేస్తాయి. అలా చెప్పటమే కాకుండా వారి బిడ్డలతో పాటు తల్లిదండ్రులు కూడా వారి అనుదిన జీవితంలో వాటిని పాటించాలి. అప్పుడే వారు దానిని గుర్తు చేసుకుంటూ, వివిధ పద్ధతుల ద్వారా వాటిని కుటుంబ జీవితంలో తెలియజేస్తుంటారు. కుటుంబంలో అందరూ కూడా మంచి మర్యాదలతో, ప్రేమతో కూడిన దిద్దుబాటుతో సాగిలి. అప్పుడే అందరూ నేర్చుకుంటారు. కుటుంబ ఆధ్యాత్మికత అభివృద్ధి చెందుతుంది. మనం నెర్చుకున్న సత్యోపదేశం కూడా మనకు సహాయపడుతుంది. ఎక్కడైతే విశ్వాసానికి, అన్యమతస్థులు అడ్డుపడతారో, అప్పుడు మూడనమ్మకాలు, అవిశ్వాసం విపరీతంగా వ్యాపిస్తాయి. అప్పుడు ఎవరూ కూడా విశ్వాసంలో బలపడలేరు, ముందుకు సాగలేరు. ఎక్కడైతే యువత, వారు వయస్సులో ఉన్నప్పుడే సత్యోపదేశంతో గట్టిపునాది వేస్తుందో అక్కడ కుటుంబం, సంఘ విశ్వాసం దృడంగా పరిష్టంగా ఉంటుంది. అందుకే ఎప్పటికప్పుడు కుటుంబస్తులు, ఒకరికిఒకరు విశ్వాసంలో బలపరచుకోవాలి. నూతన విద్యాభోధనల ద్వారా, మాటల ద్వారా వారు సత్యోపదేశాన్ని నెర్పించాలి. నేర్చుకోవాలి.

### 2. క్రైస్తవ విద్య (సంఖ్య 3)

పిల్లలకు జీవం పోసి జీవితాన్నిచ్చేవారు తల్లిదండ్రులు కనుక, వారికి విద్యాబుద్ధులు గరపవలసిన గురుతర బాధ్యత తల్లిదండ్రులు మీదనే ఉంది. పిల్లల

చదువు సంధ్యలకు బాధ్యత వహించవసినదివారే. తల్లిదండ్రులు తమ కుటుంబాలలో పరస్పర ప్రేమ భావన, దేవునిపట్ల భక్తి విశ్వాసాలు, సాటి వారిపట్ల గౌరవమర్యాదలు చూసే సంస్కారవంతమైన వాతావరణాన్ని నెలకొల్పాలి. అలాంటి వాతావరణమే పిల్లలకు సమగ్రంగా వికసించడానికి, బాధ్యతగల పౌరులుగా ఎదగడానికి దోహదం చేస్తుంది. ప్రతి సమాజ మనుగడ ఆయువుపట్టు పునాది కుటుంబమే. అందుకే కుటుంబాన్ని ప్రాథమిక సామాజిక విలువలు పాఠశాలగా పరిగణిస్తారు. పవిత్ర వివాహ సంస్కారం ద్వారా దేవుని నిశిష్ట కృపావరాలను పొంది, బాధ్య తాయుతమైన జీవనం గడపవలసిన క్రైస్తవ కుటుంబాలన్నింటి లోనూ, తల్లిదండ్రులు తమపిల్లలను దేవునిపట్ల భయభక్తులుతో పెంచాలి, పొరుగువారి ని ప్రేమించే సౌజన్యాన్ని వారిలో పెంపొందిచాలి. బాల్యంలో జ్ఞానస్నానం పొందిన రోజున వారు స్వీకరించిన విశ్వాస వరానికి అనుగుణంగా సద్గుణాలను వికసింపజేయాలి. కుటుంబంలోనే పిల్లలు ప్రేమ సౌహార్ధాలు సహజీవనం చేసే సమసమాజాన్ని, భక్తి విశ్వాలు పరిమళించే ఆదర్శప్రాయమైన శ్రీసభను చవిచూడగలగాలి. దైవజన సంఘ మనుగడుకు పురోగమనానికీ, ఆదర్శ క్రైస్తవ కుటుంబాలే పట్టుగొమ్మలవుతాయన్న సత్యాన్ని తల్లిదండ్రులు గుర్తించాలి. తద్వారా తల్లిదండ్రులు వారి బాధ్యతలను శ్రద్ధాశక్తులతో నిర్వర్తించాలి.

**3. ఆధునిక ప్రపంచంలో శ్రీసభ (సంఖ్య : 52)**

కుటుంబం సంపూర్ణ మానవ వికాసానికి దోహదం చేసే పాఠశాల వంటిది. ఈ కుటుంబ పాఠశాల సక్రమంగా సత్ఫలితాలను సాధించాలంటే, భార్యాభర్తల సహకారం అవసరం. వారు పిల్లల పెంపకంలో పరస్పరం వారి ఆలోచనలను అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తం చేసుకోగలగాలి కలిసి చర్చించాలి. పిల్లలకు ఉత్తమశిక్షణ ఇవ్వడంలో తండ్రి పాత్ర కీలకమైంది. కాబట్టి తండ్రి ఎప్పుడు పిల్లలను కనిపెట్టి ఉండాలి. అందుబాటులో ఉండాలి. పిల్లల ఆలనాపాలనా, ఇంటిని దిద్దుకోవడంలో తల్లిగా ఆవరణ ఎంతో అవసరం. పిల్లలు జీవన మార్గాల ఎంపికలో తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలి. వారి పెరుగుదలకు తల్లిదండ్రులు అడ్డగోడగా ఉండకూడదు, అవరోధాలు కల్పించకూడదు. పిల్లలు ఆర్థికంగా, సామాజికంగా, నైతికంగావారు స్వతంత్రులై కుటుంబ బాధ్యతలను స్వీకరించే శక్తి సామర్థ్యాలను



పెంపొందించుకోవాలి. పిల్లలు తమ భవిష్యత్తును తామే దిద్దుకోవడానికి తగిన సూచనలు సలహాలనందిచాలే తప్ప, వారి స్వేచ్ఛకు ఎలాంటి అవరోధాలు కల్పించకూడదు.

**4. దైవప్రజలు (సంఖ్య 5:11,35)**

గృహస్థ శ్రీసభగా పరిగణింపబడే కుటుంబంలో తల్లిదండుల పాత్ర గురుతరమైనది. తమ సంతానానికి వారే తొలి ఆధ్యాత్మిక గురువులు. వారు తమ మాటల ద్వారా, చేతల ద్వారా ఆదర్శ ప్రాయమైన భక్తి జీవనం ద్వారా తల్లిదండ్రులే తమ పిల్లలకు విశ్వాస సత్యాలను బోధిస్తారు. పిల్లలను దైవసేవకు అంకితమవుతామనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినప్పుడు వారిని ప్రోత్సహించాలి. వారి పెంపకం పట్ల ప్రత్యేకమైన శ్రద్ధాశక్తులను చూపాలి. అందుకు అనువైన ఆధ్యాత్మిక నేపథ్యాన్ని శ్రీసభ సమకూర్చుతుంది.

కతోలిక విశ్వాసులు ఆధ్యాత్మిక జీవితాన్ని పరిపుష్టమూ చైతన్యవంతమూ చేస్తూ, వారిని సమర్థులైన వేద బోధకులుగా, అపోస్తోలిక ధర్మ నిర్వాహకులుగా తీర్చిదిద్దుతూ, దివ్య సంస్కారాలు ఏవిధంగా అవతరించబోయే కొత్తనింగికీ, కొత్త భువికీ ముందస్తు ప్రతీకలుగా నిలుస్తున్నాయో, అలానేతామే విశ్వాస సత్యాలకు అనుగుణంగా తమ జీవితాలను తీర్చిదిద్దుకుంటారు. ఇలా క్రీస్తుతత్వాలను, ఆయన బోధించిన సత్యవేదాన్ని ప్రకటిస్తూ తమమాటల ద్వారా, చేతల ద్వారా సాక్షీ భూతజీవితాల ద్వారా సామాన్య క్రైస్తవులు చేసే సత్య ప్రబోధానికి ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుంది. సమకాలీన ప్రపంచంలో అతి సాధారణమైన జీవన స్థితిగతులలో అసమానమైన క్రైస్తవ విలువలకు అద్దం పడుతూ జీవించడం వలన సామాన్య క్రైస్తవులిచ్చే జీవన సాక్ష్యానికి బహు ప్రాధాన్యం లభిస్తుంది.

**5. సత్యోపదేశ వ్యాప్తి కొరకు సూచనల గ్రంథం (సంఖ్యలు 179; 226; 227; 255)**

గురువులు గుర్తించవలసిన విషయమేమిటి అంటే గురువులు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సువార్త పరిచర్య విలువలు నేర్పించుటకు కావలసిన సలహాలు ఇస్తూ సహాయపడాలి. ఈ సహాయం అనేది శ్రీసభ తరుపున, గురువులు సహాయపడి, నడిపించాలి. ఎందుకంటే వీరికి సత్యోపదేశ విలువలు నేర్పించుటకు అదో ఒక గొప్ప అనువైన సమయం (179).

క్రైస్తవ కుటుంబాలలో తల్లిదండ్రులిచ్చే ఆదర్శ జీవితం వారి పిల్లలకు సాక్ష్యాలు, వారి పిల్లల జీవితాలలో ఇవి స్థిరపడతాయి. అంతే కాకుండా వారు, తల్లిదండ్రులపట్ల, దేవుడిపట్ల గౌరవాన్ని పెంచుకుంటారు. ఈ విధంగా పిల్లలు ఒక గొప్ప క్రైస్తవ విలువలతో పెరిగి, దేవుడికి దగ్గరగాను వారు పొందిన మొదటి క్రైస్తవ విశ్వాస జీవితాన్ని గుర్తుంచుకొని, తోటి వారితో సుమాతృకగా జీవిస్తారు. ఈ విధంగా కుటుంబాల ద్వారా వచ్చిన క్రైస్తవ విశ్వాసం, పిల్లల్లో ఇమిడిపోయి, వేరే వాటికి తావులేకుండా, విశ్వాసంలో మరింతగా బలపడతారు. పిల్లలు చిన్న తనంలో పొందిన ఈ విశ్వాసాన్ని ఎప్పుడైతే అవకాశం వస్తుందో అప్పుడు, ఎంతో ఆనందంగా క్రైస్తవ విలువలకు సాక్షులుగా నిలుస్తారు. ఇవన్ని కూడా ఎప్పుడైతే తల్లిదండ్రులు, కుటుంబంలో వారే మొదటి విద్యాబోధకులు అని గుర్తించి, శ్రద్ద తీసుకొని, పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తారో అప్పుడు పిల్లలు దేవుని వరాలకు పాత్రులౌతారు. కుటుంబ సువార్త పరిచర్య అనేది ఈ విధంగానే ప్రతిక్రైస్తవ కుటుంబంలో మొదలై, అనేక మార్గాల ద్వారా అభివృద్ధి చెందుతుంది (226).

తల్లిదండ్రులు, వివాహం అనే గొప్ప సంస్కారం ద్వారా దేవుని కృపావరాలను, క్రైస్తవ విద్యను వారి సంతానానికి ఇప్పించడానికి అర్హులౌతారు. వారు పొందిన క్రైస్తవ విలువలను వారి సంతానానికి నేర్పిస్తూ సాక్షులుగా నిలుస్తూ, వారికి కావలసిన మానవతా విలువలను, దైవభక్తిని వారికి అందజేస్తారు. ఈ మానవతావిలువలు, దైవభక్తి, అనేవి కుటుంబ జీవితంలో చాలా ప్రాముఖ్యమైనది. ఈ గుణాల ద్వారానే సువార్త విలువలు కుటుంబ బాధ్యతలను, క్రైస్తవ విద్యను వారి విశ్వాసంతో చాటుతారు. వారి సంతానం అభివృద్ధి అవుతున్న సమయంలో వారిలో ఉన్న విశ్వాసం, తోటి వారితో ఇచ్చి పుచ్చుకుంటారు. అందుకనే తల్లిదండ్రులు మంచి విశ్వాసాన్ని పిల్లలకి అందివ్వాలి. మౌలిక సంఘాల ద్వారా, కొంతమందిని కలవడం ద్వారా, రకరకాల విద్యల ద్వారా వారి క్రైస్తవ సత్యోపదేశాన్ని తల్లిదండ్రులు నేర్పించాలి. వారికి వాటి యొక్క ముఖ్య లక్షణాలను తెలియచేసి వాటి పట్ల బాధ్యత కలిగెలాచేయాలి. ఇటువంటి కార్యాలకు, గ్రహస్థ శ్రీసభ అయినటువంటి క్రైస్తవ కుటుంబాలు అనువైన వాతావరణాన్ని కల్పించుకొని పిల్లలను, పెద్దలను ఒక చోట చేర్చి, ఆ సువర్ణవకాశాన్ని ఉపయోగించి వారికి గట్టిపునాది వేయాలి (227).



విశ్వాసాన్ని పంచే ప్రథమ గురువులు తల్లిదండ్రులు. ఈ తల్లిదండ్రులు వారి సంతానంతో కలిసి, వారి సంస్కృతుల ద్వారా నేర్చుకున్న దానిని, చిన్న వారికి పంచుతారు. కుటుంబాన్ని మనం ఒక చిన్న గృహస్థ శ్రీసభగా చెప్పుకోవచ్చు. ఎందుకంటే ప్రతీ క్రైస్తవ కుటుంబం కూడా శ్రీసభలోని భాగం. వారు శ్రీసభలో ఉన్న విలువలను తీసుకొని, పాటిస్తూ ఉంటారు. వాటిని అనుసరిస్తూ, ఆలోచిస్తూ, వాటికి తగినవిధంగా ప్రార్థనచూస్తూ, సాక్షులుగా జీవిస్తారు. అందుకని శ్రీసభ యొక్క విలువలు అనేవి అందరికి విస్తరిస్తాయి. అందుకే రెండవ వాటికన్ మహాసభ క్రైస్తవ కుటుంబాలకు ఒక ప్రత్యేకమైన పాత్రను ఇచ్చి, ఒక చిన్న గృహస్థ శ్రీసభగా పిలుస్తూ ఉంది. మానవతావిలువలు కలిగిన వ్యక్తులుగా తయారు చేసి, వారికి క్రైస్తవ ప్రవేశ సంస్కారాలను గురించి, చెప్పి, క్రైస్తవ జీవనానికి పునాదులు వెస్తాయి కుటుంబాలు. వారికి దైవభయం ప్రార్థన, మంచి విలువలతో కూడిన విద్యను అందిస్తారు.

**6. ఆధునిక ప్రపంచంలో క్రైస్తవ కుటుంబాల పాత్ర (సంఖ్య 3:38; 39; 53; 60; 86)**

తల్లిదండ్రులే వారి పిల్లలకు మొదటి గురువులు అని గమనించి, వారికి మంచి క్రైస్తవ విలువలతో పునాది వేయాలి. పిల్లల జీవితంలో తల్లిదండ్రులు పాత్ర చాలా ప్రాముఖ్యమైనది. ఎందుకంటే తల్లిదండ్రులు ద్వారానే పిల్లలు మొదటిగా నేర్చుకుంటారు. కాబట్టి తల్లిదండ్రులు వారి యొక్క బాధ్యతను గమనించి, పిల్లలపట్ల ప్రత్యేక శ్రద్ధను చూపించి మంచి విలువలతో కూడిన విద్యను అందించాలి (36).

వివాహం అనే గొప్ప సంస్కారం ద్వారా శ్రీసభ, దంపతులకు ఒక ప్రత్యేక హోదాను, కుటుంబ జీవనాన్ని అదుపాజ్ఞలలో ఉంచే నైతిక చట్టాలను, దేవుని పిలుపును నిర్దేశిస్తుంది. అందుకే పునీత తోమాసు అక్వినాస్‌గారు క్రీస్తు ప్రభువు స్థాపించిన, శ్రీసభను గురించి గొప్పగా పొగుడుతున్నారు. అదేమనగా – "కొంతమంది ఆధ్యాత్మిక జీవితంను జీవించి, ఆధ్యాత్మికతను కాపాడుతూ, వేరే వారికి కూడా ఆధ్యాత్మికతను గురించి చాటుతూ ఉంటారు. ఇది దేవుడు ప్రసాదించిన పవిత్ర యాజకాభిషేకం (లేక) గురుక్రమం ద్వారా జరుగుతుంది. మరికొంతమంది, సమాజానికి మరియు ఆధ్యాత్మిక జీవితానికి సేవ చేస్తారు. ఇది వివాహం అనే

గొప్ప సంస్కారం ద్వారా జరుగుతుంది". ఈ వివాహం అనే అంతస్తు ద్వారా స్త్రీ, పురుషులు కలిసి పరస్పరం తెలుసుకొని, వారికి కలిగిన సంతానాన్ని మంచి మానవతా, విద్యాబుద్ధులు నేర్పి, వికాసవంతులను చేస్తూ, దేవునికి ప్రియమైన బిడ్డలనుగా తీర్చిదిద్దుతారు (సంఖ్యా 38) కాబట్టి క్రైస్తవ కుటుంబాలు ఈ విషయాన్ని గమనించి దేవుడు వారికి ఇచ్చిన ఈ గొప్పవరాన్ని తీర్చిదిద్దాలి. అందుకే ఆరవ పౌలు పాపుగారు "జ్ఞాన స్నానము పొందిన ప్రతీ వ్యక్తి సువార్త పరిచర్యకు అర్హుడే మరియు ఈ విధంగానే అందరూ సువార్త పరిచర్య చేయబడ్డారు" అని పలికారు.

సువార్త పరిచర్యను ముందుకు కొనసాగించవలసిన బాధ్యత క్రైస్తవులకు ఉంది. ఇది వారికి ఇవ్వబడిన ప్రత్యేకమైన పని, దీనిని ఏవ్వరూ కూడా మార్చలేరు. ఈ సువార్త పరిచర్య ద్వారా కుటుంబంలో ఉన్నవారి వ్యక్తిగత విలువలు పెంపొందిపంబడతాయి. వారి యొక్క ప్రేమ, శాంతి, నెమ్మదితనం వారి నిరంతర జీవితానికి సాక్ష్యంగా నిలుస్తాయి.

కుటుంబం యొక్క రోజు వారి జీవితం ఒక ప్రత్యేకమైన సాక్ష్యంగా నిలుస్తుంది. సాక్షి జీవితం అనేది వారు నిర్వర్తించవలసిన ధర్మం. దీనిని ఎవ్వరూ కూడా తృణీకరించలేనిది. వారి పిల్లలకు రోజూ ప్రార్థన చేసే విధానాన్ని నేర్పిస్తారు. ఎప్పుడైతే కటుంబంలో ఉన్న, తల్లి, తండ్రి, బిడ్డలు, తాతలు, అమ్మమ్మలు కలిసి తరచుగా ప్రార్థన చేస్తారో, అప్పుడు వారి బిడ్డలలో ఒక ప్రత్యేకమైన విశ్వాసం, విలువలు ఏర్పడతాయి. ఇలా చేసినప్పుడు ప్రభువు స్థాపించిన గురుత్వం అనే బాధ్యతను వారు నిర్వర్తించినవారు అవుతారు. అంతేకాకుండా వారి భవిష్యత్తులో కూడా వారి జీవితాలు, విలువలు బాగుంటాయి అన్న విశ్వాసం కలుతుంది. రాబాయే కాలంలో మంచి మనుషులు, మానవతా విలువలు ఉండాలంటే ప్రస్తుతం జీవిస్తున్న కుటుంబాలు బాగా విలువలతో జీవించాలి. ఎందకంటే వ్యక్తులు కుటుంబాల నుండి వస్తారు.

## 7. ఆధునిక ప్రపంచంలో సువార్త పరిచర్య (సంఖ్య 71)

తిరుసభలో గృహస్థులుచేసే సువార్త పరిచర్యకు ఎవ్వరూ అడ్డుపడకూడదు. వారిని నిరుత్సాహపరచకూడదు. క్రైస్తవ చరిత్రలో, రెండవ వాటికన్ మహాసభలలో గృహస్థుల సువార్త పరిచర్యకు ఒక గొప్ప ప్రాముఖ్యతను సంతరించుకుంది. గృహస్థులు, 



ఒక చిన్న గృహస్థ శ్రీసభ అని మంచి పేరు, ప్రఖ్యాతి కావించుకుంది. అనగా ప్రతి క్రైస్తవ గృహస్థ కూటుంబం కూడా క్రీస్తు ప్రభుని విలువలతో కలిగి జీవిస్తూ ఉన్నారు అని అర్థం. ప్రతి క్రైస్తవ కుటుంబం కూడా, ఒక శ్రీసభలాగా ఉంటూ, సువార్త విలువలు, కుటుంబం నుండే అందరికీ చేరాలని ఆకాంక్షిస్తూ ఉంది. కాబట్టి ఏ కుటుంబం అయితే ఈ సత్యాన్ని విశ్వసిస్తూ, జీవిస్తూ ఉంటుందో వారు క్రైస్తవ విలువలతో, క్రీస్తు ప్రభుని పోలి జీవించినట్లే, తల్లిదండ్రులు వారి పిల్లలకు, సువార్త విలువలను పంచుతూ ఉన్న సమయంలో వారు కూడా వారి పిల్లల నుండి సువార్త విలువలను నేర్చుకుంటారు. అటువంటి గొప్పకుంటుంబం, మిగతా ప్రజలకు సమాతృకగా ఉంటూ, సవార్త విలువలను పంచుతారు. మతాంతర వివాహాలు జరిగినప్పుడు, మరింత జాగ్రత్త వహించాలి. ఎందుకనగా ఆదంపతులు వారి బిడ్డలకు, క్రైస్తవ విలువలను తెలియజేయవలసిన బాధ్యతను గుర్తుపెట్టుకోవాలి. వారికి జ్ఞానస్నానం ఇప్పించి, వాటి విలువలను తెలిపి, క్రైస్తవ విలువలతో పెంచాలి.

## 8. సత్యోపదేశం (సంఖ్య 1653; 1656, 2221, 2223)

దాంపత్య ప్రేమపట్ల ఉన్న విశ్వసనీయత, నైతిక, ఆధ్యాత్మిక పరమోన్నత జీవన ఫలాలను విస్తృతం చేసి, విద్య ద్వారా తమ పిల్లలకు అందజేస్తుంది. తల్లిదండ్రులే తమ పిల్లలకు ప్రథమ గురువులు, విద్యా బోధకులు. కాబట్టి జీవితాన్ని సేవించటమే వివాహం, కుటుంబము యొక్క ప్రాథమిక కర్తవ్యమని గుర్తించాలి (1653). ప్రస్తుత కాలంలో విశ్వాసం, అంటే తెలియనివారు కొందరైతే, విశ్వాసాన్ని ద్వేషించే వాళ్ళు మరికొందరు చాలా ప్రాముఖ్యత ఉంది. ఈ కుటుంబంలే విశ్వాసాన్ని ప్రకాశింప చేస్తాయి. అందుకనే రెండవ వాటికన్ మహాసభలు ఈ గృహస్థ విశ్వాస కుటుంబాలను "గృహస్థ శ్రీసభ"గా గుర్తించి, పిలుస్తుంది. ఇది ఒక పురాతన భావమే. తల్లిదండ్రులు తమమాట, జీవితం ద్వారా వారి పిల్లలకు, ప్రథమ బోధకులుగా, విశ్వాస బోధకులుగా పిల్లలను ప్రోత్సహించాలి (1656).

దాంపత్య జీవితాన్ని కేవలం సంతానోత్పత్తి కోసం మాత్రమే అని భావించ కూడదు. బిడ్డలు యొక్క నైతిక విద్యకు, ఆధ్యాత్మిక పెరుగుదలకు రూపకల్పన కావాలి. బిడ్డల యొక్క నైతిక, ఆధ్యాత్మిక విద్యను అందించడంలో తల్లిదండ్రులు ఎక్కువ శ్రద్ధ

చూపాలి. దీనిని ఎవ్వరూ కూడా వేరొక దానితో ముడిపెట్టి మార్చలేదు. ఎందుకంటే అది తల్లిదండ్రుల యొక్క ప్రాథమిక హక్కు బిడ్డలకు విద్యను అందించడం అనేది తల్లిదండ్రుల యొక్క ప్రాథమిక హక్కు బిడ్డలకు విద్యను అందిచడం అనేది తల్లిదండ్రుల యొక్క ప్రథమ కర్తవ్యం. మృదుత్వం, క్షమాగుణం, గౌరవం, విధేయత, నిస్వార్థమయమైన సేవలందించగల గృహంగా వారి ఇంటిని, కుటుంబాన్ని తీర్చిదిద్దాలి. ఈ విధంగా వారు సాక్షులుగా నిలవాలి. సుగుణాలను అభ్యాసం చేయడానికి, నేర్పించడానికి కుటుంబం ఒక అనువైన, నిజమైన ప్రదేశం. కాబట్టి కుటుంబంలో మంచి పునాదిపడాలి.

**ముగింపు**

ప్రస్తుత సమాజంలో ఎంత సంపాదించుకున్నామా? ఎంత చదువుకున్నామా? ఎన్ని విజయాలు సాదించామా? అన్ని ప్రశ్నలేకాని, నేనేంటి! నా వారసత్వ లక్షణాలు ఏంటి! నా మానవతా విలువలు ఎలా వచ్చాయి! నాముందు తరానికి నేనేమి మానవతా విలువలు, సంస్కారాలు ఇవ్వాలి! అని ఎవ్వరూ ఆలోచించడం లేదు. ఆలోచించడానికి కాలం కూడ లేదు. పాత రోజులలో ఏమండి! అని మొదలుపెట్టి! ఏమోయ్! దాకా ప్రయాణించి నువ్వురా! అని ఆత్మీయంగా గుండెలకు హత్తుకునే దాకా ప్రశ్నలు కొనసాగేవి. మనం బ్రతికే బ్రతుకలలో విలువలు ఉంటే, ముందు తరాలవారికి ఆ విలువలు వ్యాపిస్తాయి. ప్రస్తుత సమాజంలోని వ్యవస్థలు, “అవ్యవస్థకు” పెద్దపీఠం వేస్తున్నాయి. తల్లిదండ్రుల, పెద్దల వారసత్వం యొక్క సంస్కారంలోని మానవతావిలువలు భ్రష్టుపట్టినవి అని చెప్పడంలో సందేహంలేదు. నాటి తల్లిదండ్రులు, పెద్దలు వారి పిల్లలను క్రమ శిక్షణలో పెంచినట్లైయితే నేటి సమాజంలో చెడు రాజకీయాలు, కాల్‌మనీ రాకెట్లు, ఆడపిల్లలు మీద అఘాయిత్యాలు, భార్యా భర్తలు చంపుకోవడం, వ్యభిచారాలు, హత్యలు లాంటివి జరిగియిండేవి కావు. మరొక దురదృష్టమేమిటంటే, తల్లిదండ్రులు పెద్దలు, మహానుభావుల గురించి, పునీతుల గురించి, ఎవ్వరికీ తెలియకపోవడం బాధాకరమైన విషయం. ఈనాడు ఏదిమంచో, ఏది చెడో తెలుసుకోలేని స్థితిలో ఉన్నారు. నేను ఏదైనను చేయవచ్చును అని తలస్తున్నారు. కాని అన్నీ మానవుల అభివృద్ధికి మంచివికావు. (1 కొరింతీ 6:12).



వేమన శతకంలో విన్నట్లుగా :

తల్లికెదురుకొనుట తండ్రి కెదురుకొంట
అన్న కెదురుకొనుట అరయమూడు
పాతకములు నెరిగి వర్తింపగావలె
విశ్వదాభిరామ వినురవేమ! – అనగా తల్లిమాట వినకపోవటం, తండ్రికి ఎదురు తిరగటం, తన కన్నా పెద్దవాడైన అన్నను, పెద్దలను ధిక్కరించడం వంటి పనులు చాలా చెడ్డవి. అవి పెద్ద పాపాలె. కాబట్టి ఈ పాపాలు చేసేటప్పుడు మంచి, చెడులు, ఆలోచించి మెలగాలి.

కాబట్టి మానవతా విలువలు, మంచి వికాసం కుటుంబంలోనుండి సంతానానికి, వారి ద్వారా గ్రామానికి, రాష్ట్రానికి, దేశానికి అందించడగలగాలి. అప్పుడే ప్రజలందరు మానవతా విలువలతో సుఖ సంతోషాలతో జీవిస్తారు. లేకపోతే ఒకరికి ఒకరు చంపుకుంటూ, మోసపూరితమైన జీవితంను గడుపుతూ ఉంటారు. తల్లిదండ్రులు, పెద్దలు శ్రద్ధ వహిస్తే సంతానం మంచి విలువలతో ముందుకుసాగుతుంది. భావితరాలు అందరు ఆనందంగాజీవిస్తారు.

❋ ❋ ❋ ❋

# 8. కతోలిక ప్రపంచం - కుటుంబ వ్యవస్థ

**(కుటుంబమునకు సంబంధించిన సువార్త పరిచర్యలో**
**తిరుసభ ఎదుర్కొంటున్న సవాళ్లు)**

**- ఫాదర్ గోవా శౌరయ్య**

## ఉపోద్ఘాతం

ఈనాటి ప్రపంచంలో విడాకులు, స్వలింగ దంపతులు, సహజీవన విధానం, ఒంటరి జీవిత అలవాట్లు, ఇహలోక జీవిత విధానం నడవడిక కుటుంబ జీవితాన్ని ఎంతగానో చిన్నాభిన్నం చేస్తున్నాయి. ఈ తరుణంలో పవిత్రాత్మ ప్రేరణ వలన ఫ్రాన్సిస్ జగద్గురువులు కుటుంబ వ్యవస్థ మీద సుదీర్ఘ చర్చ జరగాలి అని ప్రకటించడం సకల మానవాళిని ఏకత్రాటిమీదకు తీసుకొని వచ్చింది. అన్ని సమావేశాలవలె కాకుండ, ఈ సమావేశం సుదీర్ఘంగాను నూతన విధానాలు, పద్ధతులలో కొనసాగిందని మనం తెలుసుకుంటున్నాం. ఈ సమావేశం మూడు దశలుగా జరిగింది. అదే పశ్నావళి మీద చర్చ మూడవ అతి సామాన్య పీఠాధిపతుల మహా సమావేశం 14వ పీఠాధిపతుల సామాన్య మహా సమావేశం. ఈ మూడు దశలను ఈ వ్యాసంనందు సంక్షిప్తముగా పాఠకులకు అందించడం జరిగింది.

## చరిత్ర

పవిత్రాత్మ ప్రేరణ వలన ఫ్రాన్సిస్ జగద్గురువులు జూలై మాసం రెండువేల పదమూడు సంవత్సరంలో పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ క్రింది విధంగా అన్నారు: వివాహం, కతోలిక వివాహం దానియందున్న సమస్యలు, సవాళ్లు, విడాకులు తీసుకున్నవారు, మళ్లీ వివాహం ఆడినవారు దివ్యసత్ప్రసాదం స్వీకరించవచ్చా లేదా అనే అంశాల మీద లోతైన చర్చ జరగాలని తెలియజేశారు. ఒకసారి తిరుసభ బోధించిన అంశాలను నెమరువేసుకున్నట్లయితే ద్వితీయ వాటికన్ మహాసభ తరువాత



"మానవ జీవితం" (*Humane Vitate*) అనే విశ్వలేఖను ఆరవ భక్తినాథ పాపుగారు జూలై ఇరవై ఐదవ తేదీన 1968వ సంవత్సరంలో సకల మానవాళికి అందించారు. కుటుంబ జీవితం అనే అంశం మీద నవంబరు 22, 1981వ సంవత్సరంలో నాటి రెండవ జాన్‌పౌల్ పాపుగారు ఒక అధికార పత్రాన్ని వ్రాశారు. ఈ సందేశం తరువాత ఎలాంటి అధికారపత్రం విడుదల కాలేదు. కుటుంబ క్రైస్తవత్వం వివాహం క్రైస్తవ విశ్వాసంలో ప్రస్తుత ప్రపంచ ధోరణులను అర్థం చేసుకోడానికి, అర్థం చేసుకొనే విధానంలో చాలా మార్పులు చూడడమే కాకుండా మొదటికే మోసం అన్న విధంగా వివాహ అంతస్తు కుటుంబ వ్యవస్థ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ తరుణంలో పరిశుద్ధ పోపుగారికి చాలా ఆశ్చర్యాన్ని, చాలా ఆసక్తిని కలిగిస్తుంది. ప్రతిఒక్కరు మాట్లాడేవారే, ఆసక్తితో ఎదురుచూచేవారే - ఇటు మేధావి నుంచి అటు సామాన్య మానవుని వరకు ప్రతి ఒక్కరి నోట పరిశుద్ధ పాపుగారు ఏమి చేయబోతున్నారు, ఎలాంటి కతోలిక నైతిక సడలింపులు చేయబోతున్నారో అని అందరు ఎదురు చూస్తున్నారు. ఆ పవిత్ర సమయం రానే వచ్చింది. అక్టోబర్ 5 నుంచి 19 వరకు 2014లో జరిగిన మూడవ ప్రత్యేకమైన పీఠాధిపతుల మహాసభలో వివాహం, కుటుంబం, వారికి విశ్వాస పరిచర్య చేయడంలో ఉన్న ఇబ్బందుల గురించి లోతైన చర్చ జరగబోతుందని అక్టోబర్ 8, 2013 నాడు పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు ప్రకటించారు.

ప్రతీ కతోలిక పీఠాధిపతుల సమావేశమునకు (Synod) ముందుగా చర్చించబోయే అంశానికి సంబంధించిన అధికార పత్రాన్ని విడుదల చేస్తారు. దీనిని పీఠాధిపతులు ఆ సమావేశంలో దీర్ఘచర్చను నిర్వహిస్తారు. ఆ చర్చ అంశాలన్నిటిని, సమావేశ అభిప్రాయాలను పరిశుద్ధ పోపుగారికి అందజేస్తారు. దాని ఆధారంగా వారు ఒక విశ్వలేఖను వ్రాసి విడుదల చేస్తారు.

కాని ఈసారి మాత్రం దానికి కొంత భిన్నంగా నిర్వహించారు. చర్చించబోయే అంశానికి దోహదపడే పత్రికకు బదులుగా ఒక ప్రశ్నావళిని విడుదల చేశారు. తిరుసభ సభ్యులైన పీఠాధిపతుల నుంచి గృహస్థ క్రైస్తవుల వరకు ఆ ప్రశ్నలను వారి వారి స్థాయిలో చర్చించి సమాధానాలు పంపించ వలసిందిగా కోరారు. ఆ ప్రశ్నావళి

1. కుటుంబం మీద పరిశుద్ధ గ్రంథ తిరుసభ బోధన ఎంత వరకు విశ్వాసులకు తెలుసు, వాటిని పాటించుచున్నారా?
2. స్వాభావిక (natural) చట్టంలో వివాహం
3. సువార్తీకరణలో కుటుంబమునకు చేయు ప్రేషితసేవ
4. కష్టతరమైన వివాహ సంబంధాల్లో, సందర్భాల్లో ప్రేషిత సేవ
5. స్వలింగ వ్యక్తుల బాంధవ్య జీవితం గురించి.
6. నిలకడలేని వివాహ జీవితంలో పిల్లల చదువులు
7. జీవితం/జీవం పట్ల దంపతుల అవగాహన
8. కుటుంబం, సభ్యుల మధ్య సంబంధం
9. ఇంకా ఇతరమైన సవాళ్లు, సలహాలు

ఆయా స్థాయిల్లో సుదీర్ఘ చర్చల తరువాత సేకరించిన సమాధానాలను (*Instrumentum laboris*) అనే గ్రంథాన్ని ముద్రించారు. దానిమీద అక్టోబరు 5, 2014 వాటికన్ నగరంలో సమావేశమై చర్చించారు. అక్కడ 253 మంది సమావేశం కాగా అందులో 114 మంది వివిధ పీఠాధిపతుల సమావేశం నుండి పదమూడు మంది *Sui, Juris* కతోలిక సంఘముల నుండి 25 మంది రోమన్ కతోలిక సంఘం నుండి 9 మంది సామాన్య Council of the Secretariat నుంచి, Synod ప్రధాన కార్యదర్శి, ఉపకార్యదర్శి ముగ్గురు మఠజీవిత సంస్థల నుండి 26 మంది పాపుగారి చేత ఎన్నుకొనబడినవారు, 8 మంది Fraternal delegates, 38 మంది Auditors. వీరిలో 181 మంది ఓటు హక్కుగలవారు.

ఈ సమావేశంలో ప్రతి మేత్రాణులు నాలుగు నిమిషాలు మాట్లాడడానికి అవకాశం ఇచ్చారు. వారు సేకరించిన సమాధానాలన్నింటిని వ్రాతపూర్వకంగా ఇవ్వాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంలో పరిశుద్ధ పాపుగారు పీఠాధిపతులను ఉద్దేశించి మీరు ఆలోచించిన సత్యాలు ఇతరుల ఆలోచనలకు విరుద్ధముగా ఉన్నా, ఎవరికి చూపక, ధైర్యముగా తెలియజేయాలని చెప్పారు.

సమావేశ సభ్యులంతా చిన్న చిన్న సమూహాలుగా ఏర్పడి పీఠాధిపతులు వ్రాతపూర్వకంగా తెలియజేసిన సమాధానాలను చర్చించిన తరువాత వాటిని మూడు



భాగాలుగా విభజించారు. అవి:

**మొదటి భాగం:** ఈనాటి ప్రపంచంలో కుటుంబ వ్యవస్థ శుభ సందేశంను ప్రకటించుట. ఈ భాగం నందు దేవుని ప్రణాళిక, క్రైస్తవుని నిశ్చయమైన దైవపిలుపు (Vocation), బైబిలు తిరుసభ బోధనలపై కతోలిక అవగాహన, వాటిపట్ల సదుద్దేశం (Positive) మీద విశ్వాసుల అవగాహన అనే అంశాలను పొందుపరిచారు.

**రెండవ భాగం:** ఆధునిక యుగంలో కుటుంబాలు ఎదుర్కొంటున్న సవాళ్లను సరిపడే విధంగా ప్రేషిత కార్యాచరణ. కుటుంబ ప్రేషిత సంరక్షణలో ఎదుర్కొంటున్న వివిధ సవాళ్లు యదార్ధ సన్నివేశాల గురించి ప్రస్తావన జరిగింది.

**మూడవ భాగం:** జీవితం పట్ల నిష్కపటత్వం (Openers), సంతాన ఎదుగుదలలో తల్లిదండ్రుల బాధ్యత. మరీ ముఖ్యంగా స్త్రీ పురుషుల మధ్య ఉండవలసిన దాంపత్య లక్షణాలు, ప్రేషిత కార్యంలో ఇబ్బందికర సన్నివేశాలను క్రోడీకరించి తెలియజేస్తుంది.

ఇతర సవాళ్లు, సలహాలు అనే పశ్నావళిలోని 9వ అంశమును తరువాతి (అక్టోబర్ 2015) సదస్సులో/సమావేశంలో చేర్చిస్తారు. పైన పేర్కొన్న ప్రతీ ఆగమునందు మూడేసి అధ్యాయాలు ఉంటాయి.

## పాపుగారి ప్రసంగంలోని ముఖ్యాంశాలు

Synod Assemblies (పీఠాధిపతుల సమావేశాలు) తెలివైన భావాల గురించి ఎవరు ఎక్కువ తెలివైనవారు అని తెలుసుకొనుటకు కాదు కాని ప్రభువు ద్రాక్షతోటను పెంచి, పోషించుట, ప్రభుని కల నెరవేర్చుట, ఆయన ప్రేమ ప్రణాళికను విశ్వాసులకు అందించే విధానాల మీద చర్చ. అదే అయినట్లైతే ఆది నుండి కుటుంబం అనేది ప్రభువు ప్రణాళికలో అతి ప్రధానమైనది. కావున దానిని సంరక్షించమని ప్రభువు మనల్ని కోరుతున్నారు.

- ఈ సమావేశం కుటుంబ జీవితంలో ఉన్న అన్ని సమస్యలకు, సవాళ్ళకు పరిష్కారం చూపించటం కన్నా వాటిని పరిశుద్ధ గ్రంథమున తిరుసభ సాంప్రదాయాలందు, రెండువేల సంవత్సరముల తిరుసభ చరిత్ర నందు ఆ

సమస్యలను, సవాళ్ళను పరీక్షించి, అటువెనుక ఆనందకరమైన ఆశను, నమ్మకమును కలిగించటం.

- ఈ సమస్యలను, సవాళ్ళను, కష్టములను విశ్వాస దృక్పదముతో చూచి, జాగ్రత్తగా చర్చించి ధైర్యముతో ఎదుర్కొనుట ఈ సమావేశం ద్వారా యేసుప్రభుని శుభ సందేశం తిరుసభకు నేటివరకు మూలాధారం అని ప్రకటించుట అని తన ప్రారంభ ప్రసంగంలో సభ్యులను ఉద్దేశించి పాపుగారు తెలియజేశారు.

మూడవ అతి సామాన్య సమావేశంలో పైన ప్రకటించిన అంశాలమీద సుదీర్ఘ చర్చ జరిగిన తరువాత, పరిశుద్ధ పాపుగారు తన ముగింపు ప్రసంగంలో ఈ విధంగా తెలియజేస్తున్నారు "ప్రియమైన సహోదరి, సహోదరులారా! మన ఆలోచన విధానం మెరుగుపడడానికి నిజమైన ఆధ్యాత్మిక చింతన ద్వారా కుటుంబం ఎదుర్కొంటున్న లెక్కకు మిక్కుటంగా ఉన్న సవాళ్ళకు పరిష్కారాలు కనుగొనుటకును, కుటుంబమును చుట్టుముట్టి ఊపిరాడని నిరుత్సాహాల సమాధానములు కనుగొనుటకు మనకు ఇంకొక సంవత్సరం కలదు. ఈ ప్రత్యేక మహా సమావేశంలో చర్చించిన అంశాలన్నింటిని పొందుపరచి, వ్రాసిన పుస్తకమును రాబోయే సంవత్సరంలో వివిధ మేత్రాణుల సమావేశమునకు అందిస్తారు.

పైన పేర్కొన్న గ్రంథాన్ని వివిధ పీఠాధిపతుల సమావేశాలు చర్చించి అక్టోబర్ నెల 4వ తేది నుండి 25, 2015 వరకు 14వ పీఠాధిపతుల సామాన్య మహాసభను నిర్వహించారు.

## 14వ పీఠాధిపతుల సామాన్య సమావేశం

ఈ సమావేశాన్ని పీఠాధిపతుల బంగారు జూబిలీని పురస్కరించుకొని అక్టోబర్ నెల 4-25, 2015 వరకు కుటుంబ వ్యవస్థ అనే అంశం మీద పీఠాధిపతుల సమావేశం జరిగింది. తిరుసభలోను ఆధునిక ప్రపంచంలోను కుటుంబ వ్యవస్థ యొక్క ఉద్దేశ్యం, వృత్తి అనే అంశం మీద చర్చించారు. ఈ సమావేశంలో మూడవ పీఠాధిపతుల అతిసామాన్య మహాసభనందు చర్చించిన అంశాలు ఇంకా లోతుగా చర్చించి, ప్రతి వ్యక్తి, కుటుంబ సంరక్షణలో మార్గదర్శక సూత్రాలను అందించుటకు ఈ సమావేశం తోడ్పడుతుంది.



ఈ సమావేశమునకు ముందుగా డిసెంబరు 2014 నందు 'వినియామెంతా' అనే గ్రంథమును మూడవ ప్రత్యేక సమావేశమునందు చర్చించిన అంశాలను క్రోడీకరించి, విడుదల చేశారు. దాని తరువాత జూన్ నెల 2015లో *Instrumentum Laboris* అనే క్రియాశీల పుస్తకమును విడుదల చేసి దాని మీద సుదీర్ఘ చర్చను జరిపారు. దానిని మూడు భాగాలుగా విభజించారు. అవి:

1. కుటుంబం ఎదుర్కొంటున్న సవాళ్ళమీద పరిశీలన / విచారణ / ఆలోచన.
2. కుటుంబ వృత్తి
3. కుటుంబ ధర్మం మీద చర్చ

14వ సాధారణ మహాసభ ప్రారంభ ప్రసంగంలో పాపుగారు అపోస్తుల ధైర్యం, సువిశేష (Evangelical) వినయము, విశ్వసనీయతతో కూడిన ప్రార్థన అనే మూడు గుణములు కలిగి ఉండాలని పీఠాధిపతులకు తెలియజేస్తూ సదస్సును ప్రారంభించారు.

ఈ సదస్సు ముగింపు ప్రసంగంలో పాపుగారు మాట్లాడిన కొన్ని ముఖ్యమైన అంశాలు:

- కుటుంబ వ్యవస్థకు ఉన్న సమస్యలన్ని పరిష్కరించుటకు ఈ సమావేశం కాదుగాని, పరిశుద్ధ గ్రంథమునందు తిరుసభ సాంప్రదాయం నందు 2000 సంవత్సరములు తిరుసభనందు ఆయా సమస్యలను చర్చించి, ఇంతకుముందు బోధించిన వాటిని మరియొకసారి నెమరువేసుకోవడమే కాకుండా ఆనందకర నిరీక్షణ పొందుట కోసం.
- కుటుంబం పట్ల ఉన్న కష్టములు, అనుచిత వాతావరణమునకు పరిష్కారాలు వెదకక, వాటిని విశ్వాసపు వెలుగునందు జాగ్రత్తగా అధ్యయనం చేయుటకు, క్షయమును కలిగించే అంశాలను ఎదుర్కొనుటకును
- కుటుంబ వ్యవస్థను స్త్రీ పురుషుల మధ్య వివాహ బంధమును ఐక్యమత్యాలను విడిపోకుండా జీవించడం అను వాటిని కుటుంబ వ్యవస్థ తిరుసభకు, సమాజమునకు మూలమని విలువనిచ్చుటకు ఈ సమావేశం నిర్వహించడం జరిగింది.

- ప్రపంచ నలుమూలల నుండి గురువులు వారి భుజముల మీద మోసుకొని వచ్చిన వారి సంఘ, ప్రాంత, కుటుంబ దు:ఖ భారమును నిరీక్షణను, కుటుంబ గొప్పతనమును, సవాళ్ళను వినుటకు...
- తిరుసభ యొక్క సజీవత్వమును ఎరుకపరచుటకు ప్రస్తుత కుటుంబ పరిస్థితిని దేవుని దృష్టితో చర్చించుటకు ఆహ్వానించుటకు, నిరుత్సాహం పొందక ఆర్థిక నైతిక సమస్యలు పెరుగుతున్న నిరాశావాదంలో కూరుకుపోతున్న ఈ తరంలో విశ్వాస జ్వాలలను రగిలించుటకు, ప్రజల హృదయాలను వెలుతురునందు ప్రకాశింపజేయుటకు..
- తిరుసభ దీనాత్ములకు పాప మన్నింపు కొరకు, పాపుల కొరకు తిరుసభ ఉందని తెలియజేయుటకు అని పరిశుద్ధ పాపుగారు తన ముగింపు ప్రసంగంలో ఈ సమావేశాన్ని నిర్వహించడంలో ఉన్న ఉద్దేశమును తెలిపి ఈ సమావేశానికి తెరదించారు.

ఈ 14వ సామాన్య మహా సమావేశం నందు చర్చించిన అంశములన్నింటిని క్రోడీకరించి సమగ్ర నివేదికను మూడు భాగాలుగా విభజించి పాపుగారికి అందించారు.

1. మొదటి భాగం : కుటుంబ సంభాషణను తిరుసభ ఆలకించుట (Church listening to the Family)
2. రెండవ భాగం: దేవుని ప్రణాళికలో కుటుంబం (The Family in the God's plan)
3. మూడవ భాగం: కుటుంబ ధర్మం (Mission & the Family)

ఈ నివేదిక అంతమున ఈ సమావేశంలో పాల్గొన్న సభ్యులందరికి కూడా ఫ్రాన్సిస్ జగద్గురువులు కుటుంబం మీద ఒక దృవీకరణ పత్రమును అతికించాలని కోరుచున్నారు. తద్వారా కుటుంబం గృహస్త క్రైస్తవులు లోకమునకు వెలుగైన క్రీస్తుని ప్రతిబింబింప చేయగలరు.

కావున సకల తిరుసభ ఈ పవిత్ర దృవీకరణ పత్రం కోసం ఎదురు చూస్తున్నారు.



**ముగింపు**

కుటుంబం పట్ల ఫ్రాన్సిస్ జగద్గురువుల ప్రేమ ప్రస్తుత పరిస్థితినందుగల ఆందోళన బట్టి ఈ సమావేశానికి నాంది పలికామని భావిస్తున్నాను. కుటుంబ వ్యవస్థ మీద సుదీర్ఘ చర్చ జరగడానికి కేటాయించిన సమయాన్ని చూసినట్లయితే కుటుంబ వ్యవస్థ యొక్క ప్రాముఖ్యత, ఆవశ్యకత ఇటు తిరుసభలోను అటు సమాజంలోను ఎంతగానో ఉందనిపిస్తుంది. ఈ సమావేశం జరిగిన విధానాన్ని చూసినట్లయితే పవిత్రాత్మ అనుగ్రహం ద్వారా ఇంత సుదీర్ఘ చర్చ జరిగిందనిపిస్తుంది. చివరి నివేదిక సమర్పించినపుడు సభ్యులంతా కూడా వారు ఏకీభవించిన విధానం ఆచర్యపరుస్తుంది. ఈ సమావేశంలో పాల్గొన్న సభ్యులలో ఎన్ని బేధాభిప్రాయాలు ఉన్నా వారు సమర్పించిన తుది నివేదిక అనుసరించి పరిశుద్ధ పాపుగారు మనకు అందించబోయే పవిత్ర అధికార దృవపత్రం కోసం మన ప్రార్థనతో నిరీక్షిస్తూ విశ్వాసంలో ముందుకు సాగుదాం.


❋ ❋ ❋ ❋

దివి యందలి భువి యందలి
ప్రతికుటుంబము తన
నిజమైన నామమును
ఆ తండ్రినుండియే
పొందుచున్నది

– ఎఫెసీ 3:15








**భక్త యోహాను ప్రచురణలు**

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ : 040-27201427, 27200370
e-mail : stjohnshyd2@gmail.com
www.stjohnseminaryhyd.org

*Holycrossprinters 9848145417*